మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం
# నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..

హైదరాబాద్ | 13 శుక్రవారం | డిసెంబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 88

ANU FURNITURE®
HYDERABAD | BENGALURU
Call: +91 9100913033, 8688003033



# భారీ ఎన్‌కౌంటర్

## 12 మంది మావోయిస్టుల మృతి



- నారాయణపూర్ జిల్లా అబూజ్ మడ్ అటవీ ప్రాంతంలో భారీ ఎన్‌కౌంటర్
- జగదల్ పూర్, నారాయణపూర్, దంతెవాడ, కొండగావ్, బీజాపూర్
- జిల్లాల్లో భద్రతా బలగాలు పెద్దఎత్తున కూంబింగ్..ఎదురుపడ్డ మావోలు
- భద్రతా దళాలు, మావోలకు మధ్య భీకర యుద్ధం
- ఎదురు కాల్పుల్లో సుమారు 12 మంది మావోల మృతి: బస్తర్ ఐజీ సుందర్‌రాజ్

7

# జమిలి బిల్లుకు ఆమోదం



- అన్ని రాష్ట్రాల అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలతో పాటు స్థానిక సంస్థలకూ ఒకేసారి ఎన్నికలు..రెండేళ్లలో ఎన్నికలకు లైన్ క్లియర్..
- ఎన్నికల ముసాయిదా బిల్లుకు పచ్చజెండా ఊపిన కేంద్ర ప్రభుత్వం
- ఈ బిల్లును పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రవేశపెట్టిన అనంతరం జాయింట్ పార్లమెంట్ కమిటీకి పంపించే అవకాశం
- ప్రత్యేకంగా అధికార, ప్రతిపక్ష సభ్యులతో కూడిన ఓ జేపీసీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు
- జమిలి ఎన్నికల బిల్లులో ఏవైనా సవరణలు ఉంటే ఈ కమిటీ ఇచ్చే సూచనలు, సలహాలకు అనుగుణంగా మార్పులు చేర్పులు

2

## ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా గుకేష్



- క్రీడా చరిత్రలో అత్యంత పిన్న వయస్కుడిగా ప్రపంచ ఛాంపియన్‌గా చరిత్ర సృష్టించిన గుకేష్
- ప్రపంచ ఛాంపియన్ షిప్ టైటిల్‌ను గెలుచుకున్న లెజెండరీ విశ్వనాథన్ ఆనంద్ తర్వాత రెండో భారతీయ గ్రాండ్ మాస్టర్‌గా నిలిచిన గుకేష్

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో

ప్రపంచ చెస్ ఛాంపియన్ షిప్‌లో భారత్ అరుదైన ఘనత సాధించింది. భారత చెస్ ప్లేయర్ గుకేష్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచాడు. చివరి గేమ్ 14లో చైనీస్ ప్లేయర్ డింగ్ లిరెన్ ను ఈ 18 ఏళ్ల గ్రాండ్ మాస్టర్ ఓడించి చరిత్ర సృష్టించాడు. క్రీడా చరిత్రలో అత్యంత పిన్న వయస్కుడైన ప్రపంచ ఛాంపియన్‌గా చరిత్ర సృష్టించాడు. ప్రపంచ ఛాంపియన్ షిప్ టైటిల్‌ను గెలుచుకున్న లెజెండరీ విశ్వనాథన్ ఆనంద్ తర్వాత రెండో భారతీయ గ్రాండ్ మాస్టర్‌గా నిలిచాడు. మ్యాచ్ లో 13 రోలర్ కోస్టర్ గేమ్స్ తర్వాత ఆఖరి పోరులో గుకేష్ ఈ టైటిల్ ను కైవసం చేసుకున్నాడు. పోటీదారులు ఇద్దరూ 6.5 పాయంట్లు సాధించారు. దీంతో అతడిపై ప్రశంసల వర్షం కురుస్తోంది.

## జనగాం సహా 4 జిల్లాల కలెక్టర్లకు తెలంగాణ హైకోర్టు నోటీసులు

జనగామ-నవభూమిబ్యూరో

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారం విషయమై జనగాం సహా నాలుగు జిల్లాల కలెక్టర్లకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. జనగాం, యాదాద్రి భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

రైతు ఆత్మహత్యలపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై గత ఏడాది హైకోర్టులో విచారణ జరిగింది. పరిహారం ఇచ్చే అంశం పరిశీలనలో ఉందని, నాలుగు నెలల్లో చెల్లిస్తామని అప్పుడు ప్రభుత్వం... కోర్టుకు తెలిపింది. అయితే ఏడాది దాటినప్పటికీ ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారం చెల్లించలేదంటూ కొండల్ రెడ్డి అనే వ్యక్తి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు.

# రైతుకు సంకెళ్లా

## సీఎం రేవంత్ సీరియస్ వార్నింగ్



హైదరాబాద్-నవభూమిబ్యూరో

రైతుకు సంకెళ్లు వేసిన ఘటనపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. లగచర్ల దాడి కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న రైతు హీర్యానాయక్‌కు సంగారెడ్డి జైలులో వైద్య పరీక్షల సమయంలో ఛాతినొప్పి వచ్చింది. దీంతో జైలు నుంచి ఆస్పత్రికి తరలించారు. అయితే, ఈ సందర్భంగా రైతు చేతులకు పోలీసులు బేడీలు వేయడం గమనార్హం. ఈ విషయం రేవంత్ రెడ్డికి దృష్టికి రావడంతో సీరియస్ అయ్యారు. అధికారులతో మాట్లాడి ఘటనపై ఆరా తీశారు సీఎం రేవంత్ రెడ్డి. రైతుకు బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని 2లో

## ఈ నెలాఖరులోగా మంత్రివర్గ విస్తరణ ఉండొచ్చు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ప్రతిపక్ష నేతగా కేసీఆర్ సభకు వస్తారని భావిస్తున్నా
- రైతుకు బేడీలు వేసి తీసుకువెళ్లడం సరికాదన్న మంత్రి
- అదానీ విషయంలో ఇక వివాదం వద్దని విజ్ఞప్తి

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

ఈ నెల 31వ తేదీలోగా మంత్రివర్గ విస్తరణ ఉండొచ్చని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈరోజు ఆయన మీడియాతో పిచ్చాపాటిగా

## గుడి-మసీదు వివాదాలకు సుప్రీం బ్రేక్



- మతపరమైన నిర్మాణాలకు సంబంధించి ఎలాంటి ఆదేశాలు జారీ చేయవద్దు..సర్వేలు కూడా చేయవద్దని సుప్రీంకోర్టు ఆదేశం
- మతపరమైన స్వభావానికి సంబంధించి కొత్త వాజ్యాలు నమోదు చేయరాదని ట్రయల్ కోర్టులకు ఆదేశం
- యూపీలోని సంభాల్ షాహీ జామా మసీదు, వారణాసిలోని జ్ఞాన్‌వాపి మసీదు, మధురలోని షాహీ ఈద్గా మసీదు, అజ్మీర్ దర్గాపై వివాదాలు

2

న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

దేశంలో రామజన్మభూమి వివాదం తర్వాత కేంద్రం తీసుకొచ్చిన ప్రార్ధనా స్థలాల పరిరక్షణ చట్టం అమల్లో ఉన్నా దాన్ని ఉల్లంఘించి స్థానిక కోర్టులు మందిరం-మసీదు వివాదాలపై ఇష్టారాజ్యంగా ఆదేశాలు ఇస్తున్న వ్యవహారంపై సుప్రీంకోర్టు స్పందించింది. ప్రార్ధనా స్థలాల పరిరక్షణ చట్టం ప్రకారం 1947లో దేశానికి స్వాతంత్రం వచ్చే నాటికి ఉన్న ప్రార్ధనా స్థలాలను ఎలాంటి మార్పులు చేయకుండా పరిరక్షించాల్సి ఉంది. కానీ స్థానిక కోర్టులు ఇస్తున్న ఆదేశాలు, సర్వేలతో దీనికి భంగం కలుగుతోందని సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తులు పీవీ సంజయ్ కుమార్, కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న ట్రయల్ కోర్టులను వారి మతపరమైన స్వభావాన్ని వివాదాస్పదం చేసే కేసులలో ప్రస్తుత మతపరమైన నిర్మాణాలకు సంబంధించి ఎటువంటి ఆదేశాలు జారీ చేయవద్దని లేదా సర్వేలు చేయవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం అమల్లో

## అమరావతి అభివృద్ధికి 8వేల కోట్ల రుణం



- 8 వేల కోట్లకు ఓకే చెప్పిన అంతర్జాతీయ బ్యాంక్..!
- ఏడీబీ కూడా అడిగిన మేరకు రుణం ఇచ్చేందుకు సిద్ధం
- మనీలాలో బ్యాంకు సమావేశంలో రుణానికి ఆమోద ముద్ర
- 6నెలలకో వాయిదా చొప్పన 23 ఏళ్లలో ఈ రుణం క్లియర్ చేయాలి

2

న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

ఏపీ రాజధాని అమరావతికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నీ శుభవార్తలే అందుతున్నాయి. ఇప్పటికే చంద్రబాబు ప్రభుత్వం అమరావతి రాజధాని నిర్మాణానికి గతంలో నిలిపేసిన టెండర్లు మళ్లీ పిలిచి పనుల నిర్మాణం ప్రారంభిస్తోంది. ఇందుకోసం అవసరమైన వేల కోట్ల నిధుల కోసం అంతర్జాతీయ బ్యాంకుల సాయం కోరింది. ఇందుకోసం ప్రపంచ బ్యాంకుతో పాటు ఆసియా అభివృద్ధి బ్యాంక్ కూడా ముందుకొచ్చాయి. ఇప్పటికే ప్రపంచ బ్యాంక్ ఆమోదం తెలపగా.. ఇప్పుడు ఏడీబీ కూడా

## తెలంగాణను కప్పేయనున్న పొగమంచు

- 3 రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల తక్కువ నమోదు
- చాలా ప్రాంతాల్లో ఉదయం వేళల్లో పొగమంచు..అక్కడక్కడ చలి గాలులు
- చలికాలంలో బ్రెయిన్‌స్ట్రోక్, గుండెపోటు వంటి కారణాలతో మరణించే వారి సంఖ్య అధికం

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో నిన్న మొన్నటి వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవగా.. ఇక రానున్న రోజుల్లో మరింత తీవ్రంగా చలి ఉండనుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో రాగల మూడు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల తక్కువ నమోదయ్యే అవకాశముందని వెల్లడించింది. మూడు రోజుల పాటు కొన్ని జిల్లాల్లోని చాలా ప్రాంతాల్లో ఉదయం వేళల్లో పొగమంచు కురుస్తుందని తెలిపింది. ఉత్తర తెలంగాణలో కొన్ని ప్రాంతాలలో మూడు రోజులు అక్కడక్కడ చలి గాలులు వీస్తాయని పేర్కొంది. గురువారం రాష్ట్రంలోని కింది స్థాయిగాలులు ప్రధానంగా ఉత్తర, ఈశాన్య దిశల నుంచి వీస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ' మరోవైపు, చలికాలంలో బ్రెయిన్ స్ట్రోక్, గుండెపోటు వంటి కారణాలతో మరణించే వారి సంఖ్య అధికంగా ఉంటుందని గణాంకాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో ఆసుపత్రులకు వెళ్లే వారి సంఖ్యను చూస్తే చలి తీవ్రతకు అద్దం పడుతోంది. తెలంగాణ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో తీవ్రమైన చలి ఉండటంతో ఉదయం 7 గంటలకు ముందు.. రాత్రి 9 గంటల తర్వాత బయటికి రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వైద్యులు చలికాలంలో ప్రజలు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను వివరిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులున్న వారు జాగ్రత్తలు పాటించాలని.. ముఖ్యంగా 60ఏళ్లు పైబడిన వారిలో రక్తనాళాలు కుచించుకు పోవడంతో పాటు రక్తం గడ్డ కట్టే సమస్యలు ఈ కాలంలో అధికంగా ఉంటాయన్నారు. కనీసం

## ఏపీలో ఇక అనాథలకు పెన్షన్

న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

ఏపీలో పెన్షన్ల పంపిణీ, లబ్దిదారులపై ఇవాళ అమరావతిలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు ఇస్తున్నారు. ఉదయం జరిగిన సెషన్ లో పెన్షన్ల లబ్దిదారుల్లో అనర్హుల ఏరివేత, ఇతర మార్పులు సూచించిన చంద్రబాబు, అనంతరం తల్లితండ్రులు లేని చిన్నారులకు సైతం పెన్షన్లు ఇవ్వాలని కలెక్టర్లకు కీలక ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటివరకూ రాష్ట్రంలో వీరికి పెన్షన్లు లభించడం లేదు. %ాణ% తల్లిదండ్రులు చనిపోయిన చిన్నారులకు పింఛను ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఇవాళ కలెక్టర్లను ఆదేశించారు. కలెక్టర్ ల సమావేశంలో ఈమేరకు ఆయన సూచించారు. ఇక రాష్ట్రంలో 3 నెలల్లో అన్నార్తులను గుర్తించి పింఛను కల్పించాలని స్పష్టం చేశారు. ఆ తరువాత కూడా ప్రతి ఏడాది అన్నార్తుల జాబితాను అప్‌డేట్ చేయాలని సూచించారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6 లక్షల మంది అన్నార్తులకు పింఛను పంపిణీ చేస్తున్నట్లు మంత్రి నారా లోకేష్ సీఎం చంద్రబాబుకు తెలిపారు.

# జర్నలిస్టుపై దాడికి చింతిస్తున్నా..

- ఆడియో సందేశాన్ని విడుదల చేసిన మోహన్‌బాబు
- జర్నలిస్టులను కొట్టాలని దైవసాక్షిగా అనుకోలేదు
- జర్నలిస్టులకు మొదట దండం పెట్టా..మైక్ నాకన్నుకు తగలబోయింది
- దాంతో అనుకోకుండా మైక్ లాగేసుకోవాల్సి వచ్చింది
- జరిగిన ఘటనకు బాధపడుతున్నా..జర్నలిస్టు నా తమ్ముడులాంటివాడు
- ఎన్నో సేవా కార్యక్రమాలు చేశా..మంచి పనులను అర్థం చేసుకోవడం లేదు

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

సినీ నటుడు మోహన్‌బాబు కుటుంబ వివాదం నేపథ్యంలో ఆయన ఇంటివద్దకు వెళ్లిన జర్నలిస్టుపై ఆయన దాడి చేశారంటూ పెద్ద ఎత్తున చర్చ జరగుతున్న వేళ.. ఈ ఘటనపై తొలిసారి మోహన్ బాబు స్పందించారు. ఆడియో సందేశాన్ని మోహన్ బాబు విడుదల చేశారు. ఆరోజు అసలు ఏం జరిగిందనే విషయాన్ని ఆయన వివరించారు. ఆరోగ్యం బాగోలేకపోవడంతో మోహన్ బాబు హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. పరిస్థితి కొంచెం కుదుటుపడటంతో ఆయన

### ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్

2

గత మూడు రోజులుగా మంచు ఫ్యామిలీలో వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. ఈ గొడవల నేపథ్యంలో మోహన్ బాబు అనారోగ్య సమస్యలతో హైదరాబాద్ లోని కాంటినెంటల్ ఆసుపత్రిలో మంగళవారం రాత్రి చేరారు. విపరీతమైన ఒళ్లు నొప్పులు, స్పృహ కోల్పోయిన పరిస్థితుల్లో

## వైసీపీకి అవంతి రాజీనామా

- తప్పు తెలుసుకోవాలంటూ జగన్‌కు సూచన!
- జగన్‌కు రాజీనామా లేఖను పంపిన అవంతి శ్రీనివాస్
- ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలని జగన్‌కు హితవు
- వైసీపీలో కార్యకర్తలు నలిగిపోయారని ఆవేదన

2



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

వైసీపీ పార్టీకి మరో భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షుడు జగన్, ఉత్తరాంధ్ర వైసీపీ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డికి పంపించారు. ఈ సందర్భంగా మీడియాతో అవంతి మాట్లాడుతూ... పార్టీ అధ్యక్షుడు జగన్ పై విమర్శలు గుప్పించారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే... ప్రభుత్వంపై విమర్శలు గుప్పించడం సరికాదని ఆయన అన్నారు. ప్రభుత్వానికి కనీసం ఒక ఏడాది సమయం ఇవ్వాలని చెప్పారు. ఐదు నెలల సమయం కూడా ఇవ్వకుండానే ధర్నాలు చేయాలంటే ఎలాగని ప్రశ్నించారు.


ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును జగన్ గౌరవించాలని అవంతి అన్నారు. ఐదేళ్లు పాలించాలని కూటమికి ప్రజలు అవకాశం ఇచ్చారని వ్యాఖ్యానించారు. ఎన్నో పథకాలను అమలు చేసి కూడా... ఎన్నికల్లో ఓడిపోయామంటే... తప్పు ఎక్కడ జరిగిందో తెలుసుకోవాలని చెప్పారు. పార్టీ అనేది

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
2 హైదరాబాద్ శుక్రవారం 13 | డిసెంబర్ | 2024



# చురుగ్గా 'సమగ్ర కుటుంబ సర్వే' ఆన్‌లైన్ నమోదు..

**హైదరాబాద్-నవభూమి:** సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌చేసే ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఖైరతాబాద్ సర్కిల్‌కు చెందిన వివరాలను లక్డీకాపూల్‌లోని ఐఐఎంసీ కళాశాలలో ఆన్‌లైన్ చేస్తుండగా, జూబ్లీహిల్స్ సర్కిల్‌కు సంబంధించి షేక్‌పేటలోని నారాయణమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో డేటా ఎంట్రీ చేస్తున్నారు. ఎన్యూమరేటర్లు సర్వే నిర్వహించారు.. వాటిని జంట సర్కిళ్లలో డేటా ఎంట్రీ ద్వారా ఆన్‌లైన్ చేసేందుకు ఏజెన్సీలకు అప్పగించారు. ఖైరతాబాద్ సర్కిల్‌లో 49 వేల ఇళ్లను గుర్తించగా, సొంతూర్లలో వివరాలు ఇచ్చిన వారు, ఇక్కడ ఉన్నందుకు నిరాకరించిన వారు, తాళాలు వేసి ఉన్న ఇళ్ల వారిని మినహాయిస్తే 43500 ఇళ్లకు చెంది న వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా విద్యార్థులు సర్కిల్ 18 (జూబ్లీహిల్స్) సర్కిల్‌లో మొత్తం 47, 484 ఇళ్లలో సర్వే చేయగా, అందులో ఇప్పటి వరకు 21500 ఇళ్లలో వారి వివరాలను ఆన్‌లైన్ చేశామని అధికారులు తెలిపారు. ఈ సర్కిల్‌లో ప్రతిరోజూ 5 నుంచి 7 శాతం వరకు డేటా ఎంట్రీ జరుగుతోందన్నారు. కాగా అటు ఐఐఎంసీలో, ఇటు నారాయణమ్మ ఇంజనీరింగ్ కాలేజీలో పనులు తీసుకున్న ఏజెన్సీలు చాలా మంది విద్యార్థులకే పనులను అప్పగించాయి.



## కాంగ్రెస్‌ను చంపేస్తారా.. జాతీయ నాయకులపై జగ్గారెడ్డి ఫైర్



**హైదరాబాద్-నవభూమి:** కాంగ్రెస్ జాతీయ నాయకులపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐసీసీ నాయకుల తీరుపై ఆయన మండిపడ్డారు. ఏఐసీసీ కార్యదర్శి విష్ణుతో పాటు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ వ్యవహార సరిగ్గా లేదని జగ్గారెడ్డి తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను చంపేస్తారా అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసలు ఏఐసీసీ కార్యదర్శి విష్ణు, ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ రాష్ట్రంలో ఉన్నారా.. వేరే రాష్ట్రానికి వెళ్లిపోయారా అని ప్రశ్నించారు. అధికార పార్టీ అంటే ఎలా ఉండాలి.. ఇలాగేనా అధికార పార్టీ ఉండే తీరు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఏం చేస్తున్నారో మీకైనా అర్థమవుతోందా అని మండిపడ్డారు. తెలంగాణలో నామినేటెడ్ పోస్టులతో పాటు పార్టీ పదవుల కేటాయింపుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కీలక నేతలైన తమకు తెలియకుండా నియామకాలు జరుగుతుండటంపై జగ్గారెడ్డి ఫైర్ అయినట్లు తెలుస్తోంది. పార్టీలో పదవులు, ప్రభుత్వంలో నామినేటెడ్ పోస్టులకు సంబంధించి స్థానిక నేతలకు సరైన సమాచారం ఉండకపోవడంపై జగ్గారెడ్డి ఏఐసీసీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమతో ఎలాంటి చర్చలు జరపకుండానే పేర్లు ప్రకటిస్తున్నారని జగ్గారెడ్డి తెలిపారు. తమకు తెలియకుండా కొత్తవారిని పదవుల కోసం సిఫార్సు చేస్తున్నారని, అధిష్టానం ఫైనల్ చేసిన తర్వాత తమకు తెలుస్తోందన్నారు. ఇలాచేస్తే కాంగ్రెస్ పార్టీ మనుగడ తెలంగాణ కష్టమవుతుందన్నారు. తెలంగాణలో పార్టీని చంపేయాలనే లక్ష్యంతో కొందరు నేతలు పనిచేస్తున్నట్లు ఆరోపించారు. ఏఐసీసీ నేతలపై జగ్గారెడ్డి వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. జగ్గారెడ్డికి ఆగ్రహం తెప్పించేలా ఎలాంటి నియామకాలు చేపట్టారనే విషయంపై స్పష్టత రావాల్సిఉంది. గతంలోనూ పార్టీలో కొందరు నాయకుల తీరుపై జగ్గారెడ్డి బహిరంగంగా విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని బహిరంగంగానే జగ్గారెడ్డి చెబుతుంటారు. దీనిలో భాగంగా ఏఐసీసీ నేతలపై జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సంచలనంగా మారాయి.ఏ విషయానైన్నా జగ్గారెడ్డి ముక్కుసూటిగా చెబుతారనే పేరుంది. సొంత పార్టీ నేతలపై అప్పుడప్పుడు జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తుంటారు. అవతలివారి స్థాయిని పక్కనపెట్టి మరీ విమర్శలు చేస్తుంటారు. పార్టీపై విపక్షాలు విమర్శలు గుప్పించినా ధీటుగా సమాధానం ఇస్తుంటారు. ప్రస్తుతం సొంత పార్టీ నేతలపైనే ఆయన విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టుల నియామకంలో ఎప్పటినుంచో కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడుతున్నవారికి దక్కడం లేదదంటూ జగ్గారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఏఐసీసీ కార్యదర్శి విష్ణు, ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ తమ పనితీరు మార్చుకోవాలని జగ్గారెడ్డి హితవు పలికారు.


## వేములవాడ రాజన్నను దర్శించుకున్న పుష్ప-2 నటి.. ప్రత్యేక అవతారంలో ప్రత్యక్షం..!



**వేములవాడ-నవభూమి:** దేశవ్యాప్తంగా పుష్ప-2 సినిమా దుమ్ములేపుతోంది. అతితక్కువ సమయంలోనే.. వెయ్యి కోట్ల క్లబ్‌లో చేరిన మొట్టమొదటి సినిమాగా రికార్డు సృష్టించి.. కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. దీంతో.. పుష్ప-2లో నటించిన నటీనటులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తోంది. ఇదే క్రమంలో.. పుష్ప-2 సినిమా నటి గార్లపాటి కల్పలత.. వేములవాడ రాజన్న ఆలయాన్ని దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అయితే.. సినిమాలో పుష్ప రాజ్ తల్లిగా కనిపించిన కల్పలత.. గుడిలో కాషాయ వేషదారణలో కనిపించి ఆశ్చర్యపరిచారు.

దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని పుష్ప-2 నటి గార్లపాటి కల్పలత సందర్శించారు. ఈరోజు (డిసెంబర్ 12న) తెల్లవారుజామున.. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం.. ఆలయ అర్చకులు ఆమెకు లడ్డు ప్రసాదం అందజేసి వేద ఆశీర్వచనం ఇచ్చారు. అయితే.. గార్లపాటి కల్పలత స్వామివారి దర్శించుకున్న సందర్భంలో.. కాషాయ వేషధారణ, మెడలో రుద్రాక్ష మాలలతో కనిపించారు. దీంతో.. కల్పలత ఏదైనా దైవమాలలో ఉన్నారా.. లేదా రాజన్న దర్శనం కోసం ఇలా వచ్చారా అన్నది ప్రస్తుతం చర్చించుకుంటున్నారు. పుష్ప, పుష్ప-2 సినిమాల్లో హీరో అల్లు అర్జున్‌కు తల్లిగా నటించారు గార్లపాటి కల్పలత. పుష్పరాజ్ తల్లిగా ఆమె ఎమోషనల్ నటనకు మంచి మార్కులే పడ్డాయి. కొన్ని సీన్లలో ప్రేక్షకులను కూడా భావోద్వేగానికి గురయ్యేలా నటించి మెప్పించారు కల్పలత. మొదటి భాగంలో నిరుపేద తల్లిగా, కుటుంబం వెలివేస్తే దూరంగా బతుకుతున్న ఓ ఇల్లాలిగా కల్పలత.. తన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అయితే.. రెండో భాగంలో కూడా తనదైన నటనతో మెప్పించారు.అయితే.. సినిమాల్లో ఓ తల్లిగా, మధ్యతరగతి ఇల్లాలిగా, ఎమోషనల్ పాత్రల్లో కనిపిస్తూ.. తన నటనతో ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేసే కల్పలత. ఉన్నట్టుండి ఇలా ఆధ్యాత్మికంగా మారిపోయి, కాషాయ వేషధారణలో కనిపించింది. సినిమాల్లో ఎమోషనల్ క్యారెక్టర్లలో.. బయట మాత్రం ట్రెండీగా కనిపించే కల్పలత.. ఒక్కసారిగా ఇలా ఆధ్యాత్మికంగా కనిపించటం అందరినీ ఆశ్చర్యపరిచింది.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన గార్లపాటి కల్పలత.. అల్లు అర్జున్ నటించిన వేదం సినిమాతో తెలుగు ఇండస్ట్రీలో అడుగు పెట్టారు. సుమారు 40 వరకు సినిమాల్లో నటించారు. అయితే.. చాలా వరకు సినిమాల్లో తల్లి పాత్రలు పోషిస్తున్న కల్పలత.. గుండెలు బరువెక్కించి కన్నీళ్లు తెప్పించే నటనతో ప్రేక్షకులకు చేరవయ్యారు. ఎక్కువ శాతం ఎమోషనల్ పాత్రల్లోనే కల్పలత కనిపిస్తూ మెప్పిస్తుండటం గమనార్హం. బీద మహిళగా, మధ్యతరగతి తల్లిగా పలు పాత్రల్లో కల్పలత జీవిస్తూ.. తనకంటే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు కల్పలత.

# రోజుకు రూ.2 లక్షలకుపైగా అతని సంపాదన..



**హైదరాబాద్-నవభూమి:** అక్రమాస్తుల కేసులో అరస్టయి జ్యూడీషియల్ రిమాండ్‌లో ఉన్న ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ నిఖేస్ కుమార్ ను ఏసీబీ తన కస్టడీలోకి తీసుకుంది. కోర్టు ఆదేశాలతో నాలుగు రోజులపాటు విచారించనుంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టు అయి చంచల్ గూడ జైల్లో అతనిని గురువారం ఏసీబీ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. రూ. 5 వందల కోట్లకుపైగా అక్రమాస్తులు కూడపెట్టారని అతనిపై ఆరోపణలు ఉన్నాయి. నిఖేష్ బినామీ అస్తులపై కూడా అధికారులు దర్యాప్తు చేయనున్నారు.నీటిపారుదల శాఖలో ఏఈఈగా పనిచేస్తూ ఇటీవల ఏసీబీ చిక్కిన నిఖేష్ కుమార్.. రోజుకు రూ. 2 లక్షలకుపైగా సంపాదించాడు. ఉద్యోగంలో చేరిన కొద్ది కాలంలోనే అడ్డగోలుగా సంపాదించాడు. నిఖేష్ కుమార్‌తోపాటు అతని సన్నిహితుల ఇళ్లపై ఏసీబీ బృందాలు నిర్వహించిన తనిఖీల్లో రూ. 17 కోట్ల 73 లక్షల అక్రమాస్తులు వెలుగుచూశాయి. ఒక లాకర్‌లో కిలోన్నర బంగారు ఆభరణాలు లభ్యమయ్యాయి. వాటన్నింటి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ. వంద కోట్లపైనే ఉంటుందని అందచా వేస్తున్నారు. నిఖేష్ కుమార్ ఉద్యోగంలో చేరి పదేళ్లవుతోంది. ఈ క్రమంలో అతడి అక్రమార్జన గురించి లెక్కగడితే సగటున రోజుకు రూ.2 లక్షలకు తక్కువ కాకుండానే ఉన్నట్లు తేలుతోంది. ఇంత భారీగా కూడబెట్టేందుకు నిఖేశ్‌కుమార్ ఎలాంటి కుయుక్తులకు పాల్పడ్డాడనేది తేల్చేపనిలో ఏసీబీ అధికారులు నిమగ్నమయ్యారు. ఆయన మరెవరికైనా బినామీగా వ్యవహరించాడా అనే విషయాన్నీ తేల్చే ప్రయత్నంలో ఉన్నారు.నిఖేష్ కుమార్ పదేళ్ల క్రితమే ఉద్యోగంలో చేరినా... గండిపేట ఏఈఈగా పోస్టింగ్ వచ్చాకే అతడి అక్రమార్జన ఇంతింతై.. పెరిగినట్లు తెలుస్తోంది. నీటిపారుదల శాఖలో చేరిన నిఖేశ్‌కుమార్ తొలుత వరంగల్ జిల్లాలో పనిచేసి... తర్వాత వికారాబాద్ జిల్లాకు బదిలీ అయ్యాడు. మూడేళ్ల క్రితం రంగారెడ్డి జిల్లాకు వచ్చాక రెచ్చిపోయినట్లు కనిపిస్తోంది. కీలకమైన ఇబ్రహీంపట్నం, మేడ్చల్, గండిపేట ఏఈఈగా పోస్టింగ్ దక్కడంతో వసూళ్లే ధ్యేయంగా పనిచేసినట్లు తెలుస్తోంది. నాలాలు, జలాశయాల పరిధిలో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో అక్రమ నిర్మాణాలకు నిరభ్యంతర పత్రాలు జారీ చేయడం ద్వారా అక్రమార్జనకు పాల్పడ్డాడు. వాస్తవానికి క్లియరన్సీ సర్టిఫికేట్ జారీ చేసే అథారిటీ ఏఈఈ కాకపోయినా... ఆయా దరఖాస్తులను ఫార్వర్డ్ చేసేందుకు, వాటిని క్లియర్ చేయించేందుకు భారీగా వసూళ్లు చేయడంతోపాటు ఉన్నతాధికారుల తరఫున వాటాలనూ సేకరించి, ముట్టజెప్పినట్లు దర్యాప్తులో తేలింది. దీంతో ఉన్నతాధికారుల పాత్రపైనా ఏసీబీ ఆరా తీస్తుండటం ప్రాధాన్యం సంతరించుకొంది. ఎవరైనా ఉన్నతాధికారులకు లేదంటే నేతలకు నిఖేశ్‌కుమార్ బినామీగా వ్యవహరించాడా అనే కోణంలోనూ ఆరా తీస్తున్నారు.

**రూ. 50 లక్షల వరకూ వసూలు..**

నిఖేశ్‌కుమార్ పేరుకే గండిపేట ఏఈఈగా పనిచేసినా హైదరాబాద్, రంగారెడ్డి, మల్కాజిగిరి జిల్లాల్లోని రికార్డులను డీల్ చేసేవాడని తెలుస్తోంది. అతడి ద్వారా దస్త్రం పంపిస్తే వెనక్కి వచ్చేదే కాదని చెబుతున్నారు. ఉన్నతాధికారులను నయానా బయానా ఒప్పించడంలో నిఖేశ్ దిట్టగా పేరొందాడు. ఈక్రమంలో కొన్ని కీలక ఫైళ్లను క్లియర్ చేసేందుకు రూ. 50 లక్షల వరకూ వసూలు చేసి ఉన్నతాధికారులకు వాటాలు పంచాడనే ఆరోపణలున్నాయి. జలాశయాల పరిధిలోని బఫర్, ఎఫ్‌టీఎల్‌ల్లో నిర్మాణాలకు నిఖేశ్ సులభంగా అనుమతులను ఇప్పించడంతో బడావ్యాపారులు ఎంత మొత్తమైనా ముట్టజెప్పేందుకు వెనకాడేవారు కాదని చెబుతున్నారు. విలువైన స్థలమంతా అప్పనంగా వచ్చేస్తుండటంతోనే వ్యాపారులు అలా ముందుకొచ్చేవారని తెలుస్తోంది.

**ఫార్వర్డ్ చేసిన దరఖాస్తులపైనా ఆరా**

గండిపేట ఏఈఈగా నిఖేశ్‌కుమార్ ఫార్వర్డ్ చేసిన దరఖాస్తులపై ఏసీబీ ఆరా తీస్తోంది. ఈ క్రమంలోనే బడా బిల్డర్లు, స్థిరాస్తి వ్యాపారుల అక్రమ కట్టడాలపై దృష్టి సారించింది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల పరిధిలో భారీ నిర్మాణాల కోసం వారు పెద్దమొత్తంలో లంచాలు ఇచ్చి ఉంటారనే అనుమానాలున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా దరఖాస్తుల గురించి వివరాలు సేకరిస్తున్నారు. అనంతరం ఉన్నతాధికారులకూ నోటీసులు ఇచ్చి విచారించే అవకాశం కనిపిస్తోంది.

# జమిలి బిల్లుకు ఆమోదం

**న్యూఢిల్లీ-నవభూమి:** వన్ నేషన్- వన్ ఎలక్షన్‌పై కీలక ముందడుగు పడింది. అన్ని రాష్ట్రాల అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలతో పాటు స్థానిక సంస్థలకూ ఒకేసారి ఎన్నికలను నిర్వహించడానికి ఉద్దేశించిన ఈ ఎన్నికల ముసాయిదా బిల్లుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలపై కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కోవింద్ ఛైర్మన్‌గా వ్యవహరించిన ఈ కమిటీలో మద్రాస్ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ సంజీబ్ బెనర్జీ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్రా, రాజ్యసభ మాజీ సభ్యుడు గులాంనబీ ఆజాద్, లోక్‌సభ మాజీ సెక్రెటరీ జనరల్ సుభాష్ సీ కశ్యప్, మాజీ సీవీసీ సంజయ్ కొఠారి, సీనియర్ అడ్వొకేట్ హరీష్ సాల్వే సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ఇదివరకే తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేసింది కూడా. దీనిపై తాజాగా కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇదే ముసాయిదా బిల్లును ప్రస్తుత పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో సభలో ప్రవేశ పెట్టబోతోంది. కేంద్ర కేబినెట్ ఆమోదం పొందిన నేపథ్యంలో దీన్ని సభలో టేబుల్ చేయడానికి లైన్ క్లియర్ అయింది. ఈ బిల్లును పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రవేశపెట్టిన అనంతరం జాయింట్ పార్లమెంట్ కమిటీకి పంపించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. దీనిపై ప్రత్యేకంగా అధికార, ప్రతిపక్ష సభ్యులతో కూడిన ఓ జేపీసీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. జమిలి ఎన్నికల బిల్లులో ఏవైనా సవరణలు ఉంటే ఈ కమిటీ ఇచ్చే సూచనలు, సలహాలకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేస్తుంది. వన్ నేషన్ వన్ ఎలక్షన్ అమలులోకి 2027 ఫిబ్రవరిలో దేశవ్యాప్తంగా ఒకేసారి అన్ని రాష్ట్రాల అసెంబ్లీలు, లోక్‌సభకు ఎన్నికలు జరగడం ఖాయంగా కనిపిస్తోంది. అదే సమయంలో పంచాయతీ మొదలుకుని, మున్సిపల్ కార్పొరేషన్ వరకు గల అన్ని స్థానిక సంస్థలకూ ఎన్నికలను నిర్వహించే అవకాశాలు లేకపోలేదు. నిజానికి- ఇప్పుడు ఎన్నికైన లోక్ సభ కాలపరిమితి 2029 వరకు కొనసాగాల్సి ఉంది. ఈ లోక్‌సభ పూర్తికాలం పాటు కొనసాగబోదంటూ కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా ఇదివరకే ప్రకటించిన విషయం తెలిసిందే. 2029 లోపే వన్ నేషన్ వన్ ఎలక్షన్‌ను అమలు చేసి తీరుతామంటూ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో 2027 ఫిబ్రవరిలో దేశవ్యాప్తంగా ఎన్నికలు జరగడం దాదాపుగా ఖాయమైనట్టే.

## అమరావతి అభివృద్ధికి 8వేల కోట్ల రుణం

(1వపేజీ తరువాయి)అడిగిన మేరకు రుణం ఇచ్చేందుకు సిద్ధమైంది. అమరావతి రాజధాని నిర్మాణం కోసం రూ.8 వేల కోట్ల రుణం కావాలని గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఆసియా అభివృద్ధి బ్యాంకును కోరింది. దీనిపై తాజాగా ఢిల్లీలో జరిగిన భేటీలో ప్రపంచ బ్యాంకు, ఇతర రుణాలిచ్చే సంస్థలు, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులతో చర్చించిన ఏడీబీ అధికారులు.. మనీలాలో జరిగిన సమావేశంలో దీనికి ఆమోద ముద్ర వేసినట్లు తెలుస్తోంది. దీంతో తదుపరి ప్రక్రియ ప్రారంభించేందుకు మార్గం సుగమం అయింది. వచ్చే నెలలో ప్రపంచ బ్యాంక్ బోర్డు సమావేశం జరగనుంది. ఇందులో ఆసియా అభివృద్ధి బ్యాంక్ కూడా సంతకాలు చేయనుంది. ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ కలిసి అమరావతి రాజధానికి రూ.13500 కోట్లు రుణంగా ఇవ్వబోతున్నాయి. అందుకే ఇరు బ్యాంకులు కలిసి ఒప్పందంపై సంతకాలు చేస్తారు. మరో రూ.1500 కోట్లు కేంద్రం ఇస్తుంది. దీంతో గత కేంద్ర బడ్జెట్ లో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చెప్పిన రూ.15 వేల కోట్లు అమరావతికి సమకూరినట్లే. ఐదేళ్ల తర్వాత ఈ రుణాల చెల్లింపు ప్రారంభమవుతుంది. ఆలోపు రాజధాని పూర్తి చేయాలి. అయితే ఆరునెలలకో వాయిదా చొప్పన 23 ఏళ్లలో ఈ రుణం క్లియర్ చేయాల్సి ఉంటుంది. దీన్ని చెల్లించేందుకు కేంద్రం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

## ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్

(1వపేజీ తరువాయి)ఆయన ఆసుపత్రిలో చేరారు. ఆయన ఎడమ కంటి కింద గాయమయింది. బీపీ పెరిగింది. గుండె కొట్టుకోవడంలో కూడా హెచ్చుతగ్గులు కనిపించాయి.ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగవడంతో వైద్యులు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ఈ మధ్యాహ్నం 2 గంటలకు ఆసుపత్రి నుంచి ఆయన డిశ్చార్జ్ అయ్యారు. ఆసుపత్రి నుంచి నేరుగా జల్ పల్లి లోని ఇంటికి చేరుకున్నారు. మరోవైపు మీడియా ప్రతినిధిపై దాడి చేసిన ఘటనకు సంబంధించి మోహన్ బాబుపై హత్యాయత్నం కేసును పోలీసులు నమోదు చేశారు.

## జర్నలిస్టుపై దాడికి చింతిస్తున్నా..

(1వపేజీ తరువాయి)ఆడియో సందేశాన్ని రిలీజ్ చేశారు.

జర్నలిస్ట్‌పై దాడి చేశారని జరుగుతున్న ప్రచారంపై ఆయన స్పందిస్తూ జర్నలిస్టులను కొట్టాలని తాను దైవసాక్షిగా అనుకోలేదన్నారు. మొదట తాను జర్నలిస్టుకు నమస్కారం పెట్టానని, అయినా అతను తన వద్ద మైక్ పెట్టారని తెలిపారు. ఆ మైక్ తన కన్నుకు తగలబోయిందని, తృటిలో తాను తప్పించుకున్నట్లు చెప్పారు. విజయవాడలో తాను ఒకప్పుడు ఉద్యోగినేనని గుర్తు చేశారు. తన ఇంటికి వచ్చినవారు మీడియా వారా వేరే వారు ఎవరైనా వచ్చారా అనే విషయం తనకు తెలియదన్నారు. జరిగిన సంఘటనకు తాను మనస్ఫూర్తిగా చింతిస్తున్నట్లు తెలిపారు. జరిగిన ఘటనకు బాధపడుతున్నానని, ఆ జర్నలిస్టు తనకు తమ్ముడులాంటి వారన్నారు. అన్ని విషయాలను పైన భగవంతుడు చూస్తున్నారని మోహన్ బాబు తెలిపారు.

తాను ఎన్నో సేవా కార్యక్రమాలు చేశానని, తాను చేసిన మంచి పనులను ఎవరూ అర్థం చేసుకోవడంలేదన్నారు. జర్నలిస్టులను కొట్టడం మాత్రం తప్పే అయినప్పటికీ.. సందర్భాన్ని అర్థం చేసుకోవాలని మోహన్‌బాబు తన ఆడియో సందేశంలో పేర్కొన్నారు. తాను ఉద్దేశపూర్వకంగా కొట్టలేదన్నారు. మైకులు లాక్కుని కొట్టేంత మూర్ఖుడిని తాను కాదన్నారు. పోలీసులంటే తనకు ఎంతో ఇష్టమని, వారు శాంతి భద్రతలను కాపాడాలన్నారు. కొందరు పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మోహన్‌బాబు తెలిపారు. ఇది న్యాయమా.. అన్యాయమా అనేది ఆలోచించాలన్నారు.

**అసలు ఏం జరిగిందంటే..**

తనపై తండ్రి మోహన్ బాబు, అతడి అనుచరులు దాడి చేశారని మంచు మనోజ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వివాదం మొదలైంది. ఆ తర్వాత మంచు మోహన్‌బాబు తన కుమారుడు తనపై దాడికి పాల్పడ్డారంటూ మనోజ్, మౌనికపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వివాదం రచ్చకెక్కడంతో మీడియా ఈ అంశంపై ఫోకస్ చేసింది. మోహన్‌బాబు ఇంటి వద్ద న్యూస్ కవరేజ్ చేస్తున్న ఓ జర్నలిస్ట్‌పై మోహన్ బాబు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన సంచలనం రేపడంతో అసలు ఏం జరిగిందనే దానిపై మోహన్ బాబు క్లారిటీ ఇచ్చారు. తన ఆడియో సందేశంలో పూర్తి వివరాలను మోహన్ బాబు వివరించారు.

# ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా గుకేష్

(1వపేజీ తరువాయి)పద్దెనిమిదేళ్లకే ప్రపంచ ఛాంపియన్ గా నిలిచిన గుకేష్ విశ్వనాథన్ ఆనంద్ రికార్డును బ్రేక్ చేశాడు. అతడి తర్వాత ఈ ఘనత సాధించిన ఏకైక వ్యక్తిగా నిలిచాడు. చెన్నైకి చెందిన గుకేష్.. మే 29, 2006లో జన్మించాడు. అతడి తండ్రి డాక్టర్ రజనీకాంత్ ప్రఖ్యాత ఈ ఎన్ టీ నిపుణుడు. తల్లి డాక్టర్ పద్మ మైక్రోబయాలజిస్టు. ఏడేళ్ల వయసులో గుకేష్.. తన టాలెంట్ ను తొలిసారి బయటపెట్టాడు.2015 నాటికి అతడికి ఆసియా స్కూల్ ఆఫ్ చెస్ ఛాంపియన్ షిప్ లో అండర్-9 విభాగంలో గెలుపొందాడు. దీంతో చెస్ క్రీడలో తనదైన ముద్ర వేసుకున్నాడు. 2018లో అతను ప్రపంచ యూత్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో విజయం సాధించాడు. ఆసియా యూత్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో అద్భుతమైన ఐదు బంగారు పతకాలను సాధించాడు. అతను 2017లో అంతర్జాతీయ మాస్టర్‌గా, రెండు సంవత్సరాల తర్వాత, చెస్ చరిత్రలో మూడవ అతి పిన్న వయస్కుడైన గ్రాండ్‌మాస్టర్‌గా మారిన గుకేష్ ఒక్కో మెట్టు ఎదుగుతూ వచ్చాడు.తాజాగా సింగపూర్‌లో జరిగిన ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ గుకేశ్ సత్తాకు అంతిమ పరీక్షగా మారింది. డింగ్ లిరెన్‌తో జరిగిన ఈ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. 13 గేమ్‌ల తర్వాత 6.5-6.5తో టై అయింది. ఛాంపియన్‌ను నిర్ణయించే చివరి క్లాసికల్ గేమ్‌తో, గుకేష్ అద్భుతమైన వ్యూహాత్మ క నైపుణ్యం, ఖచ్చితత్వాన్ని ప్రదర్శించాడు. చివరి రౌండ్ చివరి గేమ్‌లో గుకేశ్ ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. డింగ్‌ను డిఫెన్సివ్ పొజిషన్‌లోకి నెట్టడానికి అదనపు బంటును ఉపయోగించుకున్నాడు.

## గుడి-మసీదు వివాదాలకు సుప్రీం బ్రేక్

(1వపేజీ తరువాయి)ఉన్న ప్రార్థనా స్థలాల చట్టం 1991కి ఉన్న రాజ్యాంగ బద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారిస్తున్న సుప్రీంకోర్టు బెంచ్..చట్టాన్ని సవాలు చేసే పిటిషన్లను విచారించి పరిష్కరించే వరకు అటువంటి నిర్మాణాల మతపరమైన స్వభావానికి సంబంధించి కొత్త వాజ్యాలు నమోదు చేయరాదని ట్రయల్ కోర్టుల్ని ఆదేశించింది. సుప్రీంకోర్టులో ప్రార్ధనా స్థలాల చట్టంపై విచారణ జరుగుతున్నట్లు కింది కోర్టులు ఇలా ఇష్టారాజ్యంగా ఉత్తర్వులు జారీ చేయడం సరికాదని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రార్ధనా స్థలాల చట్టం రాజ్యాంగ బద్ధత విషయంలో కేంద్రం ఇంకా సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాల్సి ఉంది. దీనిపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ.. 1991 చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై స్పందించేందుకు తనకు సమయం కావాలని అన్నారు. దీంతో నాలుగు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.ప్రస్తుతం యూపీలోని సంభాల్‌లో ఉన్న షాహీ జామా మసీదు, వారణాసిలోని జ్ఞాన్‌వాపి మసీదు, మథురలోని షాహీ ఈద్గా మసీదు, రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గాపై వివాదాలు ఉన్నాయి.

## తెలంగాణను కప్పేయనున్న పొగమంచు

(1వపేజీ తరువాయి)సంవత్సరానికి ఒకసారైనా బాడీ చెకప్ చేసుకోవాలని తెలిపారు. చలి బారినపడకుండా ఉండేందుకు స్వెటర్లు, డార్క్ కలర్ దుస్తులు ధరించాలని సూచించారు. పిల్లలు, వృద్ధులు చలి తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, సమయాల్లో బయట తిరగవద్దని సూచించారు.

## రైతుకు సంకెళ్లా?

(1వపేజీ తరువాయి)ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించదని హెచ్చరించారు. అంతేగాక, హీర్యానాయక్‌కు మెరుగైన వైద్యం అందించాలని సీఎం రేవంత్ ఆదేశించారు. కాగా, రైతు హీర్యానాయక్‌కు ఛాతినొప్పి రావడంతో మొదట సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించారు. ప్రస్తుతం హీర్యానాయక్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిల్ కుమార్ తెలిపారు. హార్ట్ బీట్ కొంచెం తక్కువగా ఉందన్నారు. గతంలో కూడా తనకు గుండె నొప్పి వచ్చిందని హీర్యానాయక్ చెప్పడంతో మెరుగైన చికిత్స కోసం పంజాగుట్ట నిమ్స్‌కు రిఫర్ చేశామని ఆయన తెలిపారు. దీంతో నిమ్స్ ఎమర్జెన్సీ విభాగంలో హీర్యా నాయక్ కు చికిత్స అందిస్తున్నారు. ఇది ఇలావుండగా, రైతుకు బేడీలు వేయడంపై బీఆర్ఎస్ వర్కింగ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రైతుకు గుండెనొప్పి వస్తే బేడీలు వేసి ఆస్పత్రికి తరలించడం క్షమార్హం కాదని కేటీఆర్ ధ్వజమెత్తారు. రైతులను కస్టడీలో చిత్రహింసలు పెట్టారని మెజిస్ట్రేట్ ముందు చెబితే... కుటుంబసభ్యులను కూడా కొడతామని బెదిరించారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి మాట వినకపోవడమే వారు చేసిన తప్పా అని ప్రశ్నించారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నకు బేడీలు వేస్తారా? అని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు హీర్యానాయక్ ఏమైనా ఉగ్రవాదా? దోపిడీ దొంగా? అని ప్రశ్నించారు. రైతుల భూములు లాక్కుంటారని.. తిరగబడితే అరెస్టు చేస్తారని ధ్వజమెత్తారు. అనారోగ్యంతో ఉన్న రైతుకు బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లడం హేయమైన చర్య అని అన్నారు.

## ఈ నెలాఖరులోగా మంత్రివర్గ విస్తరణ ఉండొచ్చు

(1వపేజీ తరువాయి)మాట్లాడుతూ... ప్రతిపక్ష నేతగా కేసీఆర్ సభకు వస్తారని భావిస్తున్నానన్నారు. 80 వేల పుస్తకాలు చదివిన నేతగా సభకు వచ్చి సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. మేడ్చల్, రంగారెడ్డి అక్రమార్కుల చిట్టాను త్వరలో విప్పుతామని హెచ్చరించారు.

లగచర్ల కేసులో అరెస్టై జైల్లో ఉన్న రైతును ఆసుపత్రికి తీసుకెళ్లే సమయంలో బేడీలు వేయడం సరికాదని మంత్రి అభిప్రాయపడ్డారు. అదానీ విషయంలో ఇక వివాదం వద్దని... ఆయన ఇచ్చిన రూ.100 కోట్లను తమ ప్రభుత్వం వెనక్కి ఇచ్చిందని స్పష్టం చేశారు. హాస్టళ్లకు పెండింగ్ బిల్లులను ఈ నెల 31వ తేదీ లోగా విడుదల చేస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఉక్కు కర్మాగారం గురించి ఎందుకు మాట్లాడటం లేదో చెప్పాలన్నారు.

**అసెంబ్లీలో ప్రజలకు సంబంధించిన అంశాలు చర్చకు రావాలి: పొన్నం**

అసెంబ్లీలో ప్రజలకు సంబంధించిన అంశాలు చర్చకు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి సభ్యుడు సభ విలువను కాపాడాలని, ప్రజాస్వామ్యయుతంగా చర్చకు రావాలన్నారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం వేదికగా రెండు రోజుల పాటు జరిగిన ప్రజాప్రతినిధుల శిక్షణా తరగతులు ముగిశాయి.

అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ... ఈరోజుతో శిక్షణా తరగతులు ముగిశాయన్నారు. తెలంగాణ మూడో శాసన సభకు ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు శాసనసభా వ్యవహారాల శాఖ రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించిందన్నారు. శాసనసభ, మండలిలో సమర్థవంతంగా ప్రజల అంశాలు చర్చకు రావాలన్నారు.


ప్రజల కోసం ఏం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు ఏర్పడ్డాయో అది నెరవేరే విధంగా సభ్యులంతా సభా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య విలువలకు శాసనసభ వేదిక అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

## ఘుమఘుమలాడే హైదరాబాద్ బిర్యానీకి ప్రపంచ స్థాయి గుర్తింపు

**హైదరాబాద్-నవభూమి:** తెలుగువాళ్లు సహజంగానే భోజన ప్రియులు. నోరూరించే ఎలాంటి వంటకాలనైనా స్వాహా చేసేస్తారు. ఇక బిర్యానీ పేరెత్తితే దాన్ని రుచి చూడందే వదల్లేరు. మాంసాహారం అంటే మరీనూ. మటన్ బిర్యానీ, చికెన్ బిర్యానీ, దమ్ బిర్యానీ..చివరికి ఎగ్ బిర్యానీని కూడా ఇష్టంగా తింటారు. హైదరాబాద్‌కు వచ్చిన వాళ్లెవరూ ఇక్కడి బిర్యానీ టేస్ట్ చేయకుండా సిటీని వదిలి వెళ్లలేరు కూడా. హైదరాబాద్‌ను సందర్శించడానికి వచ్చిన పొరుగు రాష్ట్రాల వాళ్లు బిర్యానీని తినడాన్ని గొప్పగా చెప్పుకొనే సందర్భాలు చాలానే ఉన్నాయి. బిర్యానీ తయారీ విధానం, రెసిపీ, అందులో వినియోగించే మసాలా దినుసుల క్వాలిటీ వల్లే ఆ గొప్పదనం అబ్బింది. అలాంటి హైదరాబాద్ బిర్యానీ స్థాయి మరింత పెరిగింది. ఇంటర్నేషనల్ లెవెల్‌కు చేరింది. టేస్ట్ అట్లాస్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఎంపిక చేసిన వంద అత్యుత్తమ వంటకాల్లో ఈ బిర్యానీకి చోటు లభించింది. దీని స్థానం.. 31. మరో మూడు భారతీయ వంటకాలు కూడా ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. క్రొయేషియాకు చెందిన సంస్థ టేస్ట్ అట్లాస్. క్రొయేషియన్ జర్నలిస్ట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ మటీజా బబిక్ 2015లో దీన్ని నెలకొల్పారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
హైదరాబాద్
3
శుక్రవారం
13, డిసెంబర్, 2024

## ప్రార్థనా స్థలాల సర్వేలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు



**న్యూఢిల్లీ-నవభూమి:** 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టంపై ఇవాళ సుప్రీంకోర్టులో వాదనలు జరిగాయి. ప్రార్థనా స్థలాల వద్ద సర్వేలు నిలిపివేయాలని, ఆ స్థలాలపై కొత్త కేసులను స్వీకరించరాదు అని దేశంలోని ట్రయల్ కోర్టులకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రార్థనా స్థలాల చట్టానికి లింకున్న కేసులపై చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం వాదనలు జరిపింది. మతపరమైన ప్రదేశాలకు చెందిన అంశాల్లో ఆదేశాలు ఇవ్వడం ఆపివేయాలని సుప్రీంకోర్టు తన తీర్పులో తెలిపింది. ప్రార్థనా స్థలాలపై ఉన్న పెండింగ్ కేసుల విషయంలో కూడా సుప్రీంకోర్టు



ఆదేశాలిచ్చింది. కోర్టులు ఆ కేసుల్లో ఎటువంటి నిర్ణయాలు తీసుకోవద్దు అని చెప్పింది. సుప్రీం ఇచ్చిన తాజా ఆదేశాలను హిందువుల తరపున వాదిస్తున్న అనేక మంది లాయర్లు వ్యతిరేకించారు. తమ వాదనలు వినకుండా ఆదేశాలు ఇవ్వొద్దు అని కోరారు. ప్రార్థనా స్థలాల అంశంపై రిప్లై ఇవ్వాలని కేంద్రానికి నాలుగు వారాల సమయం ఇచ్చింది కోర్టు. ఇక ఇలాంటి కేసుల్లో పార్టీలుగా ఉన్నవారికి అదనంగా మరో నాలుగు వారాల సమయాన్ని కేటాయించింది. ప్రార్థనా స్థలాల చట్టంలోని 2,3, 4 సెక్షన్లను తొలగించాలని అశ్విని ఉపాధ్యాయ కోరారు. మధుర శ్రీకృష్ణ జన్మభూమి కేసు తమ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది.

## గుర్రం బండిపై ఊరేగిన దళిత వరుడు.. నిర్వాహకులపై అగ్రకులం వ్యక్తులు దాడి



**భోపాల్-నవభూమి:** దళిత వర్గానికి చెం దిన వరుడు గుర్రం బండిపై ఊరేగింపుగా పెళ్లికి వెళ్లాడు. అగ్రకులం వ్యక్తులు దీనిపట్ల ఆగ్రహించారు. గుర్రం బండి నిర్వాహకులపై దాడి చేశారు. గన్స్ ఎక్కుపెట్టి వారిని బెదిరించారు. మధ్యప్రదేశ్‌లోని దామోహ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మంగళవారం దళిత వర్గానికి చెందిన పెళ్లికొడుకు తన బంధువులతో కలిసి గుర్రం బండిపై ఊరేగింపుగా పెళ్లి వేదిక వద్దకు చేరుకున్నాడు. గుర్రం బండి నిర్వాహకులు దీని కోసం స్థానిక అగ్రవర్ణాల అనుమతి కూడా తీసుకున్నారు. కాగా, పెళ్లి తంతు పూర్తయిన తర్వాత గుర్రం బండి నిర్వాహకులు తిరిగి వెళ్తుండగా అగ్రకులం వ్యక్తులు దాడి చేశారు. రత్నేష్ ఠాకూర్ నేతృత్వంలో కొందరు వ్యక్తులు వారిని అడ్డుకున్నారు. గుర్రం బండిని ధ్వంసం చేశారు. గుర్రం, దాని నిర్వాహకులతోపాటు పెళ్లి అతిథులను కొట్టారు. అహిర్వార్ కమ్యూనిటీ ఇళ్ల సమీపంలో దళిత వరుడి పెళ్లి ఊరేగింపు వెళ్లడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలా ఎందుకు చేశారంటూ గన్స్‌తో బెదిరించి కొట్టారు. వారి వద్ద ఉన్న డబ్బు లాక్కున్నారు. మరోవైపు దాడిలో గాయపడిన వ్యక్తులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆ తర్వాత ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేశారు. దర్యాప్తు జరిపి తగిన చర్యలు చేపడతామని పోలీస్ అధికారి వెల్లడించారు.

## పార్టీ సమావేశంలో బీర్ తాగినట్లు ఆరోపణలు.. స్పందించిన సీపీఎం నాయకురాలు



**తిరువనంతపురం-నవభూమి:** సీపీఎం సమావేశంలో పాల్గొన్న నాయకురాలు బీర్ బాటిల్‌లో ఉన్న ద్రవాన్ని తాగింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో ఆ నాయకురాలు బీరు తాగినట్లు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాల విమర్శలపై ఆమె స్పందించింది. తాను సైబర్ బెదిరింపులకు గురైనట్లు ఆరోపించింది. కేరళలో ఈ సంఘటన జరిగింది. ఆ రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీపీఐ(ఎం) పార్టీ ఇటీవల కొల్లాం జిల్లాలో సమావేశం నిర్వహించింది. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలైన చింతా జెరోమ్ ఇందులో పాల్గొన్నది. ఈ సందర్భంగా ఆమె టేబుల్ వద్ద బీర్ బాటిల్ వంటిది ఉన్నది. సమావేశం మధ్యలో ఆ బాటిల్‌లోని ద్రవాన్ని ఆమె తాగింది. కాగా, ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో సీపీఎం నాయకురాలు చింతా జెరోమ్ పార్టీ సమావేశంలో బీరు తాగినట్లు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో వెల్లువెత్తిన ప్రతిపక్షాల విమర్శలపై ఆమె స్పందించారు. హెర్బల్ డ్రింకింగ్ వాటర్ బాటిల్‌ను బీర్‌గా భావించిన వారి మానసిక స్థితిని ప్రశ్నించాలని మండిపడ్డారు. ఈ ఆరోపణలు పచ్చి రాజకీయాలకు నిదర్శమని విమర్శించారు. మరోవైపు సీపీఎం సదస్సులు గ్రీన్ ప్రొటోకాల్‌కు కట్టుబడి ఉంటాయని చింతా జెరోమ్ తెలిపారు. ఇందులో భాగంగా ప్లాస్టిక్ బాటిల్ వాటర్ స్థానంలో రీయూజబుల్ బాటిళ్లలో నింపిన కరుంగళి (హెర్బల్) తాగు నీటిని సమావేశంలో పాల్గొన్న వారికి సరఫరా చేశారని వివరించారు. అయితే వామపక్ష విద్రోహులు బీరు బాటిల్ లాగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ అంధత్వంతో బాధపడుతున్న వామపక్ష ప్రత్యర్థుల మానసిక స్థితిని పరీక్షించాలని ఆమె అన్నారు.

## జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం.. ఈ సమావేశాల్లోనే సభ ముందుకు బిల్లు




**న్యూఢిల్లీ-నవభూమి:** జమిలి ఎన్నికలకు సంబంధించి కీలక ముందడుగు పడింది. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా రూపొందించిన 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ బిల్లుకు ఆమోదం లభించింది. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు తెలిసింది. బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందడమే తరువాయిగా ఉంది. ఇక ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టిన తర్వాత విస్తృత సంప్రదింపుల కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి (జేపీసీ) సిఫార్సు చేసే అవకాశం ఉన్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ బిల్లుపై చర్చించేందుకు అన్ని రాష్ట్రాల అసెంబ్లీల స్పీకర్‌లనూ ఆహ్వానించనున్నట్టు సమాచారం. కాగా, జమిలి ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాలపై కేంద్ర ప్రభుత్వం నియమించిన రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఇప్పటికే నివేదిక సమర్పించిన సంగతి తెలిసిందే.

## ఆ టైంలో నా ముఖం దాచేసుకుంటున్నా: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో రోజు రోజుకూ యాక్సిడెంట్ల సంఖ్య పెరుగుతున్నట్లు కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతెలిపారు. ప్రమాదాల నివారణపై లోక్‌సభలో సమాధానం ఇస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. విదేశాల్లో జరిగే సమావేశాలకు వెళ్లిన సమయంలో.. రోడ్డు ప్రమాదాలపై చర్చ జరుగుతున్నప్పుడు.. తన ముఖాన్ని దాచుకునేందుకు ప్రయత్నిస్తానని మంత్రి పేర్కొన్నారు. తొలి సారి కేంద్ర రోడ్డు రవాణా, హైవే శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో .. ప్రమాదాలను 50 శాతం వరకు తగ్గించేందుకు టార్గెట్ పెట్టుకున్నానని, కానీ ప్రమాదాలను తగ్గించడం కాదు కదా, వాటి సంఖ్య పెరుగుతోందని చెప్పడానికి సిగ్గుపడడం లేదని మంత్రి తెలిపారు.

# కళ్లు తిరిగి బాత్రూంలో పడుతునోళ్ల లెక్క తెలుసా?



**న్యూఢిల్లీ-నవభూమి:** పెద్ద వయస్కులకు సంబంధించి తరచూ వినే ఒక మాట.. ఫలానా వారింట్లో ఫలానా వారు బాత్రూంలో జారి పడ్డారని. బాత్రూంలో జారిపడటంతో మరిన్ని ఆరోగ్య సమస్యలే కాదు.. వారి జీవితం గతానికి భిన్నంగా మారుతుందన్న విషయాన్ని అస్సలు మర్చిపోకూడదు. ఇంట్లో పెద్ద వయస్కులు ఉన్న వారంతా ఎంత జాగ్రత్తగా ఉండాలో చెప్పే వివరాలు తాజాగా వెల్లడయ్యాయి. అప్పటికే కొన్ని ఆరోగ్య సమస్యలతో సతమతమయ్యే పెద్ద వయస్కులు పలువురు బాత్రూంకు వెళ్లినప్పుడు జారి పడటం.. ఈ సందర్భంగా తుంటి ఎముక నుంచి పలు సమస్యలు ఎదురవుతుంటాయి. మునుపటి మాదిరి తమ పనులు తాము చేసుకోలేక తీవ్ర అవస్థలకు గురవుతుంటారు. ఇంతకూ పెద్ద వయస్కులు బాత్రూంలో ఎందుకు తూలి పడుతుంటారు? అనేది ప్రధాన ప్రశ్న. దీనికి కారణం ఏమిటి? అనే అంశంపై ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్ పరిశోధకులు ఒక అధ్యయనాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా 65 ఏళ్లు దాటిన 1,03,000 మందిని శాంపిల్ గా తీసుకున్నారు. వీరిపై 29 వేర్వేరు పరిశోధనలు జరిపారు. బాత్రూంలో సడన్ గా పడిపోవటం వెనుకు ఉన్నట్లుండి కళ్లు బైర్లు కమ్మి పడిపోవటం ప్రధాన కారణంగా తేల్చారు. 65 ఏళ్లు దాటిన ప్రతి ముగ్గురిలో ఒకరు ఏడాదిలో కనీసం ఒక్కసారైనా పడిపోతున్న కొత్త విషయాన్ని గుర్తించారు. ఇలా కింద పడిన వారిలో 10 శాతం మంది తీవ్ర గాయాల పాలవుతున్నట్లుగా తేల్చారు. హటాత్తుగా కళ్లు బైర్లు కమ్మే సమస్య రానున్న రోజుల్లో మరింత ఎక్కువ అవుతుందని చెబుతున్నారు. ఈ సమస్య ఎదురుకాకుండా ఉండేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న విషయాన్ని వైద్యులు వివరిస్తున్నారు. ఇంతకు హటాత్తుగా కళ్లు బైర్లు కమ్మటం.. శరీరం బ్యాలెన్సు మిస్ కావటం.. తల భారంగా అనిపించటం వెనుకున్న అసలు కారణాలు ఏమిటి? అలా ఎందుకు జరుగుతుందనే విషయాన్ని తెలుసుకోవటం ద్వారా.. తగిన జాగ్రత్తలతో పడిపోయే ముప్పును తప్పించుకోవచ్చని చెబుతున్నారు.

## జమ్ముకశ్మీర్‌పై మంచు వర్షం.. శ్వేత వర్ణంతో పర్యాటకులను ఆహ్వానిస్తున్న రహదారులు



జమ్ము కశ్మీర్ లో మంచు వర్షం కురుస్తోంది. బారాముల్లా, సోనమార్గ్, బందిపోర సహా అనేక ప్రాంతాల్లో విపరీతంగా మంచు పడు తోంది. దీంతో ఆయా ప్రాంతాలు కనుచూపు మేర శ్వేత వర్ణాన్ని సంతరిం చుకున్నాయి. జమ్ముకశ్మీర్‌లోని ఎత్తైన ప్రాంతా ల్లో నిరంత రంగా మంచు కురుస్తున్నది. రహదా రులు, ఇళ్లు, భవనాలు, చెట్లు, వాహనాలు, ఎత్తైన కొం డలపై పడుతున్న మంచు దృశ్యాలు ఆకట్టుకుంటున్నాయి. స్థానిక ప్రజలు, సందర్శ కులు మంచు వర్షాన్ని ఆస్వాదిస్తు న్నారు. సాధా రణంగా శీతాకాలంలో జమ్ముకశ్మీంకు పర్యా టకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. మంచు తెరల మాటు నుంచి కశ్మీర్ లోయలు, కొండల అందాలను వీక్షించేందుకు దేశ నలు మూలల నుంచేగాక, విదేశాల నుంచి కూడా పర్యాట కులు భారీగా తరలివస్తారు. మంచు వర్షానికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం ఆకట్టుకుంటున్నాయి.

## 57 గంటలపాటు శ్రమించినా దక్కని ఫలితం..



**జైపూర్-నవభూమి:** రాజస్థాన్‌లోని ) దౌసాలో విషాదం చోటుచేసుకున్నది. బోరుబావిలో పడిన ఐదేండ్లు బాలుడిని రెస్క్యూ సిబ్బంది రక్షించినప్పటికీ అతడు మరణించాడు. దీంతో 57 గంటలపాటు సాగిన రెస్క్యూ ఆపరేషన్ విషాదాంతమైంది. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో దౌసా జిల్లాలోని కలిఖడ్ గ్రామంలో ఆర్యన్ అనే ఐదేండ్ల బాలుడు.. ఇంటి పక్కనే ఉన్న 175 అడుగుల లోతున్న బోరుబావిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకు సహాయకచర్యలు ప్రారం భించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అల్యూమిని యంతో తయారు చేసిన హుక్ ద్వారా బాలుడిని బయటకు తీయడానికి విఫలయత్నం చేశారు. అది ఫలించకపోవడంతో బోరుబావికి కొంత దూరంలో 4 అడుగుల వెడల్పుతో గుంత తీశారు. 150 అగుడుల మేర తవ్వకం పూర్తయిన తర్వాత అందులోకి దిగిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది.. సొరంగం తవ్వి బాలుడిని కాపాడారు. అప్పటికే అతడు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దీంతో గ్రీన్ చానల్ ఏర్పాటుచేసి అంబులెన్సులో దవాఖానకు తరలించారు. అయితే అప్పటికే మరణించనట్లు వైద్యులు నిర్ధారించారు.

## 'పర్యాటక' కాలుష్యం.. టాప్ 3లో భారత్



**న్యూఢిల్లీ-నవభూమి:** అంతర్జాతీయ, దేశీయ పర్యాటకం ద్వారా వెలువడుతున్న కాలుష్య ఉద్గారాల్లో.. చైనా, అమెరికా, భారత్ దేశాల వాటా అత్యధికంగా ఉందని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. పర్యాటక కాలుష్య ఉద్గారాల్లో ఇవి మొదటి మూడు స్థానాల్లో నిలిచాయని 'క్వీన్స్‌లాండ్ వర్సిటీ' పరిశోధకులు లెక్కగట్టారు. 2009 నుంచి 2019 వరకు పదేండ్లలో 175 దేశాల దేశీయ, అంతర్జాతీయ పర్యాటకం వల్ల గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాల్లో పెరుగుదలను అంచనావేశారు. చైనాలో ఏటా పెరుగుతున్న (17శాతం) దేశీయ పర్యాటకం కారణంగా కాలుష్య ఉద్గారాలు 0.4 గిగాటన్నులు పెరిగిందని, అమెరికా వల్ల 0.2 గిగాటన్నులు, భారత్ వల్ల 0.1 గిగాటన్నులు కాలుష్యం భూ వాతావరణంలోకి చేరిందని అధ్యయనం తెలిపింది. పదేండ్లలో పర్యాటకం వల్ల కాలుష్య ఉద్గారాల విడుదల 3.7 నుంచి 5.2 గిగాటన్నులకు చేరుకుంది.

## టైమ్ మేగజైన్ 'పర్సన్ ఆఫ్ ద ఇయర్-2024'గా ట్రంప్




అమెరికా అధ్యక్షుడిగా రెండో పర్యాయం ఎన్నికైన ట్రంప్‌కు అరుదైన రికార్డు లభించింది.

ఈ ఏడాది మేటి వ్యక్తిగా టైమ్ మేగజైన్ గుర్తింపు లభించింది.

2016లోనూ ఈ గుర్తింపు అందుకున్న ట్రంప్‌కు ఈ సారి రెండో సారి గుర్తింపు రావడం విశేషం.

ప్రపంచ ప్రఖ్యాత టైమ్ మేగజైన్ ఈ ఏడాది మేటి వ్యక్తిగా అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ను ఎంపిక చేసింది. పర్సన్ ఆఫ్ ద ఇయర్-2024గా ట్రంప్ పేరును ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి ఎన్నికవడాన్ని టైమ్ ఘనంగా ప్రస్తావించింది. అమెరికా చరిత్రలోనే ఇది అసమాన ఘట్టం అని అభివర్ణించింది.

ఈ విశిష్ట గుర్తింపునకు ట్రంప్ ఎంపికవడం ఇది రెండోసారి. 2016లోనూ ఆయన టైమ్ పర్సన్ ఆఫ్ ద ఇయర్ గా నిలిచారు. 78 ఏళ్ల ట్రంప్ 2017లో తొలిసారిగా అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత 2020లో జరిగిన ఎన్నికల్లో డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి జో బైడెన్ చేతిలో ఓడిపోయారు.

అయితే, ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో డెమొక్రాటిక్ అభ్యర్థి కమలా హారిస్ ను ఓడించి, రెండో పర్యాయం అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

## రైల్వేల బాదుడుపై భలే ప్రశ్న సంధించిన సమాజ్ వాదీ ఎంపీ!



**న్యూఢిల్లీ-నవభూమి:** కేంద్రంలో మోడీ సర్కారు కొలువు తీరితే రైల్వేల రూపురేఖలు మారిపోతాయని.. రైల్వేలు పెద్ద ఎత్తున సంస్కరణ బాట పడతాయని.. సేవల్లో అద్భుతాలు చోటు చేసుకుంటాయని.. సరికొత్త రైల్వే ప్రయాణ అనుభూతిని అస్వాదించటం ఖాయమంటూ.. 2014 ముందు పెద్ద ఎత్తున చర్చ జరిగేది. కట్ చేస్తే.. గడిచిన పదేళ్ల మోడీ పాలనను చూస్తే.. రైల్వేలో చోటు చేసుకున్న మార్పుల్ని చూస్తే.. వరాల కంటే వాతలే ఎక్కువగా కనిపిస్తాయి. సీనియర్ సిటిజన్లకు ఉండే రాయితీని ఎత్తి పారేయటం దగ్గర నుంచి.. ప్యాసింజర్ ట్రైన్ల సేవల్లో కోత మొదలు.. రైల్వేల సమయ పాలన విషయంలో చోటు చేసుకున్న అంశాలు రైల్వే ప్రయాణికులకు తరచూ ఇబ్బందులకు గురయ్యేలా చేస్తుంటాయి. ఇదిలా ఉంటే.. తాజాగా జరుగుతున్న లోక్ సభ సమావేశాల్లో సమాజ్ వాదీ ఎంపీ ఇక్రా చౌధరి ఆసక్తికర అంశాన్ని లేవనెత్తారు. రైల్వే ప్రయాణం కోసం టికెట్ ను ఆన్ లైన్ లో బుక్ చేసుకొన్నప్పుడు వెయిటింగ్ లిస్టు టికెట్ ఖరారు కాకపోతే.. రైల్వే శాఖ దాన్ని క్యాన్సిల్ చేస్తుంది. అలాంటప్పుడు రుసుములు ఎందుకు వసూలు చేస్తున్నారు? అంటూ కోట్లాది మంది రైల్వే ప్రయాణికుల మనసుల్ని తొలిచే ప్రశ్నను సంధించారు. ఇదంతా ఒక ఎత్తు అయితే.. దీనికి కేంద్ర రైల్వే మంత్రి చెప్పిన సమాధానం వింటే.. రైల్వే శాఖ గడుసుతనం ఇట్టే కనిపిస్తుంది. వెయిటింగ్ లిస్టు టికెట్లు రద్దు చేసినప్పుడు విధించే క్లరికేజ్ ఛార్జిలను మినహాయించుకునే ఆలోచన ఉందా? ఇప్పటివరకు అలా వసూలు చేసిన మొత్తం ఎంత? అన్న ప్రశ్నలను సంధించారు సమాజ్ వాదీ ఎంపీ. దీనికి రాతపూర్వక సమాధానాన్ని ఇచ్చారు రైల్వే శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్. తాము వసూలు చేస్తున్న రుసుములు రైల్వే ప్రయాణికుల నిబంధనలు 2015ను అనుసరించి వసూలు చేస్తున్నామని.. అప్పటికే కన్ఫర్మ్ అయిన.. ఆర్ ఏసీ టికెట్లను ఎవరైనా క్యాన్సిల్ చేసుకుంటే.. ఆ బెర్తుల్ని ఇతరులకు కేటాయించేందుకు వీలుగా వెయిటింగ్ లిస్టు టికెట్లను జారీ చేస్తున్నామని.. ఏదైనా తరగతిలో బెర్తులు మిగిలిపోతే.. అందులోకి మారేందుకు లేదంటే ఇతర రైళ్లలో బెర్తులు ఖాళీగా ఉంటే (వికల్ప్ సౌకర్యం) వాటిల్లో ప్రయాణించేందుకు వీలుగా అవకాశాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. టికెట్ల రద్దు ద్వారా వచ్చిన ఆదాయానికి విడిగా పద్దు ఉండదని.. అన్ని రూపాల్లో వచ్చిన ఆదాయాన్ని రైళ్ల నిర్వాహణకు.. సదుపాయాలకు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారే కానీ.. వెయిటింగ్ టికెట్లు కన్ఫర్మ్ కాకున్నా విధించే ఛార్జీల బాదుడు నుంచి ఉపశమనం కలిగిస్తామన్న మాట మాత్రం రైల్వే శాఖ మంత్రి నుంచి రాకపోవటం గమనార్హం.

## మళ్లీ అధికారంలోకి వస్తే.. ప్రతి మహిళకు రూ.2,100 : కేజ్రీవాల్



**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ దూకుడు పెంచింది. ఓటర్లను ఆకట్టుకునేందుకు అనేక హామీలు ప్రకటిస్తోంది. ఇప్పటికే ఆటో డ్రైవర్లకు ఐదు కీలక హామీలు ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా మహిళలకు ఆమ్ ఆద్మీ పార్టీ గుడ్ న్యూస్ చెప్పింది. వచ్చే ఎన్నికల్లో ఆప్‌ను గెలిపిస్తే 18 ఏళ్లు పైబడిన ప్రతి మహిళకూ నెలకు రూ. 2,100 అందజేస్తామని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. గురువారం సీఎం అతిశీతో కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొన్న కేజ్రీవాల్ మాట్లాడుతూ.. 'ప్రతి మహిళకు రూ. 1,000 ఇస్తామని గతంలో హామీ ఇచ్చాము. అయితే, కొంతమంది మహిళలు నా వద్దకు వచ్చి ద్రవ్యోల్బణం కారణంగా రూ. 1,000 సరిపోవడం లేదని చెప్పారు. అందుకే వారి అభ్యర్థన మేరకు 18 ఏళ్లు పైబడిన మహిళలందరికీ నెలకు రూ. 2,100 ఇస్తాం' అని కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. నేరుగా మహిళల బ్యాంకు ఖాతాలోకే ఈ మొత్తాన్ని జమ చేయనున్నట్లు వెల్లడించారు.

## మొన్నటి వరకూ తీవ్ర కాలుష్యం.. ఇప్పుడు చలి.. ఢిల్లీలో పడిపోయిన ఉష్ణోగ్రతలు



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీలో ఉష్ణోగ్రతలు పడిపోయాయి గురువారం ఉదయం ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్ర లు 4.5 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. ఈ సీజన్‌లో ఇదే అత్యల్పం అని భారత వాతావరణ శాఖ తెలిపింది. గురువారం ఉదయం 8:30 గంటల సమయంలో సప్థర్‌జంగ్ వెదర్ స్టేషన్‌లో కనిష్ట ఉష్ణోగ్రతలు 4.5 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్లు ఐఎండీ వెల్లడించింది. ఇది సాధారణం కంటే నాలుగు పాయింట్లు తక్కువ అని పేర్కొంది. దాదాపు గడిచిన 14 సంవత్సరాల్లో 5 డిగ్రీల కంటే తక్కువకు ఉష్ణోగ్రతలు పడిపోవడం ఇదే మొదటిసారి అని ఐఎండీ తెలిపింది. 1987 డిసెంబర్ 6వ తేదీన ఢిల్లీలో అత్యల్పంగా 4.1 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించింది. ఇక ఇన్ని రోజులూ తీవ్ర వాయుకాలుష్యంతో ఉక్కిరిబిక్కిరైన ఢిల్లీ వాసులు.. ఇప్పుడు చలి తీవ్రతకు గజగజ వణికిపోతున్నారు. చలి మంటలతో ఉపశమనం పొందుతున్నారు. నిరాశ్రయులు నైట్ షెల్టర్లలో ఆశ్రయం పొందుతున్నారు.

## చెన్నైలో కుండపోత.. 11 జిల్లాల్లో పాఠశాలలకు సెలవు.. అలర్ట్ ప్రకటించిన ఐఎండీ



**న్యూఢిల్లీ-నవభూమి:** తమిళనాడు రాష్ట్రాన్ని భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కల్‌లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇక తమిళనాడు రాజధాని చెన్నై లో కుండపోత వర్షం పడుతోంది. భారీ వర్షం నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లోని పాఠశాలలకు అధికారులు సెలవు ప్రకటించారు.

## మళ్లీ గెలిపిస్తే ప్రతి మహిళకు నెలకు రూ.2,100 ఇస్తాం: కేజ్రీవాల్ హామీ



**న్యూఢిల్లీ-నవభూమి:** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీని తిరిగి గెలిపిస్తే 18 ఏళ్లు పైబడిన ప్రతి మహిళకు నెలకు రూ. 2,100 ఇస్తామని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడ్డాయి. ఈ క్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ ఇప్పటికే ఆటో డ్రైవర్లకు ఐదు హామీలను ఇచ్చింది. తాజాగా మహిళలకు రూ. 2,100 ఇస్తామని తెలిపింది. ఈ మొత్తాన్ని నేరుగా మహిళ ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి అతిశీతో కలిసి అరవింద్ కేజ్రీవాల్ నేడు ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతి మహిళకు రూ. 1,000 ఇస్తామని గతంలో హామీ ఇచ్చామని, అయితే కొంతమంది మహిళలు తన వద్దకు వచ్చి ద్రవ్యోల్బణం కారణంగా ఈ మొత్తం సరిపోదని చెబుతున్నారని తెలిపారు. వారి అభ్యర్థన మేరకు పద్దెనిమిదేళ్లు నిండిన మహిళలకు రెండింతల కంటే ఎక్కువ పెంచినట్లు తెలిపారు.

## 5 ఏళ్లలో 500 పాములు పట్టిందీ కేరళ కుట్టి



**తిరువనంతపురం–నవభూమి:** ఈ అందాల బొమ్మకు పాములంటే భయం లేదు. చాలా ఈజీగా వాటిని పట్టేస్తుంది. ఈమె పేరు జీఎస్ రోషిణి. కేరళలోని తిరువనంతపురం జిల్లాలో బీట్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. పారుత్తిపల్లి ఫారెస్ట్ రేంజ్‌లోని ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లో సభ్యురాలు కూడా. ప్రస్తుతం ఆమె పోస్టింగ్ ఇక్కడే ఉంది. ఈ బ్యూటీఫుల్ ఫారెస్ట్ ఆఫీసర్ ఓ పెద్ద స్నాక్ క్యాచర్ ఇంట్లో పాములు ఉన్నట్లు ఫోన్ రాగానే, అక్కడకు వెళ్లి వాటిని రెస్క్యూ చేస్తుంది. 2019లో పాములు పట్టడంలో ఒకే రోజు శిక్షణ తీసుకున్న ఈ బీట్ ఆఫీసర్ .. గడిచిన అయిదేళ్లలో 500 సర్పాలను పట్టేసింది. విషపూరితమైనవి, విషరహిత పాములు ఆ లిస్టులో ఉన్నాయి. పాములే కాదు.. ఎలుగుబంట్లు లాంటి కొన్ని ప్రాణాంతకమైన వన్య మృగాలను కూడా ఆమె బంధించింది. 2021లో తొలిసారి కల్లార్‌లో ఓ పైతాన్‌ను రెస్క్యూ చేసిందామె. వాస్తవానికి కొండచిలువల్ని పట్టుకోవడం అంత సులువైన విషయం కాదు. అవి వాటి బలంతో మనిషిపై తీవ్ర వత్తిడి తెస్తుంటాయి. వీటిని పట్టుకోవాలంటే చాలా బలం కావాల్సిందే. పైతాన్లను పట్టుకున్న సమయంలో.. అవి మలమూత్రాలను విసర్జిస్తాయని, ఆ వాసన ఎన్ని సార్లు స్నానం చేసినా పోదు అని ఆమె తెలిపారు. కఠినమైన పరిస్థితులు ఎన్ని ఉన్నా.. పాములకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా.. తక్కువ రిస్క్‌తో వాటిని పట్టేస్తుంది.



## అట్టడుగున మనం.. అగ్రపథాన చైనా

భారత్, చైనా.. ప్రపంచంలోనే అత్యధిక జనాభాను కలిగి ఉన్న మొదటి రెండు దేశాలు. రెండు దేశాలు కూడా భారీ భూభాగం, ప్రాచీన నాగరికత, అణ్వస్త్ర సామర్థ్యం, శక్తిమంతమైన సైన్యం, బలమైన రాజకీయ భౌగోళిక ప్రాముఖ్యాన్ని కలిగి ఉన్నాయి. అయితే ఈ సారూప్యతలు ఇక్కడితోనే ముగుస్తాయి. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక శక్తిగా చైనా ఉండగా.. భారత్ మాత్రం ఇప్పటికీ ఎదుగుతున్న ఆర్థిక శక్తిగానే ఉండటమే అందుకు కారణం. 1980లలో ఆర్థిక వ్యవస్థల పరిమాణం పరంగా రెండు దేశాల మధ్య పెద్దగా వ్యత్యాసం లేదు. వాస్తవానికి ఆ సమయంలో భారత తలసరి ఆదాయం చైనా కంటే ఎక్కువే. అయితే 2024లో జీడీపీ, తలసరి ఆదాయం, ప్రపంచ ఎగుమతుల్లో వాటా పరంగా చూస్తే భారత్ కంటే చైనా చాలా ముందంజలో ఉన్నది. జీడీపీ: ఐఎంఎఫ్ నివేదిక ప్రకారం.. 2024లో చైనా ఆర్థిక వ్యవస్థ విలువ 18.53 ట్రిలియన్ డాలర్లు. ఇది భారత జీడీపీ 3.93 ట్రిలియన్ డాలర్ల కంటే సుమారుగా ఐదింతలు ఎక్కువ. 1980ల నుంచి చూసుకుంటే చైనా జీడీపీ 61 రెట్లు పెరిగి 303 బిలియన్ డాలర్ల నుంచి 18.53 ట్రిలియన్ డాలర్లకు ఎగబాకింది. అదే సమయంలో 21 రెట్లు మాత్రమే పెరిగిన భారత జీడీపీ 189 బిలియన్ డాలర్ల నుంచి 3.93 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. గత పదేండ్లలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే హయాంలో 93 శాతం పెరిగిన భారత జీడీపీ 2.04 ట్రిలియన్ డాలర్ల నుంచి 3.93 ట్రిలియన్ డాలర్లకు చేరింది. అదే సమయంలో 76 శాతం పెరిగిన చైనా జీడీపీ 10.5 ట్రిలియన్ డాలర్ల నుంచి ప్రస్తుత స్థితికి చేరింది.

2004–14 మధ్యకాలంలో యూపీఏ హయాంలో భారత జీడీపీ 188 శాతం పెరిగి.. 704 బిలియన్ డాలర్ల నుంచి 2,039 బిలియన్ డాలర్లకు చేరింది. అదే సమయంలో చైనా జీడీపీ 440 శాతం పెరిగి 1.95 ట్రిలియన్ డాలర్ల నుంచి 10.5 ట్రిలియన్ డాలర్లకు ఎగబాకింది. తలసరి జీడీపీ: ప్రస్తుత ధరల ప్రకారం చూస్తే 2024లో చైనా తలసరి జీడీపీ 25,015 డాలర్లుగా ఉన్నది. ఇది భారత జీడీపీ 10,123 డాలర్ల కంటే రెండున్నర రెట్లు అధికం. 1980లలో భారత తలసరి ఆదాయం 582 డాలర్లుగా ఉన్నది. ఇది అప్పటి చైనా తలసరి ఆదాయం 307 డాలర్ల కంటే సుమారు రెండు రెట్లు ఎక్కువ. 1980ల నుంచి చైనా తలసరి ఆదాయం 82 రెట్లు పెరిగింది. అదే సమయంలో భారత తలసరి ఆదాయం 17 రెట్లు మాత్రమే పెరగడం గమనార్హం. మోదీ హయాంలో గత పదేండ్లలో భారత తలసరి ఆదాయం 95 శాతం పెరిగింది. 2014లో 5,187 డాలర్లుగా ఉన్న తలసరి ఆదాయం 2024 నాటికి 10,123 డాలర్లకు చేరుకున్నది. అదే సమయంలో చైనా తలసరి ఆదాయం 100 శాతం పెరిగి.. 12,496 డాలర్ల నుంచి 25,015 డాలర్లకు ఎగబాకింది. 2004–14 మధ్యకాలంలో మన్మోహన్ సింగ్ హయాంలో 93 శాతం పెరిగి.. 2,681 డాలర్ల నుంచి 5,187 డాలర్లకు చేరింది. అదే సమయంలో చైనా జీడీపీ 185 శాతం పెరగడం గమనార్హం.

జీడీపీలో ప్రభుత్వ స్థూల అప్పు: 2024లో భారత జీడీపీలో ప్రభుత్వ స్థూల అప్పు 82.5 శాతం ఉండగా.. చైనా ప్రభుత్వ స్థూల అప్పు 88.6 శాతం ఉన్నది. 1995లో భారత స్థూల అప్పు 71 శాతం ఉండగా.. చైనా స్థూల అప్పు 21.6 శాతం ఉండేది. 2004–14 మధ్యకాలంలో యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ అప్పు 84.9 శాతం నుంచి 67.1 శాతానికి తగ్గింది. 2014–24 మధ్యకాలంలో బీజేపీ హయాంలో ప్రభుత్వ అప్పు 67.1 శాతం నుంచి 82.5 శాతానికి ఎగబాకింది. ఎగుమతులు: వరల్డ్ బ్యాంకు డాటా ప్రకా రం.. చైనానే ప్రపంచంలోనే అతిపెద్ద ఎగుమతిదారు. వస్తువులు, సేవల రూపంలో 2023 లో చైనా చేసిన ఎగుమతుల విలువ 3.5 ట్రిలియన్ డాలర్లు. మెక్‌కిన్సీ నివేదిక ప్రకా రం.. ఇది ప్రపంచ ఎగుమతుల్లో సుమారు 14 శాతం. అదే సమయంలో 0.78 ట్రిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులతో భార త్ పదో స్థానంలో ఉన్నది. ఈ లెక్కన భారత్‌తో పోలిస్తే చైనా ఎగుమతులు సుమారుగా ఐదింతలు ఎక్కువ కావడం గమనార్హం.

ద్రవ్య క్రమశిక్షణ పాటిస్తూనే, మౌలిక వసతుల అభివృద్ధి, దేశీయ తయారీపై దృష్టి సారిస్తూ ఈ వృద్ధిని ఇలాగే కొనసాగిస్తే.. భారత్ కూడా ప్రపంచ శక్తిగా, అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశాల్లో ఒకటిగా నిలవగలదని నిపుణులు సూచిస్తున్నారు. వరల్డ్ బ్యాంకు డాటా ప్రకారం.. చైనానే ప్రపంచంలోనే అతిపెద్ద ఎగుమతిదారు. వస్తువులు, సేవల రూపంలో 2023లో చైనా చేసిన ఎగుమతుల విలువ 3.5 ట్రిలియన్ డాలర్లు. మెక్‌కిన్సీ నివేదిక ప్రకారం.. ఇది ప్రపంచ ఎగుమతుల్లో సుమారు 14 శాతం.

# పని ఒత్తిడి మహమ్మారి




ఢిల్లీలోని బొటిక్ సేవల స్టార్టప్ కంపెనీ 'యెస్ మేడమ్' పేరు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతున్నది. పని ఒత్తిడికి గురవుతున్నట్టు అభ్యర్థించిన కొందరు ఉద్యోగులను తొలగించినట్టు వార్తలు వ్యాపించాయి. దీంతో ఆ వివాదం ముదిరిందని గమనించిన సదరు కంపెనీ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. 'ఎవరినీ తొలగించలేదని, కొంతకాలం పాటు విరామం మాత్రమే' అని వివరణ ఇచ్చింది. దీంతో, ప్రైవేటు ఉద్యోగుల పని పరిస్థితులు ఒక్కసారిగా దేశవ్యాప్తంగా చర్చకు వచ్చాయి. నేడు పని ఒత్తిడి అనే సమస్య ప్రపంచవ్యాప్త మహమ్మారిలా మారిపోయింది. ఉద్యోగులు ఎదుర్కొనే శారీరక, మానసిక సమస్యలకు పని ఒత్తిడే కారణమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 'నిరంతరం అందుబాటులో ఉండటం' అనే సూత్రం ఈ రోజుల్లో తప్పనిసరైంది.

ఒక సర్వే ప్రకారం ప్రతి పది మందిలో తొమ్మండుగురికి పనిగంటల వెలుపల ఆఫీసు ఫోన్లు వస్తున్నాయి. ఆ కాల్స్ ఎత్తకపోతే ప్రమోషన్లు నిలిపివేయడం వంటి సమస్యలు ఎదురైనట్టు 79 శాతం మంది చెప్పారు. దీని పర్యవసానంగా వ్యకిగతమనేది కుంచించుకుపోతున్నది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి నలుగురిలో ఒకరు పని ఒత్తిడి వల్ల చతికిలపడుతుంటే ఆసియాలో మాత్రం వారి సంఖ్య ప్రతి ముగ్గురిలో ఒకరుగా ఉండటం బాధాకరం. పని చేసే వయసులో ఉన్న 15 శాతం మంది వయోజనులు మానసిక సమస్యలతో బాధపడుతున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక తెలియజేసింది.

ఉద్యోగుల్లో మానసిక సమస్యల వల్ల ఏటా ప్రపంచవ్యాప్తంగా 1200 కోట్ల పనిదినాలు వ్యర్థమవుతున్నాయి. తద్వారా రూ.80 లక్షల కోట్ల పైచిలుకు నష్టం వాటిల్లుతున్నది. ఆర్థిక సరళీకరణల అనంతర కాలంలో హక్కులు, యూనియన్లు బలహీనపడిపోవడం ప్రస్తుత పరిస్థితులకు ప్రధాన కారణం. ఉద్యోగ భద్రత అనేది ఉల్లిపొరలా పలుచనైంది. ఈ నేపథ్యంలోనే ఉద్యోగ భారం ఉసురు తీస్తున్నది. లక్ష్యాలు అందుకోవడం కోసం తీసే పరుగుల్లో అలసిసొలసి అసువులు బాసేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది. బహుళజాతి దిగ్గజ సంస్థ 'ఎర్నెస్ట్ అండ్ యంగ్'లో పనిచేస్తున్న 26 ఏండ్ల యువతి పని ఒత్తిడి కారణంగా ఇటీవల మరణించిందన్న వార్త సంచలనమైంది. నిజానికి ఈ తరహా మరణాలు లెక్కల్లోకి ఎక్కవన్నది తెలిసిందే.

ఓ వైపు ఈ సమస్యకు పరిష్కారం కనుగొనడంపై ఆరోగ్య, సామాజికరంగ నిపుణులు బుర్రలు బద్దలు కొట్టుకుంటుంటే ఇన్ఫోసిస్ నారాయణమూర్తి మాత్రం పనిగంటలు పెంచాలని బాంబు పేలుస్తున్నారు. వారానికి 48 గంటల పని సమయంతోనే తిప్పలు పడుతుంటే ఆయ న ఏకంగా 70 గంటలకు పెంచాలని సూచించడం విడ్డూరం. ఈ ఆచరణ సాధ్యం కాని ప్రతిపాదనల మాట అలా ఉంచితే తక్షణం కావాల్సింది ఉద్యోగుల సంక్షేమం. ఉద్యోగం చేయడానికి బతుకుతున్నామో లేక బతికేందుకు ఉద్యోగం చేస్తున్నామో తెలియని విషమ వలయంలో వారు ఊగిసలాడుతున్నారు. వీలైనంత త్వరలో పని పరిస్థితులు చక్కదిద్ది బతుకుపై భరోసా కల్పించాల్సిన అవసరం ఉన్నది. ప్రాజెక్టులు, కాంట్రాక్టుల విషయంలోనే కాదు, ఉద్యోగుల సంక్షేమం విషయంలోనూ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం అభిలషణీయమే.

# సిరియాలో పెనుమార్పులు



సిరియాలో ఐదు దశాబ్దాల అసద్ వంశీయుల నిరంకుశ పాలనకు తెరపడింది. తిరుగుబాటు దళాలు రాజధాని డమాస్కస్‌ను చుట్టుముట్టిన వేళ అధ్యక్షుడు బషర్ అల్ అసద్ మాస్కోకు పారిపోయి తలదాచుకున్నాడు. తిరుగుబాటు దళాలు గాల్లోకి కాల్పులు జరుపుతూ సంబురాలు జరుపుకొంటున్నాయి. ఒకప్పటి అల్ కాయిదా నేత అహ్మద్ అల్ శరా తన గతాన్ని, పాత మారు పేరును వదిలించుకొని సిరియా పగ్గాలు చేపట్టారు. ఈ పరిణామాలు అంతర్యుద్ధంతో పదిహేనేండ్ల కాలంపాటు కకావికలమైపోయిన సిరియాకు శాంతిని ప్రసాదించగలవా? లేక పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు అవుతుందా అనేదే అసలు ప్రశ్న.

అసద్ ప్రభుత్వ పతనం తర్వాత జరుగుతున్న కొన్ని పరిణామాలు కలిగిస్తున్న ఆందోళనే ఇందుకు కారణం. సందట్లో సడేమియా అన్నట్టుగా ఇజ్రాయెల్ ప్రస్తుత అస్థిర పరిస్థితులను అలుసుగా తీసుకొని దాడులకు తెగబడుతున్నది. సరిహద్దు భూభాగాలను రాత్రికి రాత్రే ఆక్రమించుకుంది. అంతేకాకుండా రసాయనిక ఆయుధ కేంద్రాలు, క్షిపణి స్థావరాలుగా భావిస్తున్న ప్రదేశాలపై బాంబు దాడులకు పాల్పడుతున్నది. అగ్రరాజ్యం అమెరికా 'నేనేం తక్కువ తిన్నానా' అన్నట్టుగా ఇస్లామిక్ స్టేట్ శక్తులను దెబ్బతీసే సాకుతో 75 ప్రదేశాలపై బాంబులు వేసింది. ఈ దాడులు ఏ మాత్రం వాంఛనీయమైనవి కావు. ఈ దుందుడుకు చర్యల పర్యవసానాలు ఎలా ఉంటాయో ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు.


అంతర్జాతీయ శక్తుల ప్రచ్ఛన్న యుద్ధానికి సిరియా వేదికగా మారిన సంగతి తెలిసిందే. ప్రధానంగా అమెరికా, రష్యా, సౌదీ అరేబియా, ఇరాన్ తమ తమ ప్రాబల్యం కోసం సిరియాలో రకరకాల శక్తులను వెనకేసుకు వస్తున్నాయి. ఉక్రెయిన్ యుద్ధంలో తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్న రష్యా మద్దతు తగ్గించడం వల్లనే అసద్ ప్రభుత్వం పతనమైందనే వాదనలు వినిపిస్తున్నాయి. షియా–సున్నీ విభేదాలు, రష్యా–అమెరికా తగాదాలకు నెలవుగా మారిన సిరియా బలమైన కేంద్రం అనేది లేకపోవడం కారణంగా ఇప్పుడు జిహాదీ శక్తుల చేతుల్లోకి వెళ్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఈ కారణంగా శాంతి ఎండమావిగా మారి, అంతర్జాతీయ ఉగ్రవాదం పెచ్చరిల్లేందుకు ఆస్కారం ఉన్నది. ఇది సిరియాకే కాకుండా యావత్తు ప్రపంచానికి సమస్యగా పరిణమించవచ్చు. ఇందుకు మనకు అఫ్గనిస్థాన్, ఇరాక్ ఉదాహరణలు ఉండనే ఉన్నాయి.

అసద్ ప్రభుత్వం కూలిపోవడాన్ని సిరియాలో శాశ్వత శాంతిస్థాపనకు ఒక సువర్ణావకాశంగా ప్రపంచ దేశాలు భావించాలి. 2017లో రష్యా, ఇరాన్, టర్కీ ఆధ్వర్యంలో చేపట్టిన అస్తానా శాంతి చర్చల క్రమాన్ని కొనసాగించాలి. ఉద్రిక్తతలు తగ్గించి, మానవతా సహాయం చేరవేతకు ఎదురవుతున్న అడ్డంకులను తొలగించడం, రాజకీయ చర్చలకు వీలు కల్పించడం అనే త్రిముఖ వ్యూహంతో ఆ చర్చలు మొదలయ్యాయి. 22 విడతల చర్చలు జరిగినా నిర్వాహకులు ప్రత్యర్థి వర్గాలను చెరోవైపున సమర్థిస్తుండటంతో పెద్దగా పురోగతి సాధ్యపడలేదు. అయితే, పరిస్థితి పూర్తిగా నిరాశాజనకంగా ఏమీ లేదు.

సంక్షోభం ముదురుతున్న దశలో మొన్నటి శనివారం మూడు నిర్వాహక దేశాలు ఖతార్ రాజధాని దోహాలో సమావేశమై సిరియాలో కాల్పుల విరమణ, రాజకీయ సంప్రదింపులు, స్వేచ్ఛాయుత ఎన్నికల కోసం ఐక్య రాజ్య సమితి భద్రతామండలి చేసిన 2,254 తీర్మానాన్ని అమలుచేయడంపై ఏకాభిప్రాయానికి రావడం ముదావహం. ఇందుకు సంబంధించిన ఉమ్మడి ప్రకటనపై పైన తెలిపిన మూడు దేశాలతో పాటుగా ఈజిప్ట్, సౌదీ అరేబియా, ఇరాక్, జోర్డాన్, ఖతార్ సంతకాలు చేశాయి. ఇదే అదనుగా ఐరాస చొరవ తీసుకొని సుస్థిర ప్రభుత్వం ఏర్పాటు దిశగా కృషిచేయాలి. అంతిమంగా స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు వీలైన పరిస్థితులు కల్పించాలి. ప్రపంచ శాంతికి ప్రజాస్వామిక సిరియా హామీగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

# వరాల వేలుపు

భక్తి



గృహిణులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించే వ్రతం... వరలక్ష్మీ వ్రతం. సంపదలను ప్రసాదించే ఈ వ్రతాన్ని శ్రావణమాసంలో... పౌర్ణమికి ముందుగా వచ్చే శుక్రవారం చేసుకోవడం సంప్రదాయం. శ్రావణమాసానికి, శుక్రవారాలకు ఉన్న విశిష్టతలే దీనికి కారణం. శ్రీసూక్తంలోని మొదటి శ్లోకం 'లోకైక దీపాంకురాం' అంటూ శ్రీమహాలక్ష్మిని వర్ణిస్తుంది. లక్ష్మీ దేవి సమస్త లోకానికీ వెలుగునిచ్చే దీపం. ఆమె క్షీరసాగర తనయ. శ్రవణం నక్షత్రం జన్మతిథిగా ఉన్న శ్రీహరిని భర్తగా పొందింది. పౌర్ణమి రోజున శ్రవణం నక్షత్రం ఉండే మాసమే శ్రావణమాసం. అలాగే.... పౌర్ణమినాడు షోడశ కళలతో ప్రకాశించే చంద్రుడు... లక్ష్మీదేవికి తోబుట్టువు. అంటే అటు పుట్టినిల్లు, ఇటు మెట్టినిల్లు కాంతులతో విలసిల్లుతూ ఉంటుంది.

ఇక... శుక్రవారాన్ని 'భృగువారం' అంటారు. ఒక జన్మలో భృగుమహర్షి కుమార్తెగా లక్ష్మీదేవి శుక్రవారం నాడు జన్మించింది. అందుకే ఆమెను 'భార్గవీ లోక జననీ క్షీరసాగర కన్యకా' అంటూ పూజిస్తారు. శుక్రవారం ఆమెకు ఇష్టమైన రోజు. ఇలా ఎన్నో ప్రత్యేకతలు కలిగినవి శ్రావణ శుక్రవారాలు. వ్రతకథ, విధానం...

వరలక్ష్మీ వ్రతం మహిళలందరూ ఆచరించదగినది. శ్రద్ధాభక్తులతో ఆ తల్లిని పూజించినవారిని ఎలాంటి కొరతా లేకుండా కటాక్షిస్తుందన్నది పెద్దల మాట. పుట్టింటివారితో, మెట్టినింటివారితో ఆప్యాయంగా మసలుకుంటూ, ఇరుగు పొరుగువారితో నిరహంకారంగా మెలుగుతూ... పెద్దలను గౌరవిస్తూ, పిన్నలను ఆదరంగా చూస్తూ... కుటుంబానికి కేంద్రబిందువుగా ఉండే మహిళగా 'వరలక్ష్మీ వ్రత కథ'లోని చారుమతి పాత్ర కనిపిస్తుంది. చారుమతిలోని ఆ గుణాలు లక్ష్మీ దేవికి ప్రీతిపాత్రమైనవనీ, అటువంటి వారికి ఆ తల్లి దయ ఎల్లప్పుడూ ఉంటుందనీ ఈ కథ వెల్లడిస్తుంది. చారుమతికి వరలక్ష్మీదేవి కలలో దర్శనమిచ్చి... తాను వరలక్ష్మిననీ, శ్రావణ పౌర్ణమికి ముందుగా వచ్చే శుక్రవారం తనను భక్తి శ్రద్ధలతో పూజిస్తే కోరిన వరాలు కురిపిస్తాననీ చెబుతుంది. ఈ సంగతి ఇంటి పెద్దలకు, ఇరుగుపొరుగువారికీ చారుమతి తెలియజేస్తుంది. వరలక్ష్మీదేవి ఆదేశం ప్రకారం... చారుమతితో పాటు ఇరుగు పొరుగు ఇల్లాళ్ళందరూ.... ఆ రోజు అందరూ శుచిగా స్నానాలు ఆచరించారు. వ్రత విధానాన్ని పాటిస్తూ... షోడశోపచారాలతో అమ్మవారిని ఆరాధించారు. తోరాలను పూజించారు. వరలక్ష్మికి ప్రతీకగా నిలిపిన కలశానికి, అనంతరం తమ మంజేతులకు తోరాలను కట్టుకున్నారు. వ్రత మంటపానికి ముమ్మారు ప్రదక్షిణ చేశారు. ఈ విధంగా వ్రతం ఆచరించి, వారందరూ వరలక్ష్మీ కటాక్షాన్ని పొందారని వ్రత కథ వివరిస్తోంది. ఎలాంటి వివక్షలూ, పక్షపాతాలూ లేకుండా... సమష్టిగా వ్రతాలనూ, సత్కార్యాలనూ ఆచరించి, వచ్చిన ఫలితాన్ని సమానంగా అనుభవించాలని ఈ కథ బోధిస్తోంది.

లక్ష్మీ దేవికి ఎన్నో పేర్లు, అంశలు ఉన్నా... ఆరింటినే ప్రధానంగా పేర్కొంటారు. శ్రీసూక్తంలోని 'శుద్ధలక్ష్మీ ర్మోక్షలక్ష్మీ జయలక్ష్మీ సరస్వతీ... శ్రీలక్ష్మీ ర్వరలక్ష్మీశ్చ ప్రసన్నమమ సర్వదా' అనే శ్లోకం వాటి గురించి చెబుతుంది. మొదటిది శుద్ధ లక్ష్మి: మన సంపద శుద్ధంగా... అంటే అవినీతికి తావులేకుండా ఉండాలి. అధర్మంగా, హింసామార్గంలో సంపాదించినది కాకూడదు. శుద్ధమైన సంపదను ధర్మబద్ధంగా వితరణ చేయాలి. అప్పుడే లక్ష్మి ప్రసన్నమవుతుంది. రెండోది మోక్షలక్ష్మి. పేరులోనే 'మోక్షప్రదాయిని' అనే అర్థం ఉంది. చతుర్విధ పురుషార్థాలలో చివరిది మోక్షం. మోక్షాన్ని కోరుతూ లక్ష్మీదేవిని ఆశ్రయిస్తే... లౌకికమైన ప్రలోభాల నుంచి ఆధ్యాత్మికమార్గానికి మళ్ళిస్తుంది. మూడోది జయలక్ష్మి: లక్ష్మీదేవిని త్రికరణశుద్ధిగా పూజిస్తే సర్వత్రా జయం కలుగుతుంది. మంచి పనులను తలపెట్టి, అవి నిర్విఘ్నంగా పూర్తికావాలని ఆమెను ప్రార్థించాలి. నాలుగోది సరస్వతి: సరస్వతికి ప్రతీక విద్యాలక్ష్మి. ఆమె అనుగ్రహం ఉంటే ఎంతటి మందబుద్ధి అయినా ప్రతిభాసంపన్నుడు అవుతాడు. అయిదోది శ్రీలక్ష్మి: ఇది ధనలక్ష్మికి పర్యాయపదం. రఘు మహారాజు శ్రీసూక్త మంత్రాలతో కుబేరుని నుంచి ధనాన్ని పొందాడు. శ్రీఆదిశంకరులు పేద గృహిణి ఇంట కనకధారను కురిపించిన కథ అందరికీ తెలిసినదే. ఇలా అయిదు రీతులలో అనుగ్రహించే శ్రీమహాలక్ష్మి... ఆ ప్రయోజనాలన్నిటినీ వరంగా ప్రసాదించే రూపమే... ఆరవది అయిన వరలక్ష్మి. ధాన్యలక్ష్మి, సంతానలక్ష్మి, ధైర్య లక్ష్మి, సంతాన లక్ష్మి... ఇలా ఆమెకు అనేక రూపాలు. వాటన్నిటి సమగ్ర రూపమే వరలక్ష్మీ దేవి అనేది పెద్దల మాట.

## స్నానంతో అదృష్టం!



స్నానం చేసే నీటిలో కొన్ని మూలికలు, దినుసులు కలిపితే అందం, ఆరోగ్యంతోపాటు అదృష్టం కూడా కలిసి వస్తుందని జ్యోతిషం చెబుతోంది. వాటి గురించి తెలుసుకుందాం.

వేపాకు..వేపాకులో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. అందుకే దీన్ని ఆయుర్వేద మందుల తయారీలో ఉపయోగిస్తుంటారు. ఇందులో యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు కూడా పుష్కలంగా ఉంటాయి. ఒక బకెట్ గోరువెచ్చని నీటిలో గుప్పెడు వేపాకులను వేసి అయిదు నిమిషాల తరవాత స్నానం చేస్తే శరీరంలోని ప్రతికూల శక్తి అంతా బయటికి వెళుతుంది. సానుకూల దృక్పథం పెరుగుతుంది. మంచి ఆలోచనలు వస్తాయి.

గంధం..స్నానం చేసే నీటిలో గంధం చెక్క లేదా పొడి వేసుకుంటే కీర్తిప్రతిష్టలు, సంపద పెరుగుతాయనీ, అదృష్టం కలిసి వస్తుందనీ, చేపట్టిన ప్రతిపనిలో విజయం దక్కుతుందనీ జ్యోతిషం చెబుతోంది. అంతేకాదు... శరీరానికి, మెదడుకి చల్లదనాన్ని, విశ్రాంతిని అందిస్తుంది. గంధం సువాసన ఎంతటి ఒత్తిడినైనా తగ్గిస్తుంది. కష్టాలను దాటుకుని ముందుకు సాగే ధైర్యాన్ని ఇస్తుంది.

**పసుపు**

ఆయుర్వేదం ప్రకారం పసుపు ఆరోగ్య ప్రదాయిని. శుభాలకు సంకేతం. ఇది మంచి యాంటీ బ్యాక్టీరియల్ ఔషధం. ఒక బకెట్ నీటిలో చెంచా పసుపు కలుపుకొని స్నానం చేస్తే శరీరం మీద ఉన్న వ్యాధికారక క్రిములన్నీ నశిస్తాయి. పసుపుకి ఉన్న ప్రత్యేకమైన సువాసన మెదడుని ఉత్తేజితం చేస్తుంది. నూతనోత్సాహాన్ని ఇస్తుంది. చర్మానికి మంచి ఛాయతోపాటు కాంతిని అందిస్తుంది.

# దూకుడు తగ్గించాల్సిందే!



ఈ కాలం పిల్లల్లో దూకుడు స్వభావం పెరుగుతున్నది. పెంపకంలో లోపం, తల్లిదండ్రుల గారాబమే ఇందుకు కారణంగా కనిపిస్తున్నది. అయితే, వారిని అదుపులో పెట్టడానికి అరవడం, తిట్టడం, కొట్టడం చేస్తే.. మరీ మొండిగా తయారయ్యే ప్రమాదం ఉంది. అది వాళ్ల ఎదుగుదల మీదా ప్రభావం చూపుతుంది. కాబట్టి.. పిల్లల్లో దూకుడు స్వభావాన్ని తగ్గించాలంటే, వారిని కాస్త నెమ్మదిగానే దగ్గరికి తీసుకోవాలి. అదెలాగంటే..

ప్రశాంతతే ప్రధానం: కొందరు పిల్లల్లో కోపం, విసుగు, అసహనం ఎక్కువగా ఉంటాయి. అలాంటివారితో ఎలాంటి సందర్భాల్లోనైనా ప్రశాంతంగానే వ్యవహరించాలి. వారు ఏదైనా తప్పుచేస్తే.. అందరిముందూ కోప్పడకుండా ప్రశాంతంగా వారిని దగ్గరికి తీసుకోవాలి. మీ భావోద్వేగాలు నియంత్రణలోనే ఉన్నాయని పిల్లలకు తెలిసేలా వ్యవహరించాలి. అప్పుడే పరిస్థితి తీవ్రతరం కాకుండా ఉంటుంది.

భావోద్వేగాలతో బంధం: పిల్లల్లో ప్రతికూల భావోద్వేగాలు ఉన్నప్పుడే.. వారిలో దూకుడు, నిరాశ, కోపం అనేవి పెరుగుతాయి. అలాంటి సమయంలో కొందరు తీవ్రమైన ఒత్తిడికి గురవుతారు. కాబట్టి.. మీ పిల్లలు తీవ్రమైన భావోద్వేగాలకు గురైనప్పుడు వారికి మద్దతుగా నిలవాలి. వాళ్ల ఫీలింగ్స్‌ను అర్థం చేసుకోవాలి. వారి భావాలను నిర్భయంగా పంచుకోవడానికి కావాల్సిన వాతావరణాన్ని కల్పించాలి. ఏదైనా విషయంలో వారు కలత చెందినట్లు అనిపిస్తే.. వారు ప్రశాంతంగా మారడానికి తగిన సమయం ఇవ్వాలి. వారిని కాసేపు అలా ఒంటరిగా వదిలేయాలి.

స్నేహ హస్తం: పిల్లలతో కఠినంగా ఉండకుండా.. స్నేహితులుగా మెలగండి. వారితో సరదాగా సమయం గడపడం వల్ల పిల్లల మనసులో ఉండే సంకోచాలు దూరమైపోతాయి. స్కూల్ నుంచి రాగానే హోమ్‌వర్క్ చేయమంటూ విసిగించకుండా.. స్కూల్‌లో సమయాన్ని ఎలా గడిపారో తెలుసుకోండి. దాంతో వాళ్లు మీకు మరింత దగ్గరవుతారు. దృష్టిని మళ్లించాల్సిందే: కొన్నిసార్లు పిల్లల దృష్టిని మళ్లించడం కూడా వారిని కూల్ చేస్తుంది. పిల్లలు దూకుడు స్వభావాన్ని మార్చుకునేందుకు ప్రయత్నిస్తూ ఉంటే.. వారికి సపోర్ట్ చేయాలి. ఇవన్నీ కాకుండా, పరిస్థితి మరీ చేయి దాటిపోతున్నట్లు అనిపిస్తే.. చైల్డ్ సైకాలజిస్ట్ లేదా థెరపిస్ట్‌ని కలవడం మంచిది.

# చియాతో చలికి చెక్!





వేసవిలో 'చియా విత్తనాలు' ఓ దివ్యౌషధం! ఎండల్లో ఎదురయ్యే అనేక సమస్యలకు 'చియా వాటర్' అమృతంతో సమానం! అయితే, చలికాలంలోనూ 'చియా సీడ్స్' తీసుకోవడం మంచిదేనని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. 'చియా వాటర్'తో శీతకాలపు సమస్యలకు చెక్ పెట్టొచ్చని చెబుతున్నారు.

సాధారణంగా చల్లటి వాతావరణంలో నీళ్లు తక్కువగా తాగుతుంటారు. ఫలితంగా శరీరం డీహైడ్రేషన్‌కు గురవడంతోపాటు జీర్ణక్రియ మందగిస్తుంది. ఈ రెండు సమస్యలకూ 'చియా సీడ్స్' చక్కని పరిష్కారం చూపుతాయి. ఒక గ్లాస్ నీటిలో రెండుమూడు టేబుల్ స్పూన్ల చియా విత్తనాలు వేసి.. రాత్రంతా నానబెట్టాలి. ఆ నీటిని ఉదయం పరగడుపునే తాగితే.. శరీరం రోజంతా హైడ్రేటెడ్‌గా ఉంటుంది. పీచు పదార్థం పుష్కలంగా లభించి.. జీర్ణక్రియ ఆరోగ్యం మెరుగుపడుతుంది. మలబద్ధకం నుంచీ ఉపశమనం లభిస్తుంది.

చలికాలంలో చర్మ సమస్యలు ఎక్కువగా వేధిస్తుంటాయి. చియా విత్తనాల్లో ఉండే యాంటి ఆక్సిడెంట్లు.. చర్మం తేమను కోల్పోకుండా కాపాడుతాయి. చర్మ సమస్యలను దూరం చేయడంతోపాటు చర్మంపై మచ్చలను తగ్గించేందుకూ సాయపడుతాయి. ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లాలు చర్మ సంరక్షణలోనూ ముందుంటాయనీ, చర్మం పొడిబారడాన్ని తగ్గిస్తాయనీ జర్నల్ ఆఫ్ డెర్మటోలాజికల్ సైన్స్ పరిశోధన చెబుతున్నది.

చియా గింజల్లో యాంటి ఆక్సిడెంట్లు ఎక్కువ. ఇవి ఫ్రీ రాడికల్స్ నుంచి శరీరాన్ని రక్షించడంలో సాయపడతాయి. ఇందులోని యాంటి ఇన్‌ఫ్లమేటరీ, యాంటి క్యాన్సర్ లక్షణాలు.. కణాల నష్టాన్ని నివారిస్తాయి.

ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ అంటేనే.. సాల్మన్ చేపలు గుర్తొస్తాయి. కానీ, వాటిలో కంటే ఎక్కువగా చియా విత్తనాల్లోనే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ లభిస్తాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో, వాపును తగ్గించడంలో, మెదడు పనితీరును మెరుగుపరచడంలో కీలకంగా వ్యవహరిస్తాయి. క్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలోనూ ముందుంటాయి.

యాంటి ఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్‌తో కూడిన చియా విత్తనాలు.. శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. జలుబు, దగ్గు, ఫ్లూ వంటి వ్యాధులకు వ్యతిరేకంగా పోరాడటంలో కీలకంగా పనిచేస్తాయి.

# రోజూ బ్లాక్ కాఫీ తాగడం వల్ల కలిగే అద్భుతమైన లాభాలివే..!

**చల్లని వాతావరణంలో వేడి వేడిగా కాఫీ కలుపుకుని తాగితే వచ్చే మజాయే వేరు కదా. వేడి వేడి కాఫీ గొంతు నుంచి దిగుతుంటే కలిగే హాయి మాటల్లో చెప్పలేం. చాలా మంది కాఫీ రుచిని ఇలాగే ఆస్వాదిస్తారు. అయితే సాధారణ కాఫీ కంటే బ్లాక్ కాఫీ తాగితే ఇంకా ఎక్కువ ప్రయోజనం పొందవచ్చని సైంటిస్టులు చెబుతున్నారు. ఎందుకంటే బ్లాక్ కాఫీ తాగడం వల్ల మన శరీరం పలు విటమిన్లను శోషించుకుంటుంది. పలు అనారోగ్య సమస్యలు కూడా రాకుండా ఉంటాయి. మరి బ్లాక్ కాఫీ తాగడం వల్ల ఎలాంటి లాభాలు కలుగుతాయో ఇప్పుడు తెలుసుకుందామా..!**



1. బ్లాక్ కాఫీ తాగడం వల్ల లివర్ ఆరోగ్యం మెరుగు పడుతుంది. రోజుకు కనీసం 2 కప్పుల బ్లాక్ కాఫీ తాగితే లివర్ సిర్రోసిస్ వచ్చే అవకాశం 80 శాతం వరకు తగ్గుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. అలాగే లివర్ క్యాన్సర్ వచ్చే అవకాశాలు 40 శాతం వరకు తగ్గుతాయి.

2. బ్లాక్ కాఫీని తాగితే డిప్రెషన్ నుంచి బయట పడవచ్చు. మూడ్ మారుతుంది. మనస్సుకు ప్రశాంతత కలుగుతుంది. నిత్యం తీవ్రమైన ఒత్తిడితో సతమతమయ్యేవారు బ్లాక్ కాఫీ తాగితే ప్రయోజనం పొందవచ్చు. అంతేకాదు, బ్లాక్ కాఫీ తాగడం వల్ల మెదడు చురుగ్గా పనిచేస్తుంది. మెదడు యాక్టివ్‌గా పనిచేసేందుకు కారణమయ్యే న్యూరోట్రాన్స్‌మీటర్లు బ్లాక్ కాఫీ తాగడం వల్ల విడుదలవుతాయి. అందువల్ల మనం చురుగ్గా ఉండగలుగుతాం.

3. బ్లాక్ కాఫీ తాగడం వల్ల మన శరీర మెటబాలిజం 11 శాతం వరకు పెరుగుతుంది. దీంతో క్యాలరీలు, కొవ్వు కరుగుతాయి. ఇది అధిక బరువును తగ్గించుకునేందుకు మేలు చేస్తుంది.

4. బ్లాక్ కాఫీ తాగడం వల్ల మన శరీరం మనం తినే ఆహారం నుంచి విటమిన్ బి2, బి3, బి5, మాంగనీస్, మెగ్నిషియం, పొటాషియం తదితర పోషకాలను బాగా గ్రహించగలుగుతుంది. దీంతో మనకు పోషణ అందుతుంది.

5. టైప్ 2 డయాబెటిస్‌తో బాధపడుతున్న వారికి బ్లాక్ కాఫీ వరమనే చెప్పవచ్చు. దీన్ని తాగడం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. అలాగే డయాబెటిస్ లేని వారు తాగితే ఆ వ్యాధి వచ్చే అవకాశం 7 శాతం వరకు తగ్గుతుందని పరిశోధనలు చెబుతున్నాయి.

6. పలు రకాల క్యాన్సర్లు రాకుండా చూడడంలో బ్లాక్ కాఫీ అమోఘంగా పనిచేస్తుంది. రోజూ బ్లాక్ కాఫీ తాగడం వల్ల లివర్, పెద్దపేగు క్యాన్సర్లు వచ్చే అవకాశం 40 శాతం వరకు తగ్గుతుందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. 7. రోజూ బ్లాక్ కాఫీ తాగడం వల్ల వాకింగ్ చేసిన ప్రయోజనాన్ని పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు.

# వేపాకులతో కలిగే అద్భుత లాభాలివే తెలుసా..!

వేప ఆకులకు ఆయుర్వేదంలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. అనేక రకాల రోగాలను నయం చేసేందుకు వేప ఆకులను విరివిగా వాడుతారు. సుమారుగా 4,500 సంవత్సరాల కిందటే వేపాకులను వైద్య చికిత్సలో ఉపయోగించినట్లు ఆధారాలున్నాయి. వేపాకులు మన శరీరంలో అధికంగా ఉన్న వాతాన్ని తొలగిస్తాయి. రక్తాన్ని శుభ్రపరుస్తాయి. శరీరంలోని విష పదార్థాలను బయటకు పంపే శక్తి వేపాకులకు ఉంది. వేప ఆకుల వల్ల మనకు ఇంకా ఎలాంటి అద్భుతమైన లాభాలు కలుగుతాయో ఇప్పుడు తెలుసుకుందాం.

మన శరీర రోగ నిరోధక శక్తిని పెంచే గుణాలు వేప ఆకులో పుష్కలంగా ఉన్నాయి. కొన్ని వేపాకులను టీ లో వేసి మరిగించి ఆ టీని తాగితే దాంతో శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వేపాకులో ఉన్న యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఇన్‌ఫెక్షన్లు రాకుండా చూస్తాయి. విష జ్వరాలను తరిమి కొడతాయి. శరీరంలోకి ప్రవేశించే వైరస్‌లు, బ్యాక్టీరియాలు నశిస్తాయి.

కొన్ని వేపాకులను తీసుకుని బాగా కడిగి శుభ్రం చేసి వాటిని ఆరబెట్టాలి. అనంతరం వాటిని నీడలో ఎండబెట్టాలి. బాగా ఎండాక వాటిని పొడి చేయాలి. ఆ పొడిని నిత్యం ఒక టీస్పూన్ మోతాదులో తీసుకుని దానికి అంతే మోతాదులో తేనె కలిపి తినాలి. ఇలా చేయడం వల్ల శరీరంలో ఉండే విష, వ్యర్థ పదార్థాలు బయటకు వెళ్లిపోతాయి. శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది.


వేప ఆకులను ఎండ బెట్టి పొడి చేసి ఆ పొడిని ఒక టీస్పూన్ మోతాదులో తీసుకుని దాన్ని ఒక గ్లాస్ నీటిలో కలిపి రోజూ ఉదయం, సాయంత్రం భోజనానికి ముందు తాగితే డయాబెటిస్ అదుపులో ఉంటుంది. రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. వేప ఆకులను నమిలినా, లేదా పొడి రూపంలో తీసుకున్నా జీర్ణవ్యవస్థ శుభ్రమవుతుంది. గ్యాస్, అజీర్ణం, అసిడిటీ, మలబద్దకం ఉండవు. జీర్ణాశయం, పేగుల్లో ఉండే సూక్ష్మజీవులు నశిస్తాయి. రోగాలు రాకుండా ఉంటాయి. అలాగే అల్సర్లు కూడా తగ్గుముఖం పడతాయి.వేప ఆకులు కొన్నింటిని తీసుకుని బాగా నూరి పేస్ట్‌లా చేయాలి. ఈ మిశ్రమాన్ని కీళ్ల నొప్పులు ఉన్న చోట రాస్తే తక్షణమే నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. 6. వేప ఆకులను కొన్నింటిని తీసుకుని నీటిలో వేసి బాగా మరిగించాలి. ఆ నీటిని గోరు వెచ్చగా ఉన్నప్పుడు నోట్లో పోసుకుని బాగా పుక్కిలించాలి. ఇలా రోజూ చేయడం వల్ల నోటి దుర్వాసన తగ్గుతుంది. నోట్లో ఉండే క్రిములు నశిస్తాయి.

**దంతాలు దృఢంగా మారుతాయి. చిగుళ్ల సమస్యలుండవు.**

7. వేపాకులను నీటిలో వేసి బాగా మరిగించాక వచ్చే నీటిని చల్లార్చి ఆ నీటితో కళ్లను కడుక్కుంటే కంటి దురదలు తగ్గుతాయి. కళ్ల కలక వచ్చిన వారు ఇలా చేస్తే సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. కళ్లలో మంట ఉన్నవారు కూడా ఈ చిట్కా ప్రయత్నించవచ్చు.

8. వేపాకులను నీటిలో వేసి బాగా మరిగించాక వచ్చే నీటిని స్నానం చేసే నీటిలో కలిపి అనంతరం ఆ నీటితో స్నానం చేస్తే చర్మం సంరక్షింపబడుతుంది. చర్మం కాంతివంతంగా, మ ృదువుగా మారుతుంది. 9. వేప ఆకులను నూరి పేస్ట్‌లా చేసి ఆ మిశ్రమాన్ని ముఖంపై రాయాలి.

## చెవిలో చప్పుడు ఎందుకు?



గుండెచప్పుడును పోలిన శబ్దం చెవిలో కూడా వినిపిస్తూ ఉంటుంది. ఈ లయబద్ధమైన శబ్దం వెనకేదైనా ఆరోగ్య సమస్య దాగి ఉందా? తెలుసుకుందాం!


నిశ్శబ్దంగా కూర్చుని ఉన్నప్పుడు లేదా పడుకుని ఉన్నప్పుడు చెవిలో గుండె చప్పుడుతో సమానమైన శబ్దం వినిపిస్తూ ఉంటుంది. దీన్ని 'పల్సటైల్ టిన్నిటస్' అంటారు. ఇలా నాడి కొట్టుకుంటున్నట్టు తోచే ఈ ఒంటి లయబద్ధమైన చప్పుడు కొందర్లో ఒక చెవిలో వినిపించవచ్చు, ఇంకొందర్లో రెండు చెవుల్లో వినిపించవచ్చు. మెడ, తలలోని రక్తనాళాల్లో రక్త ప్రవాహ ఫలితమే ఈ చప్పుడు. ఇలాంటి చప్పుడు వెనకున్న కారణాలు ఏవంటే...

వినికిడి లోపం: మధ్య చెవిలో ఇన్‌ఫెక్షన్ లేదా ఇన్‌ఫ్లమేషన్ లేదా ద్రవం పేరుకుపోవడం వల్ల వినికిడి లోపం తలెత్తవచ్చు. కొన్ని సందర్భాల్లో వినికిడికి తోడ్పడే చెవిలోని చిన్న ఎముకల్లో సమస్యలు తలెత్తడం వల్ల కూడా వినికిడి తగ్గవచ్చు. ఈ రకమైన వినికిడి లోపం అంతర్గతంగా తలలో శబ్దాలను కూడా తీవ్రతరం చేస్తుంది. అంటే ఊపిరి తీసుకోవడం, నమలడం, చెవిలోకి రక్తప్రసార శబ్దాల తీవ్రత పెరుగుతుంది.

కరోటిడ్ ధమని వ్యాధి: కరోటిడ్ ధమనుల్లో పేరుకుపోయే కొవ్వుల మూలంగా రక్తప్రవాహంలో హెచ్చుతగ్గులు చోటు చేసుకుని పల్సేటివ్ టిన్నిటస్ తలెత్తుతుంది.

అధిక రక్తపోటు: రక్తపోటు ఎక్కువగా ఉన్నప్పుడు, కరోటిడ్ ధమనిలో రక్త ఉధృతి ఫలితంగా కూడా చెవిలో చప్పుడు మొదలు కావచ్చు.

రక్తనాళ సమస్యలు: రక్తనాళంలో అవకారాలు (అన్యూరిజం), ధమనికీ, శిరకూ మధ్య అసాధారణ సంబంధం ఏర్పడి ఉండడం (ఆర్టీయిరోవీనస్ మాల్‌ఫార్మేషన్), ధమనులు మెలితిరిగి ఉండడం లేదా, కర్ణభేరి వెనక ఉండే రక్తనాళాల మీద కణుతులు పెరగడం వల్ల కూడా చెవిలో చప్పుళ్లు వినిపించవచ్చు.



### ఫేస్‌బుక్‌లో మునిగి తేలుతున్నారా..?

## డిప్రెషన్ గ్యారంటీ..!



ఫేస్‌బుక్.. నేటి తరుణంలో దీని గురించి తెలియని వారుండరు అంటే అతిశయోక్తి కాదేమో. ఎందుకంటే స్మార్ట్‌ఫోన్లు వాడేవారు, వాడని వారు అందరికీ ఫేస్‌బుక్ గురించి తెలుస్తున్నది. ఈ క్రమంలోనే ఎప్పుడు ఎక్కడ ఏ సందర్భంలో ఏ సమయంలోనైనా ఫోన్‌లో ఫొటో తీయడం లేదంటే ఆసక్తికరంగా అనిపించిన విషయాలను షేర్ చేయడం.. ఆ తరువాత కామెంట్లు, లైక్‌ల కోసం ఆసక్తిగా ఎదురు చూడడం.. సర్వ సాధారణమే అయిపోయింది. అయితే ఇలా పరిమితికి మించి ఫేస్‌బుక్‌ను వాడితే డిప్రెషన్ బారిన పడతారని సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు. కోపెన్‌హగన్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు కొందరు ఫేస్‌బుక్‌ను బాగా వాడే వేయి మందిపై పరిశోధన చేశారు. వారిలో ఆడ, మగ వారు ఉన్నారు. ఈ క్రమంలో సైంటిస్టులు సదరు వ్యక్తులు ఫేస్‌బుక్‌ను ఎంత సేపు వాడతారు, ఏం చేస్తారు, ఏం చూస్తారు తదితర వివరాలను వారి నుంచి సేకరించారు. అనంతరం వారికి ఉన్న అనారోగ్య సమస్యలను పరిశీలించారు. చివరకు తెలిసిందేమిటంటే.. ఫేస్‌బుక్‌లో పోస్టులను ఎక్కువగా పెడుతూ వాటికి కామెంట్లు, లైక్‌లను ఆశించే వారు డిప్రెషన్ బారిన పడే అవకాశం ఉందని తేల్చారు. అలాగే పిట్స్‌బర్గ్‌కు చెందిన పరిశో ధకులు కూడా దాదాపుగా ఇలాంటి అధ్యయనమే ఒకటి చేశారు. వారు 19 నుంచి 32 సంవత్సరాల వయస్సు లోపు ఉన్న 1787 మందిని పరిశీలించారు. వీరంతా సోషల్ మీడియా యాప్స్‌ను బాగా వాడేవారే. ఇలాంటి వారిలో 7 లేదా అంతకు మించి సోషల్ యాప్స్‌ను వాడేవారికి మానసిక సమస్యలకు చెందిన లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. కనుక సోషల్ యాప్స్‌ను వాడే వారు వీలైనంత వరకు వాటి నుంచి దూరంగా ఉండేందుకు యత్నించాలని లేదంటే మానసిక అనారోగ్యాల బారిన పడాల్సి వస్తుందని సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
6 | హైదరాబాద్ శుక్రవారం 13 । డిసెంబర్ । 2024






## సాంకేతిక లోపంతో చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం.. ఇబ్బందుల్లో యూజర్లు..!

**న్యూఢిల్లీ-నవభూమి:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) బేస్ట్ చాట్‌బోట్ చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం ఏర్పడింది. ఫలితంగా లక్షలాది మంది యూజర్లు చాట్‌జీపీటీ సేవలు లభించక పోవడంతో ఇబ్బందుల పాలవుతున్నారు. దీనిపై యూజర్లకు 'ఎక్స్ (మాజీ ట్విటర్)' వేదికగా క్షమాపణ చెప్పిన ఓపెన్ ఏఐ.. సమస్య గుర్తించామని, దాని పరిష్కారానికి ప్రయత్నిస్తున్నామని తెలిపింది. త్వరలోనే చాట్‌జీపీటీ గ్లోబల్ ఔటేజ్‌పై అప్‌డేట్ ఇస్తామని పేర్కొంది. స్థానిక కాలమానం ప్రకారం గురువారం తెల్లవారు జాము నుంచి చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం ఏర్పడింది. చాట్‌జీపీటీతోపాటు సంస్థకు చెందిన ఏపీఐ, సోరా సేవల్లో ఈ సమస్య తలెత్తిందని ఓపెన్ ఏఐ తెలిపింది. అయితే, ఎప్పటిలోగా సమస్య పరిష్కారం అవుతుందో వెల్లడించలేదు. దీనివల్ల ఓపెన్ ఏఐ చాట్‌జీపీటీపై ఆధార పడిన సంస్థల కార్యకలాపాలపై ప్రభావం పడుతుందని చెబుతున్నారు. 2022 చివర్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారంగా పని చేసే చాట్‌జీపీటీని ఓపెన్ ఏఐ అందుబాటులోకి తెచ్చింది. ఈ చాట్‌బోట్ సాయంతో యూజర్లు తమకు అవసరమైన ఖచ్చితమైన సమాచారాన్ని సెకన్లలోనే అందుకోవచ్చు. కాగా, బుధవారం రాత్రి మెసేజింగ్ యాప్ వాట్సాప్‌తోపాటు ఇన్ స్టాగ్రామ్, ఫేస్ బుక్ సేవల్లో అంతరాయం నెలకొంది. సాంకేతిక లోపం వల్ల యూజర్లు తమ యాప్స్ సేవలు ఉపయోగించుకోలేదని మెటా పేర్కొంది. సాధ్యమైనంత త్వరగా సేవలు పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తున్నామని వివరించింది.

## పీఎఫ్ సొమ్ము ఏటీఎం ద్వారా విత్‌డ్రా




**న్యూఢిల్లీ-నవభూమి:** ఉద్యోగ భవిష్యనిధి సొమ్ము ఉపసంహరణ మరింత సులభతరం కానుంది. ఉద్యోగులు తమ పీఎఫను ఏటీఎం ద్వారా విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు కార్మికశాఖ కార్యదర్శి సుమిత్రా దావ్రా తెలిపారు. 2025 జనవరి నుంచి ఈ సేవలు అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించారు. చందాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు గాను ఐటీ వ్యవస్థలను ఆధునీకీకరిస్తున్నామని, క్లెయిమ్‌ల పరిష్కారం వేగవంతంగా జరిగేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కాగా, పీఎఫ్ సొమ్మును విత్‌డ్రా చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం ఒక కార్డును జారీ చేయనుంది. ప్రస్తుతం ఈపీఎఫవోలో 7కోట్ల మందికి పైగా చందాదారులున్నారు.

## గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత కోసం పథకం!




**న్యూఢిల్లీ-నవభూమి::** గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులకు సామాజిక భద్రత, ఇతర ప్రయోజనాలు కల్పించేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. ఈ-కామర్స్, సేవల రంగంలో వారు సమర్థవంతంగా పనిచేసేందుకు, దేశ ఆర్థిక వ్యవస్థలో తమ వంతు పాత్ర పోషించేందుకు వారికి సామాజిక భద్రత అవసరమని, దాని కోసం పథకం రూపొందిస్తున్నామని కేంద్ర కార్మిక శాఖ కార్యదర్శి సుమితా దావ్రా తెలిపారు. బుధవారం ఆమె భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ ఆర్థిక విధాన వేదిక' కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ అంశం ప్రస్తావించారు. కొత్త కార్మిక చట్టం గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులకు నిర్వచనం ఇవ్వడంతో పాటు వారికి సామాజిక భద్రత కల్పించాలని నిర్దేశించిందని చెప్పారు. కాగా, గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులకు పెన్షన్, ఆరోగ్య బీమా సదుపాయం కల్పిస్తామని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ అక్టోబరులో ప్రకటించారు. దేశంలో 2020-21 నాటికి ఈ కార్మికులు 77 లక్షల మంది ఉన్నారని నీతి ఆయోగ్ అంచనా వేయగా... 2029-30 కల్లా వారి సంఖ్య 3 కోట్లు దాటుతుందని భావిస్తున్నారు.

## రిటైల్ ద్రవ్యోల్బణంలో కాసింత రిలీఫ్.. ఆహార ఉత్పత్తుల ధరల తగ్గుదల ఎఫెక్ట్..!



**న్యూఢిల్లీ-నవభూమి:** అక్టోబర్ నెలతో పోలిస్తే నవంబర్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం కాస్త రిలీఫ్ ఇచ్చింది. అక్టోబర్‌లో 6.21 శాతంగా ఉన్న చిల్లర ద్రవ్యోల్బణం.. నవంబర్ నెలలో 5.48 శాతానికి దిగి వచ్చింది. ఆహార వస్తువులు, ప్రధానంగా కూరగాయల ధరలు తగ్గడం వల్లే నవంబర్ రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గిందని కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) పేర్కొంది. అక్టోబర్ నెలలో ఉన్న 10.87 శాతంగా ఆహార ద్రవ్యోల్బణం.. నవంబర్‌లో 9.04 శాతానికి దిగి వచ్చింది. గతేడాది నవంబర్ నెలలో 8.70 శాతంగా ఆహార ద్రవ్యోల్బణం నమోదైంది. కూరగాయలు, పప్పులు- పప్పు అనుబంధ ఉత్పత్తులు, చక్కెర, ఫలాలు, కోడిగుడ్లు, పాలు-పాల ఉత్పత్తులు, మసాలా దినుసులు, కమ్యూనికేషన్స్, రవాణా, పర్సనల్ కేర్ వస్తువుల ధరలు గణనీయంగా తగ్గాయని ఎన్ఎస్ఓ తెలిపింది. గత జూలై-ఆగస్టుల్లో 3.6 శాతంగా ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం.. సెప్టెంబర్ నెలలో 5.5, అక్టోబర్ కల్లా 6.2 శాతానికి చేరుకున్నది. గతేడాది సెప్టెంబర్ ద్రవ్యోల్బణం కంటే 2024 అక్టోబర్ ద్రవ్యోల్బణం చాలా ఎక్కువ. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 4.8 నుంచి 4.5 శాతానికి తగ్గుతుందని గత వారం ఆర్బీఐ అంచనా వేసింది. అయితే డిసెంబర్ త్రైమాసికంలో ఆహార వస్తువుల ధరలు పెరగకుండా ఉండాలంటే ఆహార వస్తువులపై ధరల ఒత్తిళ్లను నియంత్రించాలని నిపుణులు సూచిస్తున్నారు.

## మరీ ఇంత పిరమా.. బంగారం ముట్టుకుంటే షాకే

**న్యూఢిల్లీ-నవభూమి:** బంగారం ధరలు మళ్లీ ఊపందుకున్నాయి. తగ్గినట్లే కనిపించిన పసిడి మళ్లీ జోరందుకొని పరుగులు పెడుతోంది. ఎవరి అంచనాలకు అందకుండా వడివడిగా దూసుకెళ్తోంది గోల్డ్. మరో ఆభరణం వెండిది కూడా దాదాపుగా ఇదే వరస. ఈ రెండూ మహిళలకు షాక్ ఇస్తున్నాయి. రెండ్రోజుల తేడాలోనే రేట్లు అమాంతం ఊపందుకున్నాయి. ధరల్లో భారీ పెరుగుదల నమోదవుతూ వస్తోంది. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల కారణంగా నగల వ్యాపారులు, స్టాకిస్టుల కొనుగోళ్ల పెరుగుదల వల్ల దేశ రాజధాని న్యూఢిల్లీలో బంగారం ధరలు రూ.80,000 మార్కును చేరుకున్నాయి.

ఆగని ధరల పరుగు

హైదరాబాద్‌లో గురువారం నాడు గోల్డ్ రేట్స్ చూసుకుంటే.. 24 క్యారెట్ల బంగారం తులం రూ.79,480 పలుకుతోంది. అదే 22 క్యారెట్ల పసిడి 10 గ్రాములు రూ.72,860గా ఉంది. గత రెండు, మూడు రోజుల నుంచి బంగారంతో పాటు వెండి ధరలు కూడా పెరుగుతూ పోతున్నాయి. వరుసగా మూడో రోజు రూ.1,450 పెరిగిన వెండి.. ఇవాళ కిలో రూ.96,300కి చేరింది. బంగారం-వెండి ధరల పెరుగుదలకు అమెరికాలో వడ్డీరేట్లు మరింత తగ్గుతాయనే అంచనాలు ఒక కారణమని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ఇంటర్నేషనల్ మార్కెట్‌లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేట్ 2,700 డాలర్లకు చేరువైంది. కాగా, పసిడి పరుగుల వెనుక అంతర్జాతీయ స్థాయిలో పలు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు, ప్రధాన కరెన్సీలతో డాలర్ మారకం రేటు పుంజుకోవడం కూడా దోహదం చేస్తున్నట్టు ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు.

## భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్ కంపెనీలను గుర్తించే డెలాయిట్ టెక్నాలజీ ఫాస్ట్ 50 ఇండియా 2024లో నెక్స్ట్‌వేవ్‌కు చోటు



NXT WAVE ™

**న్యూఢిల్లీ-నవభూమి:** అధునాతన సాంకేతికతలలో భారతదేశ యువత నైపుణ్యాన్ని పెంపొందించడంలో అగ్రగామిగా ఉన్న నెక్స్ట్‌వేవ్, ప్రతిష్టాత్మకమైన డెలాయిట్ టెక్నాలజీ ఫాస్ట్ 50 ఇండియా 2024 అవార్డులలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న టాప్ 50 టెక్నాలజీ కంపెనీలలో ఒకటిగా గుర్తింపు దక్కించుకుంది. గతంలో రాజోర్‌పే , జొమాటో క్యాషిఫై డార్విన్‌బాక్స్ మరియు జెప్టో వంటి పరిశ్రమలు దక్కించుకున్న ఈ ప్రశంసను ఇప్పుడు ఎడ్‌టెక్ పరిశ్రమలో సాంకేతికతను చక్కగా ఉపయోగిస్తూ అద్భుతమైన వృద్ధిని సాధించిన నెక్స్ట్‌వేవ్ దక్కించుకుంది. డెలాయిట్ టెక్నాలజీ ఫాస్ట్ 50, పలు సంవత్సరాలుగా, దేశంలోని టెక్ వ్యవస్థాపకులకు అత్యంత ఆకాంక్షించదగిన గౌరవనీయమైన గుర్తింపులలో ఒకటిగా మారింది. ఈ జాబితాలో అత్యంత పోటీతత్వం, కొత్త తరం, చురుకైన వ్యాపారాలు ఉండగా, ఇవి రాబడి మరియు వృద్ధిపై దృష్టి పెట్టడమే కాకుండా స్థిరత్వం, ఆర్థిక చేరిక, వైద్య సాంకేతికత, తదితర రంగాలలో సమస్యలను మరియు సామాజిక సవాళ్ల పరిష్కరిస్తున్న సంస్థలు ఉన్నాయి. డెలాయిట్ ఇండియా భాగస్వామి మరియు టీఎంటీ ఇండస్ట్రీ లీడర్ పీయూష్ వైష్ మాట్లాడుతూ, "భారత సాంకేతిక రంగం పరివర్తనాత్మక కూడలిలో ఉంది. ఆవిష్కరణ-కేంద్రీకృత విధానాలు, వృద్ధి చెందుతున్న డిజిటల్ ఇన్‌క్లూజివిటీ, ప్రపంచ గుర్తింపుతో, భారతదేశ సాంకేతిక పర్యావరణ వ్యవస్థ కొత్త కొలమానాలను నెలకొల్పుతోంది. డెలాయిట్ టెక్‌ఫాస్ట్ 50 అనేది విజేతల చురుకుదనం, స్కేలబిలిటీ మరియు ప్రభావవంతమైన ఆవిష్కరణలకు ఉదాహరణ డెలాయిట్‌లో 50 వేగవంతమైన సాంకేతికత కంపెనీలలో ఒకటిగా గుర్తించబడినందుకు భారతదేశంలో మేము వారితో కలిసి మెరుగైన భవిష్యత్తులను నిర్మించే ఈ ప్రయాణానికి మద్దతు ఇస్తున్నందుకు మేము గర్విస్తున్నాము" అని తెలిపారు. ఈ అవార్డు ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ మరియు ఇతర అధునాతన సాంకేతికతలను ఉపయోగిస్తూ విద్య రంగంలో అనూహ్య మార్పులు తీసుకువస్తున్న నెక్స్ట్‌వేవ్ సంకల్పాన్ని మరియు శ్రమని గుర్తిస్తుంది. నెక్స్ట్‌వేవ్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ రాహుల్ అత్తులూరి మాట్లాడుతూ, "డెలాయిట్ టెక్నాలజీ ఫాస్ట్ 50 ఇండియా 2024 అవార్డును అందుకోవడం మాకు గౌరవంగా ఉంది. ఈ గుర్తింపు ఒక జట్టుగా మేము సాధించిన అద్భుతమైన పురోగతికి నిదర్శనం. నెక్స్ట్‌వేవ్‌లో మేము సాంకేతికతను ఏకీకృతం చేస్తూ మా విద్యార్థులకు సాటిలేని విలువను సృష్టించడానికి నిరంతరం కృషి చేస్తున్నాం. నెక్స్ట్‌మాక్ ఏఐ ట్యూటర్‌లు మరియు మెటావర్సిటీ ఏఐ-ఆధారిత పరిష్కారాల ద్వారా విద్యార్థులకు మెరుగైన ట్రైనింగ్ అందిస్తూ మా వ్యాపార కార్యకలాపాలను ఆప్టిమైజ్ చేస్తున్నాము. ఎంతో వేగంగా మార్పులు చేస్తున్నప్పటికీ మేము సాంకేతికత పూర్తి సామర్థ్యంలో 10-20% మాత్రమే గ్రహించాము. అన్ని అవకాశాలను అందిపుచ్చుకుంటూ రాకెట్ వేగంతో మేము ముందుకు సాగుతున్నాము" అని తెలిపారు. నెక్స్ట్‌వేవ్ విజయం వినూత్న పరిష్కారాలపై నిర్మించబడింది. ఉదాహరణకు నెక్స్ట్‌మాక్ విద్యార్థులను ప్లేస్‌మెంట్‌ల కోసం సిద్ధం చేసే ఏఐ-ఆధారిత మాక్ ఇంటర్వ్యూల ప్లాట్‌ఫార్మ్‌గా వ్యవహరిస్తోంది. అలానే ఏఐ ట్యూటర్లు మరియు మెంటర్లు వ్యక్తిగతీకరించిన, ఏఐ-ఆధారిత అభ్యాసం మరియు ప్రశ్నకు పరిష్కారాన్ని అందిస్తారు. మెటావర్సిటీ లీనమయ్యే వర్చువల్ లెర్నింగ్ అనుభవాలను అందిస్తుంది. అడ్వాన్స్‌డ్ లెర్నింగ్ పోర్టల్ ఆన్‌లైన్ ఐడీఈలను, బలమైన లెర్నింగ్ ప్లాట్‌ఫార్మ్‌ను అందిస్తుంది. విద్యార్థుల కోసం చేసే ఆవిష్కరణలతో పాటుగా, నెక్స్ట్‌వేవ్ ప్రీ-సేల్స్ మరియు స్టూడెంట్ సక్సెస్‌లలో కాల్ ఆడిట్ మరియు ఇంటెలిజెన్స్‌తో కార్యాచరణ సామర్థ్యం కోసం ఏఐని ఉపయోగిస్తుంది. ఏఐ- ఆధారిత కంటెంట్ సృష్టించడం ద్వారా బ్రాండింగ్, సోషల్ మీడియాను మెరుగుపరుస్తుంది. ఇంటర్వ్యూ విశ్లేషణ మరియు ఇంటెలిజెన్స్ ప్లేస్‌మెంట్ ఫలితాలను ఆప్టిమైజ్ చేస్తుంది. ఈ గుర్తింపు ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ ట్రైనింగ్ రెండింటిలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చే సాంకేతిక కంపెనీగా మారాలనే నెక్స్ట్‌వేవ్ దృష్టిని చాటి చెబుతోంది.

## సమానత్వ మనస్తత్వాన్ని పెంపొందించేందుకు క్లీన్ ఈక్వల్ మిషన్‌ను పరిచయం చేసిన ఐటీసీ నిమైల్








**న్యూఢిల్లీ-నవభూమి:** భారత దేశంలో విశ్వసనీయ గృహ పరిశుభ్రత బ్రాండ్, వేపతో తయారైన ఐటీసీ నిమైల్ తన క్లీన్ ఈక్వల్ మిషన్ ద్వారా మరింత బాధ్యతాయుతమైన భవిష్యత్తు వైపు ఒక స్పృహతో ముందడుగు వేసింది. పలు నివాసాలలో ఇంటి పనులను, ముఖ్యంగా శుభ్రపరిచే ప్రాథమిక బాధ్యతను మహిళలు తీసుకుంటారు. ఆ పని వారే చేయాలని ఎక్కువ మంది భావిస్తూ ఉంటారు. తదుపరి తరంలో అవగాహన పెంచడం, దీన్ని ప్రేరేపించడం ద్వారా శుభ్రపరచడంలో సమానత్వాన్ని పెంపొందించేందుకు అనువుగా ఈ కార్యక్రమాన్ని సంస్థ రూపొందించింది. క్లీన్ ఈక్వల్ మిషన్ అనేది భాగస్వామ్య బాధ్యతగా శుభ్రపరచడాన్ని ప్రోత్సహించేందుకు, పిల్లల కోసం వినూత్నమైన విద్యా మాడ్యూల్‌ను కలిగి ఉంది. సమాజంలో మార్పు తీసుకువచ్చే ప్రయత్నంలో భాగంగా, ఇది నేటి తరం బాలలకు శుభ్రంగా ఉండడం, పరిశుభ్రతకు సంబంధించిన ప్రాథమిక అంశాలతో పాటు స్వాతంత్ర్యం, సమానత్వపు లోతైన భావనతో ఎదిగేందుకు వీలు కల్పిస్తుంది. పిల్లలు సాధారణంగా ఇంటిలో చేసే మొదటి పని శుభ్రపరచడం. చిన్న వయస్సు నుంచే పనులు చేయడం భవిష్యత్తులో మరింత సంతృప్తికరమైన, విజయవంతమైన జీవితానికి పునాది వేస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ పనులు చేయడం ద్వారా వారు ఆత్మవిశ్వాసాన్ని, జట్టుగా పని చేసే నైపుణ్యాలను పెంపొందించుకుంటూ విలువలతో కూడిన దృఢమైన భావాన్ని అభివృద్ధి చేసుకోవడంలో సహాయపడుతుంది. మరీ ముఖ్యంగా, ఇది వారి భవిష్యత్తుకు కీలకమైన స్వాతంత్ర్యాన్ని అందిస్తుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో మహిళల డబుల్స్ (టెన్నిస్)లో మాజీ ప్రపంచ నంబర్ 1, సానియా మీర్జా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సానియా మీర్జాతో పాటు ఐటిసి లిమిటెడ్ మార్కెటింగ్, పర్సనల్ కేర్ ప్రొడక్ట్స్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ శ్రీనివాస్, గీతాంజలి దేవ్‌శాల ప్రిన్స్‌పల్, గీతాంజలి గ్రూపు విద్యా సంస్థల డైరెక్టర్ మాధవి చంద్ర మరియు గ్లెన్ డొమన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన నిష్ణాతులైన విద్యావేత్త, పేరెంటింగ్ మెంటార్ కిరణ్మయి చౌదరితో కలిసి క్రియాశీలకమైన చర్చాగోష్ఠిని నిర్వహించారు. ది ఇన్‌స్టిట్యూట్స్ ఫర్ అచీవ్‌మెంట్ ఆఫ్ హ్యూమన్ పొటెన్షియల్, ఫిలడెల్ఫియా, యూఎస్ఏకు చెందిన కిరణ్మయి చౌదరి క్లీన్ ఈక్వల్‌పై ఇంటరాక్టివ్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న తల్లిదండ్రులను మరింత మార్గదర్శనం చేశారు. ఆకర్షణీయమైన, వయస్సుకు తగిన విద్యా కంటెంట్‌తో, ఈ కార్యక్రమం సానుకూలమైన, ఆహ్లాదకరమైన మరియు సాపేక్ష మార్గంలో బాధ్యతను స్వీకరించేలా పిల్లలను ప్రేరేపిస్తుంది. ఈ చొరవ పాఠశాలలు, తల్లిదండ్రులతో ఒక సహకార కార్యక్రమం కాగా, ఇది క్లీన్ ఈక్వల్ ఆలోచనను విశ్లేషించుకోవడంలో పిల్లలకు సహాయపడేందుకు, వారిని సమానత్వానికి విలువనిచ్చే బాధ్యతగల వ్యక్తులుగా ఎదిగేందుకు వీలు కల్పిస్తుంది. ఈ చొరవను సానియా మీర్జా ప్రశంసిస్తూ, "ఐటిసి నిమైల్ క్లీన్ ఈక్వల్ మిషన్‌లో భాగంగా ఉండడాన్ని నేను గౌరవంగా భావిస్తున్నాను. ఈ ప్రయత్నం నా విలువలు, బాధ్యతాయుతమైన తల్లిదండ్రుల అవసరాన్ని లోతుగా ప్రతిధ్వనిస్తుంది. ఇది కేవలం శుభ్రపరచడం కన్నా ఎక్కువబీ ఇది భాగస్వామ్య బాధ్యత భావాన్ని పెంపొందించడం, ఆకట్టుకునే విధంగా చిన్న వయస్సు నుంచే సమానత్వం మనస్తత్వాన్ని పెంపొందించడానికి సంబంధించిన అంశం.

## జియో న్యూఇయర్ వెల్‌కం ప్లాన్.. దీర్ఘకాలిక యూజర్లకు వెరీ అట్రాక్టివ్..!




**న్యూఢిల్లీ-నవభూమి:** గత జూలైలో భారీగా టారిఫ్ చార్జీలు పెంచిన దేశీయ టెలికం సంస్థలు రిలయన్స్, భారతీ ఎయిర్ టెల్.. తాజాగా కస్టమర్లను ఆకట్టుకునేం దుకు ప్రయత్నిస్తున్నాయి. అందులో భాగంగా న్యూఇయర్ వెల్‌కం ప్లాన్ తెచ్చింది రిలయన్స్ జియో. కేవలం జియో యూజర్ల కోసం ఎక్స్‌క్లూజివ్ బెనిఫిట్లు కల్పిస్తూ తీసుకొచ్చింది. పార్టనర్ డిస్కౌంట్స్ తోపాటు ఖర్చు తక్కువతో కనెక్టివిటీ అవకాశం కల్పిస్తోంది. 2025 ప్రారంభం నేపథ్యంలో రూ.2,025 రీచార్జి ప్లాన్ తెచ్చింది. దీర్ఘకాలిక యూజర్లకు ఆకర్షణీయ ప్లాన్ ఇది. నెలవారీగా రూ.349 రీచార్జీ ప్లాన్ కు సమానం కాగా, రూ.468 పొదుపు చేయొచ్చు. ఈ నెల 11 నుంచి జనవరి 11 వరకూ ఈ 'న్యూ ఇయర్ ప్లాన్ వెల్‌కం ప్లాన్' లభ్యం అవుతుంది. రూ.2,025 ప్లాన్ కింద నిరంతరాయంగా అన్ లిమిటెడ్ 5జీ సేవల కనెక్టివిటీ ఉంటుంది. ప్రతి రోజూ 2.5 జీబీ డేటా చొప్పున 500 జీబీ (4జీ) డేటా, 200 రోజుల వరకూ అన్ లిమిటెడ్ వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్ పంపుకోవచ్చు. షాపింగ్, డైనింగ్, ప్రయాణ సమయంలో రూ.2150 విలువ గల పార్టనర్ కూపన్లు లభిస్తాయి. రూ.2500 విలువ గల షాపింగ్ లావాదేవీ నిర్వహిస్తే రూ.500 విలువైన జియో కూపన్, రూ.499 అంతకంటే ఎక్కువ విలువ గల స్విగ్గీ ఆర్డర్ మీద రూ.150 తగ్గింపు, ఈజీ మై ట్రిప్ డాట్ కామ్ ద్వారా విమాన టికెట్ ధర బుక్ చేసుకుంటే రూ.1500 రాయితీ లభిస్తుంది.

## ఇకపై పీఎఫ్ డబ్బుల కోసం నో వెయిటింగ్.. ఈజీగా విత్ డ్రా..

**న్యూఢిల్లీ-నవభూమి:** ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ దేశంలోని 7 కోట్ల మంది ఖాతాదారులకు గుడ్ న్యూస్ తెలిపింది. అది ఏంటంటే వచ్చే ఏడాది జనవరి నుంచి పీఎఫ్ ఖాతాదారులకు ప్రత్యేక సదుపాయం లభిస్తుంది. దీని కింద వినియోగదారులు తమ ఖాతాలో జమ చేసిన మొత్తాన్ని "ATM" ద్వారా విత్‌డ్రా చేసుకోవచ్చు. అయితే ఈ ఉపసంహరణ మాత్రం ప్రత్యేక కార్డ్ ద్వారా మాత్రమే చేయబడుతుంది. ఇది డెబిట్ కార్డ్ మాదిరిగా ఉంటుందని చెబుతున్నారు. నివేదిక ప్రకారం కార్మిక మంత్రిత్వ శాఖ దీనిపై కసరత్తు చేస్తోంది.

**నిరీక్షణకు తెర**

ప్రకారం వచ్చే ఏడాది 2025 ప్రారంభంలో సబ్‌స్క్రైబర్‌లు తమ ప్రావిడెంట్ ఫండ్ ఖాతా నుంచి నేరుగా ATMల ద్వారా డబ్బును విత్‌డ్రా చేసుకోవచ్చు. ఎందుకంటే ఉపసంహరణలను సులభతరం చేయడానికి డెబిట్ కార్డ్ లాంటి కార్డ్‌లను జారీ చేయడంపై కార్మిక మంత్రిత్వ శాఖ కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఈపీఎఫ్‌వో సభ్యులు విత్‌డ్రా చేసిన మొత్తాన్ని ఖాతాకు లింక్ చేసిన బ్యాంకు ఖాతాలో జమ చేసేందుకు 7 నుంచి 10 రోజుల వరకు వేచి ఉండాల్సి వస్తుంది. అంటే కొత్త సదుపాయం వచ్చిన తర్వాత ఇకపై నిరీక్షణ ఉండదని చెప్పవచ్చు.

**ఉపసంహరణ నియమాలు**

మీరు ఇప్పటి వరకు EPFO నుంచి డబ్బు ఉపసంహరణ నిబంధనలను పరిశీలిస్తే మీరు ఉద్యోగంలో ఉన్నప్పుడు నిధులను పాక్షికంగా లేదా పూర్తిగా విత్‌డ్రా చేసుకునేందుకు అనుమతించబడరు. మీరు కనీసం ఒక నెలపాటు నిరుద్యోగిగా ఉంటే, మీరు మీ బ్యాలెన్స్‌లో 75% వరకు విత్‌డ్రా చేసుకోవచ్చు. రెండు నెలల నిరుద్యోగం తర్వాత, మీరు పూర్తి మొత్తాన్ని విత్‌డ్రా చేసుకోవచ్చు. కానీ కొత్త సేవల ప్రకారం మీ బ్యాంక్ ఖాతా నుంచి నేరుగా లింక్ చేయబడిన "ATM" నుంచి డబ్బును తీసుకునే అవకాశం ఉంటుంది.

అందుబాటులోకి..జనవరి 2025 నుంచి ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ కస్టమర్‌లు తమ ప్రావిడెంట్ ఫండ్ పొదుపులను నేరుగా నుంచి ఉపసంహరించుకోవచ్చని భావిస్తున్నారు. ఉపసంహరణలను క్రమబద్ధీకరించడానికి కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ తన వ్యవస్థను అప్‌గ్రేడ్ చేస్తోందని కార్మిక కార్యదర్శి సుమితా దావ్రా ఇటీవల తెలిపారు. 2.1 అప్‌గ్రేడ్ వచ్చే ఏడాది అమలులోకి వచ్చిన తర్వాత మౌలిక సదుపాయాలు బ్యాంకింగ్ వ్యవస్థతో సమానంగా ఉంటాయని అన్నారు. ఇది హక్కుదారులు, లబ్ధిదారులు, బీమా చేయబడిన వ్యక్తులు వారి PF నిధులను కనీస మానవ జోక్యంతో యాక్సెస్ చేయడానికి కూడా వీలు ఉంటుందన్నారు.

ఎలా పని చేస్తుంది?..EPFOలోని ఈ కొత్త వ్యవస్థలో బ్యాంక్ కార్డ్ వంటి ప్రత్యేక ఉపసంహరణ కార్డ్ ఉంటుంది. ఐటీ సంస్కరణల్లో భాగంగా పీఎఫ్ ఉపసంహరణకు సంబంధించిన అనవసర ప్రక్రియలను తొలగించడం ద్వారా ఈ క్లెయిమ్ ప్రక్రియలను వేగవంతం చేయనున్నారు. అయితే ద్వారా ఉపసంహరణ మొత్తం, మొత్తం డిపాజిట్‌లో 50 శాతానికి పరిమితం చేయబడుతుందని అధికారులు భావిస్తున్నారు.

## పతనమైన ఎఫ్ఎంసీజీ.. ఐటీ షైనింగ్.. అయినా నష్టాల్లోనే ఇండెక్స్ సూచీలు..!



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాలతో ముగిశాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ ట్రేడింగ్ ముగిసే సమయానికి 236.18 పాయింట్లు (0.29 శాతం) నష్టంతో 81,289.96 పాయింట్ల వద్ద స్థిర పడింది. అంతర్గత ట్రేడింగ్‌లో 81,211.64 పాయింట్ల అత్యంత కనిష్ట స్థాయి నుంచి 81,680.97 పాయింట్ల గరిష్టం మధ్య తచ్చాడింది. బీఎస్ఈ-30లో 18 స్టాక్స్ పతనాలతోనే ముగిశాయి. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 93.10 పాయింట్లు (0.38 శాతం) నష్టంతో 24,548.70 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 24,675.25 పాయింట్ల నుంచి 24,527.95 పాయింట్ల మధ్య తచ్చాడింది. బ్రాడర్ మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ -100 0.46 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్-100 0.9 శాతం నష్టపోయాయి.

ఎన్ఎస్ఈ-50లో 35 స్టాక్స్ నష్టాలతో ముగిశాయి. ఎన్టీపీసీ, హిందూస్థాన్ యూనీ లివర్, కోల్ ఇండియా, హీరో మోటో కార్ప్, బీపీసీఎల్ తదితర స్టాక్స్ 2.63 శాతం వరకూ నష్టపోయాయి. మరోవైపు అదానీ ఎంటర్ ప్రైజెస్, భారతీ ఎయిర్ టెల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టెక్ మహీంద్రా, అదానీ పోర్ట్స్ స్టాక్స్ 1.90 శాతం వరకూ లాభ పడ్డాయి. నిఫ్టీ ఐటీ, నిఫ్టీ మెటల్ ఇండెక్సులు 0.77 శాతం వరకూ లాభాలతో ముగిశాయి. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ 1.09 శాతం నష్టపోగా, వాటిలో హిందూస్థాన్ యూనీ లివర్, గోద్రేజ్ ప్రాపర్టీస్, కోల్గేట్ పాల్మోలివ్ స్టాక్స్ పతనం అయ్యాయి. ఫారెక్స్ మార్కెట్లో అమెరికా డాలర్ పై రూపాయి మారకం విలువ 84.87 పాయింట్ల వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 73.68 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్నది. మరోవైపు, ఔన్స్ బంగారం 2747 డాలర్ల వద్ద కొనసాగుతున్నది. అంతకు ముందు మధ్యాహ్నం మూడు గంటల సమయానికి బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 297.52 పాయింట్లు (0.36శాతం) నష్టపోయి 81,228.62 పాయింట్ల వద్ద స్థిర పడింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 110.70 పాయింట్లు (0.45 శాతం) పాయింట్ల పతనంతో 24,531.10 పాయింట్ల వద్ద ముగిసింది. బీఎస్ఈ-30లో సగానికి పైగా స్టాక్స్ నష్టాలతో ముగిశాయి. ఎన్టీపీసీ 2.61 శాతం, హిందూస్థాన్ యూనీ లివర్, లార్సెన్ అండ్ టర్బో, టాటా మోటార్స్, మారుతి సుజుకి ఇండియా తదితర స్టాక్స్ నష్టాలతో ముగిశాయి. మరోవైపు అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ 2.21 శాతం, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్ స్టాక్స్ లాభ పడ్డాయి. ఇక ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ-50లో సుమారు 34 స్టాక్స్ నష్టాల్లోనే సాగాయి. ఎన్టీపీసీ, హిందూస్థాన్ యూనీ లివర్ 2.41 శాతం చొప్పున, హీరో మోటో కార్ప్, టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్, లార్సెన్ అండ్ టర్బో స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి.

ఐటీ, మెటల్ ఇండెక్సులు మినహా అన్ని స్టాక్స్ నష్టాలతోనే సరిపెట్టుకున్నాయి. ఐటీ ఇండెక్స్ 1.05 శాతం, మెటల్ ఇండెక్స్ 0.36 శాతం లాభ పడ్డాయి. మీడియా ఇండెక్స్ గరిష్టంగా 1.84 శాతం, ఎఫ్ఎంసీజీ 0.95, ఆటో 0.80, పీఎస్‌యూ బ్యాంకు 0.69 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 0.62 శాతం నష్టాలతో ముగిశాయి. గురువారం సాయంత్రం వెలువడే నవంబర్ రిటైల్ ద్రవ్యోల్బణంపైనే ఇన్వెస్టర్ల దృష్టి కేంద్రీకరించారు. గురువారం ఉదయం నుంచి స్టాక్ మార్కెట్ల ఇండెక్సులు ఫ్లాట్‌గా ట్రేడింగ్ అయ్యాయి. తర్వాత అంతర్జాతీయంగా వచ్చిన మిశ్రమ సంకేతాలకు అనుగుణంగా లాభాల్లోకి మళ్లాయి.



## సోషల్ మీడియా వేధింపులపై రాష్ట్రాలు చర్యలు తీసుకోవచ్చు.. కేంద్రం క్లారిటీ..



**న్యూఢిల్లీ-నవభూమి:** సామాజిక మాధ్యమాల్లో మహిళలను వేధించే, అప్రతిష్ట పాలు చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చని కేంద్రం స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేస్తూ ఇతరులను దూషించటం సహా సైబర్ నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చని కేంద్రం పార్లమెంట్‌లో వెల్లడించింది. ఈ క్రమంలో భారతీయ న్యాయ సంహిత 2023 చట్టం సెక్షన్ 78 ప్రకారం మహిళలను వేధించే వారిపై అప్రతిష్టపాలు చేసే వారిపై కూడా చర్యలు తీసుకోవచ్చు. ఇలాంటి కేసుల విషయంలో సంబంధిత చట్టంలోని సెక్షన్ ప్రకారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చర్యలకు ఉపక్రమించవచ్చు.
వ్యక్తిగత స్వేచ్ఛ కాపాడేందుకుమహిళలు, పిల్లలపై సైబర్ నేరాలు అరికట్టేందుకు కేంద్ర హెూంశాఖ కూడా ప్రస్తుతం సైబర్ క్రైమ్ ప్రివెన్షన్ ఎగైనెస్ట్ ఉమెన్ అండ్ చైల్డ్ చిల్డ్రన్ పథకాన్ని అమలు చేస్తోంది. దీని ప్రకారం వ్యక్తుల డేటా, వ్యక్తిగత స్వేచ్ఛ, హక్కులను కాపాడేందుకు డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్టివ్ 2023 కూడా అమలులో ఉంది. టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా పార్లమెంట్లో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఈ వివరాలను వెల్లడించింది.



## భారతీయులకు థాయ్‌లాండ్ ఈ-వీసా



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇండియన్ పాస్‌పోర్ట్ హెూల్డర్స్‌కు థాయ్‌లాండ్ ఈ-వీసా వచ్చే నెల 1 నుంచి అందుబాటులోకి వస్తుంది. ఇండియన్ ట్రావెలర్స్‌కు ప్రస్తుతం ఇస్తున్న 60 రోజుల వీసా మినహాయింపు నిబంధనలు కొనసాగుతాయి. న్యూఢిల్లీలోని ది రాయల్ థాయ్ ఎంబసీ బుధవారం ఓ ప్రకటనలో ఈ వివరాలను తెలిపింది. అన్ని రకాల వీసాలను https://www.thaievisa.go.th వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసి, పొందవచ్చునని పేర్కొంది. వీసా రుసుమును తిరిగి దరఖాస్తుదారుకు ఇవ్వరు. వీసా రుసుమును స్వీకరించినట్లు రసీదును ఇచ్చిన తేదీ నుంచి సుమారు 14 రోజుల్లోగా ప్రాసెసింగ్ పూర్తవుతుంది.

## ఆ కొండపైకి భక్తులకు అనుమతి లేదు..



**చెన్నై-నవభూమి:** కార్తీకదీపోత్సవం రోజున తిరువణ్ణామలై కొండపైకి భక్తులకు అనుమతి లేదని దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్ బాబు తెలిపారు. అయితే, కొండ పైకి 11,600 మంది భక్తులను అనుమతించనున్నారంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. మహాజ్యోతి దీపారాధన కోసం కేవలం ఆలయ సిబ్బంది, పోలీసులు, ఆలయ అధికారులను మాత్రమే అనుమతిస్తామని, జ్యోతిని వెలిగించేందుకు వెళ్ళే వారి వివరాలను అధికారులు తీసుకున్నారని తెలిపారు. తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి వేడుకల్లో భాగంగా, మంగళవారం మహారథోత్సవం జరిగింది.
శుక్రవారం మహాదీపారాధన జరుగనుంది. సాధారణంగా ఈ జ్యోతి ప్రజ్వలన సమయంలో ఆలయ అధికారులతో పాటు పరిమిత సంఖ్యలో భక్తులను కొండపైకి అనుమతిస్తుంటారు. కానీ, ఇటీవల ఫెంగల్ తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాల కారణంగా తిరువణ్ణామలై కొండ చరియలు విరిగిపడి ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో నిపుణుల బృందం కొండపైకి వెళ్ళి, జ్యోతి ప్రజ్వలన చేసే ప్రాంతాన్ని తనిఖీ చేసి నివేదికను సమర్పించింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండ బాగా తడిసివుందని, అందువల్ల కొండపైకి భక్తులను అనుమతించవద్దని సూచన చేసింది.
ఈ కారణంగా కార్తీకపౌర్ణమి మహాదీపం రోజున భక్తులను కొండపైకి అనుమతించరాదని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే విషయంపై రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి శేఖర్‌బాబు మాట్లాడుతూ, కార్తీక దీపోత్సవాలను పురస్కరించుకుని, తిరువణ్ణామలై కొండ శిఖరాగ్రంలో మహాజ్యోతి ప్రజ్వనలో ఎలాంటి ఆటంకాలు ఉండవన్నారు. భూగర్భ, గనుల శాఖ డైరెక్టర్ శరవణవేల్ రాజ్ ఆదేశం మేరకు ప్రొఫెసర్ ప్రేమలత సారథ్యంలో ఎనిమిది నిపుణులతో కూడిన బృందం మూడు రోజుల పాటు కొండను అధ్యయనం చేసిందన్నారు. ఆ నిపుణుల నివేదిక మేరకు 350 కిలోల బరువుతో కూడిన కొప్పెర, జ్యోతి ప్రజ్వలన కోసం ఉపయోగించే గాడ గుడ్డ, 40 టిన్నుల్లో 600 కిలోల నెయ్యి ఆలయ సిబ్బంది, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది తీసుకెళ్తారని తెలిపారు. భరణి దీపం రోజున ఆలయంలోకి 500 మంది భక్తుల సహా అధికారులు, ఆలయ సిబ్బంది కలిపి 11600 మందికి అనుమతిస్తామని తెలిపారు. ఈ కార్తీక దీపోత్సవాలను విజయవంతం చేసేందుకు వీలుగా అన్ని రకాలైన చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

## 24 గంటల పాటు తపస్సు! కాళీ మాత ప్రత్యక్షం కాలేదని ఆత్మహత్య



**న్యూఢిల్లీ-నవభూమి:** కాళీ మాత ప్రత్యక్ష్యం కావాలంటూ 24 గంటల పాటు తపస్సు చేసిన ఓ వ్యక్తి జగన్మాత అనుగ్రహం కలగలేదని ఆత్మహత్య చేసుకున్న ఘటన వారణాసిలో తాజాగా వెలుగు చూసింది. గాయ్‌ఘాట్ పతంగలి ప్రాంతంలో ఉన్న అమిత్ శర్మ తన గొంతుకోసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిసింది. రక్తమోడుతున్న అమిత్‌ను వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు స్థానిక పోలీసులు తెలిపారు .జాతీయ మీడియా కథనాల ప్రకారం, అమిత్‌కు కాళీ మాత అంటే అపరిమితమైన భక్తి. ఈ నేపథ్యంలో శనివారం అతడు తన గదిలో కాళీ మాత కోసం తపస్సు ప్రారంభించాడు. కాళీ మాత తన ముందు ప్రత్యక్షం అవుతుందని అతడు చెప్పాడట. తల్లీ.. ప్రత్యక్షం అవ్వు.. అంటూ ధ్యానం సందర్భంగా అతడు ఉచ్చరించాడట. అయితే, ఎన్ని గంటలు గడిచినా జగన్మాత ప్రత్యక్షం కాకపోవడంతో నిరాశకు గురైన అతడు చివరకు కత్తితో తన గొంతు కోసుకున్నాడని అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఇషాన్ సోనీ పేర్కొన్నారు. అమిత్ గత ఏడేళ్లుగా తన ఇంట్లోనే ఉంటున్నట్టు ఆ ఇంటి యజమాని తెలిపాడు. తరచూ తీర్థయాత్రలకు వెళ్లేవాడని, కాశీ విశ్వేశ్వర ఆలయాన్ని సందర్శించే వాడని పేర్కొన్నారు. ఇక అమిత్ మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం పంపించామని, ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

## బొగ్గు కుంభకోణం కేసులో ఢిల్లీ కోర్టు కీలక తీర్పు

**న్యూఢిల్లీ-నవభూమి:** యూపీఏ ప్రభుత్వ హయాంలో 2012 నాటి బొగ్గు స్కామ్ కేసు లో ఢిల్లీ రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టు బుధవారంనాడు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఐదుగురిని నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పు ఇచ్చింది. బొగ్గు బ్లాకుల కేటాయింపులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు జరిపింది. సీబీఐ ఫిర్యాదు, ఛార్జిషీట్లపై ప్రత్యేక కోర్టు సుదీర్ఘ విచారణ జరిపిన అనంతరం ప్రత్యేక కోర్టు తాజా తీర్పు వెలువరించింది.

# భారత్ అమ్ములపొదిలో వోరోనెజ్ రక్షణ కవచం



**న్యూఢిల్లీ-నవభూమి:** గగనతల రక్షణలో భారత్ అమ్ములపొదిలో సరికొత్త కవచం చేరనుంది. రష్యాకు చెందిన అల్మాజ్-యాంటీ సంస్థ అభివృద్ధి చేసిన 'వోరోనెజ్ రాడార్' వ్యవస్థ అందుబాటులోకి వస్తే.. శత్రువులు ప్రయోగించే బాలిస్టిక్ క్షిపణులను 8 వేల కిలోమీటర్ల దూరం నుంచే గుర్తించే సామర్థ్యం మన సొంతం అవుతుంది. అంతేకాదు.. శత్రువుల నిఘా విమానాలు(స్టెల్తర్ ఫైటర్), యుద్ధ విమానాలు, అంతరిక్ష వస్తువులను సైతం వోరోనెజ్ రాడార్ వ్యవస్థ గుర్తించగలదు. ఆ వెంటనే అప్రమత్తమై.. శత్రు క్షిపణులు, నిఘా/యుద్ధ విమానాలను గాల్లోనే అడ్డుకుంటుంది.

**కర్ణాటకలో ఏర్పాటు**

వోరోనెజ్ వ్యవస్థను కర్ణాటకలోని చిత్రదుర్గ వద్ద ఏర్పాటు చేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు రూ.34 వేల కోట్లతో అల్మాజ్-యాంటీతో ఒప్పందం కుదుర్చుకోనుంది. ఇప్పటికే అల్మాజ్-యాంటీ డిప్యూటీ చైర్మన్ వ్లాదిమిర్ మెడోవ్నికోవ్ నేతృత్వంలోని బృందం గత నెల ఢిల్లీ, బెంగళూరు నగరాల్లో పర్యటించింది. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు చిత్రదుర్గ సరైన ప్రదేశమని వెల్లడించింది. దీంతో.. డీల్ ఒప్పందాల కోసం డీఆర్‌డీవో అనుబంధ సంస్థ ఎలక్ట్రానిక్స్ అండ్ రాడార్ డెవల్‌పమెంట్ ఎస్టాబ్లిషమెంట్(ఈఆర్‌డీవో) చర్యలు ప్రారంభించింది. ఈ విషయంలో భారత్-రష్యా మధ్య చర్చలు తుది దశలో ఉన్నాయని 'సండే గార్డియన్' ఓ కథనాన్ని ప్రచురించింది. ప్రస్తుతం రష్యా రాడార్, క్షిపణి రక్షణ, గగనతల రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేసే అతిపెద్ద కంపెనీల్లో అల్మాజ్-యాంటీ ఒకటి కావడం గమనార్హం..!

**ఎలా పనిచేస్తుంది..?**

వోరోనెజ్ వ్యవస్థ 8 వేల కిలోమీటర్ల దూరంలోనే శత్రువుల బాలిస్టిక్ క్షిపణులను గుర్తించగలదు. ఈ వ్యవస్థలోని ఒక రాడార్ శత్రు క్షిపణిని గుర్తించి, యాక్టివేట్ అయితే.. మరో రీజియన్‌లోని రాడార్ గనక అదే క్షిపణిని గుర్తిస్తే.. మొదటి రాడార్‌కు అదనపు సమాచారాన్ని అందజేస్తుంది. యుద్ధ విమానాలు, స్టెల్తర్ ఫైటర్లు, అంతరిక్ష వస్తువులను కూడా ఈ రాడార్లు గుర్తించి, వెంటనే సమాచారాన్ని అందజేస్తాయి.
ఈ రాడార్లలోని అరే టెక్నాలజీ.. శత్రువుల టార్గెట్లను వేగంగా పసిగడతాయి.
డ్నెపర్, డారిల్ వంటి పాత తరం రాడార్ వ్యవస్థలకంటే వోరెనెజ్ వ్యవస్థ సమర్థంగా పనిచేస్తుంది. రష్యా వద్ద ఉన్న వోరోనెజ్ రాడార్ వ్యవస్థ ఆ దేశం మొత్తానికి రక్షణగా నిలుస్తోంది.
ఒప్పందం కుదిరితే.. భారత్‌కు వోరోనెజ్-ఎం రకం రాడార్లు వచ్చే అవకాశాలున్నాయి. ఈ రకం రాడార్లు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే శత్రువుల క్షిపణులను గుర్తిస్తాయి. మధ్యశ్రేణి, దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణుల నుంచి రక్షణ కల్పిస్తాయి. దీంతోపాటు.. వోరోనెజ్-ఎం(వీహెచ్ఎఫ బ్యాండ్) కూడా ఇవే పనులను చేస్తుంది. వోరోనెజ్-డీఎం(యూఏహెచ్ఎఫ బ్యాండ్) చిన్న లక్ష్యాలను సైతం మెరుగైన రిజల్యూషన్‌తో.. అత్యంత కచ్చితంగా ట్రాక్ చేస్తాయి.

**చైనా-పాక్‌ల నుంచి రక్షణ**

చైనా, పాకిస్థాన్ ప్రయోగించే క్షిపణుల నుంచి ఈ వ్యవస్థ ముందస్తు హెచ్చరికలను అందించగలదు. ఇది అయానోస్పియర్ నుంచి.. తిరిగి భూమికి వచ్చే అధిక ఫ్రీక్వెన్సీ సంకేతాలను ప్రసారం చేస్తుంది. అవి దీర్ఘశ్రేణి క్షిపణులు, యుద్ధ విమానాలు, నౌకలను గుర్తించగలవు. రష్యా కూడా.. ఆసియా, ఐరోపా, ఉత్తర అమెరికా నుంచి ఎదురయ్యే ప్రమాదాలను పర్యవేక్షించడానికి వ్యూహాత్మకంగా వోరోనెజ్-ఎం రాడార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంది. భారత వైమానిక దళానికి కూడా ఇలాంటి రాడార్ వ్యవస్థ అవసరం. సరిహద్దుల్లో చైనా పెద్ద సంఖ్యలో స్టెల్త్ ఫైటర్లు, డ్రోన్లను మోహరించింది. చైనా నుంచి పాకిస్థాన్ జే-35 స్టెల్త్ ఫైటర్లను కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే రష్యాతో ఒప్పందాలు కుదుర్చుకోకూడదని అమెరికా చెబుతున్నా.. భారత్ వోరోనెజ్ వ్యవస్థపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

**మేకిన్ ఇండియాకు ఊతం!**

కేంద్ర ప్రభుత్వం రక్షణకు సంబంధించి పూర్తిస్థాయి విదేశీ సాంకేతికతపై మొగ్గుచూపుతోంది. ఒకవేళ విదేశీ కంపెనీల నుంచి కొనుగోళ్లు జరిపినా.. సాంకేతిక బదిలీ అంశంపై దృష్టిసారిస్తోంది. ఈ క్రమంలో 50 దాకా భారత భాగస్వాములు, స్టార్టప్ లు వోరోనెజ్ వ్యవస్థలో 60% ఉద్పాదకతను చేపడతాయని తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్




**ఛత్తీస్‌గడ్-నవభూమి:** ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో మరోసారి కాల్పుల మోత మోగింది. దంతెవాడ జిల్లాలో గురువారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతాబలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలంలో భారీగా ఆయుధాలను భద్రతా బలగాలను స్వాధీనం చేసుకున్నారు. దంతెవాడ, నారాయణపూర్ జిల్లాల సరిహద్దు అటవీప్రాంతంలో ఈరోజు ఆపరేషన్ జరిగింది. అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో ఈ ఎదురుకాల్పులు జరిగాయి. బస్తర్ పరిధిలో 4 జిల్లాల భద్రతా బలగాలు కూంబింగ్‌కు వెళ్లగా.. వారికి మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో ఈరోజు తెల్లవారుజాము 3 గంటల నుంచి ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. కూంబింగ్‌లో డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, సీఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొన్నాయి. హైదరాబాద్?లో మరోసారి ఠాణాల ప్రక్షాళన.. కాగా.. దేశం నుంచి మావోయిస్టులను ఏరివేయాలని కేంద్రహెూంమంత్రి అమిత్‌షా చాలా పట్టుదలతో ఉన్నారు. 2026, మార్చి 31 నాటికి ఆపరేషన్ ఖగార్‌లో భాగంగా ఈ దేశంలో మావోయిస్టు పార్టీ ఉండకూడదన్న అమిత్ షా డెడ్‌లైన్‌తో భద్రతాబలగాలు పెద్దఎత్తున వరుస ఎన్‌కౌంటర్‌లు చేస్తున్నారు. వరుస ఎన్‌కౌంటర్‌లో ఛత్తీస్‌గడ్ దండకారణ్యం యుద్ధ భూమిగా మారింది. ముఖ్యంగా దేశవ్యాప్తంగా గతంలో 18 రాష్ట్రాల్లో ప్రభావం ఉన్న మావోయిస్టులు ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంకే పరిమితమయ్యారు. మావోయిస్టులకు కంచుకోటగా ఉన్న అబూజ్‌మట్ అటవీ ప్రాంతం టార్గెట్‌గా భద్రతా బలగాలు అడుగులు వేస్తున్నాయి. సుమారు లక్షల మంది పారామిలటరీ బలగాలు వరుస ఎన్‌కౌంటర్‌లకు దిగుతున్నారు. దీంతో తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో హైఅలర్ట్ వాతావరణం నెలకొంది. ఛత్తీస్‌గఢ్‌లో తీవ్ర అణచివేత ధోరణి ఉండటంతో మావోయిస్టులు తెలంగాణలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయన్న నిఘా వర్గాల సమాచారంతో తెలంగాణ సరిహద్దుల్లో ఆ రాష్ట్ర పోలీసులు అప్రమత్తమయ్యారు. అయితే వరుస ఎన్‌కౌంటర్‌లు మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బగా చెప్పుకొచ్చారు. కరోనా సమయంలో అగ్రనేతలు నేలరాలగా, తాజాగా జరుగుతున్న వరుస ఎన్‌కౌంటర్లలో అనేక మంది మావోయిస్టు ముఖ్యనాయకులు ప్రాణాలు కోల్పోయారు. బీజాపూర్, సుకుమార్, నారాయణపూర్, దంతెవాడ జిల్లాల పరిధిలో పెద్దఎత్తున భద్రతా బలగాలు మోహరించి మావోయిస్టులను ఏరవేసే పనిలో పడ్డాయి. భద్రతాబలగాలకు మావోయిస్టులకు జరుగుతున్న పోరుతో యుద్ధ వాతావరణం కనిపిస్తోంది. ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న పరిణామాలతో తెలంగాణ పోలీసులు అప్రమత్తతతో ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం ఏజెన్సీతో పాటు మొత్తం గోదావరి పరివాహక ప్రాంతాల్లో హైఅలర్ట్ వాతావరణం కనిపిస్తోంది. ఇటీవల తెలంగాణలో రెండు భారీ ఎన్‌కౌంటర్‌లు చోటు చేసుకున్నాయి. సెప్టెంబర్ 5న కరకగూడెం ఎన్‌కౌంటర్, డిసెంబర్ 1న చలపాక ఎన్‌కౌంటర్‌లు జరిగాయి. తెలంగాణలో మావోయిస్టులు ప్రవేశించకుండా కట్టుదిట్టమైన వాతావరణం కనిపిస్తోంది.

## నాపై గౌరవానికి కృతజ్ఞతలు: మమతా బెనర్జీ



**న్యూఢిల్లీ-నవభూమి:** 'ఇండియా' కూటమికి సారథ్యం వహించే విషయంలో తనకు మద్దతు తెలిపిన నేతలకు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ (%మీఖఎఖ్ఖ దీఖఅవతీయవవ%) కృతజ్ఞతలు తెలిపారు. పూర్బ మేదినీపూర్‌లో బుధవారంనాడు జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, తనపై గౌరవం, నమ్మకం వ్యక్తం చేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని అన్నారు. వారంతా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని, ఆ పార్టీలు కూడా బాగుండాలని, ఎన్డీయే కూడా బాగుండాలని కోరుకుంటుననట్టు చెప్పారు. 'ఇండియా' కూటమి పనితీరుపై మమతా బెనర్జీ గతవారంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. అవకాశం వస్తే కూటమికి సారథ్యం వహిస్తానన్నారు. ఇండియా కూటమిని తానే ఏర్పాటు చేశానని, దానిని నడపాల్సిన బాధ్యత తనపై ఉందని అన్నారు. ఇటు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిగా, అటు విపక్ష కూటమిని ముందుకు తీసుకువెళ్లే విషయంలోనూ రెండు బాధ్యతలు నిర్వహించగలిగే సామర్థ్యం తనకుందన్నారు. కాగా, ఇండియా కూటమికి మమతా బెనర్జీ సారథ్యం విషయంలో ఎన్‌సీపీ (ఎస్‌పీ)నేత శరద్ పవార్, బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ నుంచి మద్దతు వ్యక్తమైంది. కూటమికి సారథ్యం వహించే సమర్థత మమతా బెనర్జీకి నిశ్చయంగా ఉందని, దేశ ప్రముఖ నేతల్లో ఆమె ఒకరని పవార్ వ్యాఖ్యానించారు. పార్లమెంటుకు మమత ఎంపిక చేసి పంపిన నేతలంతా బాధ్యత కలిగిన, విధినిర్వహణకు కట్టుబడిన, ప్రజలకు బాగా సుపరిచితులైన వ్యక్తులని, ఆ దృష్ట్యా విపక్ష కూటమి సారథ్యం వహిస్తానని ఆమె అనడం సరైనదేనని అన్నారు. మమత నాయకత్వానికి లాలూ ప్రసాద్ బహిరంగంగానే మద్దతు ప్రకటించారు. మమతా బెనర్జీకి నాయకత్వం ఇస్తే తిరిగి కేంద్రంలో తాము ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సమాజ్‌వాదీ పార్టీ నుంచి కూడా మమతకు మద్దతు ఉంది. టీఎంసీతో తమకు మంచి అనుబంధం ఉందని, అదే సమయంలో కాంగ్రెస్‌తోనూ తమకు మంచి సంబంధాలున్నాయని సమాజ్‌వాదీ పార్టీ ప్రతినిధి రాజేంద్ర చౌదరి తెలిపారు. తామంతా 'ఇండియా' కూటమిలో భాగస్వాములైనందున టీఎంసీకి సపోర్ట్ చేసినంత మాత్రాన ఆ ప్రభావం కాంగ్రెస్-ఎస్‌పీ సంబధాలపై ఉండదని అన్నారు.

## గురుగ్రామ్‌లో బాంబు పేలుడు.. సంచలన ప్రకటన చేసిన లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్..



**న్యూఢిల్లీ-నవభూమి:** హర్యానాలోని గురుగ్రామ్ లో ఇటీవల సంభవించిన బాంబు పేలుడుకు సంబంధించి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సంచలన ప్రకటన వెలువరించింది. ఆ పేలుడు తమ పనే అని ప్రకటించింది. గురుగ్రామ్ సెక్టార్ 29లోని ఓ బార్ వెలుపల మంగళవారం నాటు బాంబు పేలింది. ఆ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు సచిన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి మరో రెండు నాటు బాంబులను కూడా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని అతడిని విచారిస్తున్నారు గురుగ్రామ్ బాంబు పేలుడు తమ పథకమే అని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన రోహిత్ గడర్, గోల్డీ బ్రార్ అనే వ్యక్తులు సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. ఇది చిన్న పేలుడే కదా అని తేలిగ్గా తీసుకోవద్దని, భారీ విధ్వంసం సృష్టించగల సత్తా తమకు ఉందని పేర్కొన్నారు. ఆ బార్ యజమాని అక్రమ మార్గం ద్వారా రూ.కోట్లు సంపాదిస్తూ పన్నులు ఎగ్గొడుతున్నారని, అందుకే అతడిని హెచ్చరించామని తెలిపారు. అందరూ సకాలంలో పన్నులు చెల్లించాలని సూచించారు. ఈ పోస్ట్‌పై పోలీసులు దృష్టి సారించి విచారణ ప్రారంభించారు. అన్ని రకాలుగానూ దర్యాప్తు చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా జైలులోనే ఉంటున్న లారెన్స్ బిష్ణోయ్ పేరు ఇటీవలి కాలంలో మార్మోగిపోతోంది. ఈ ఏడాది ఏప్రిల్ 14వ తేదీన బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్ ఇంటి బయట కాల్పుల ఘటన చోటు చేసుకుంది. ఆ కాల్పులు తమ పనే అని లారెన్స్ సోదరుడు అన్మోల్ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. దీంతో పోలీసులు అతడిపై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. అన్మోల్ ప్రస్తుతం విదేశాలలో తల దాచుకుంటున్నాడు. జైలులో ఉంటూనే సెల్‌ఫోన్ ద్వారా లారెన్స్ బిష్ణోయ్ నేరాలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

## ట్రంప్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి చైనా అధ్యక్షుడికి ఆహ్వానం



**న్యూఢిల్లీ-నవభూమి:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది జనవరి 20న అగ్రరాజ్యానికి 47వ అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఈ కార్యక్రమానికి ప్రపంచ దేశాధినేతలు హాజరుకానున్నారు. ఈ మేరకు ఇప్పటికే ఆహ్వానాలు కూడా పంపుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కు కూడా ఆహ్వానం పంపినట్లు తెలిసింది. ట్రంప్ అధ్యక్ష బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి రావాల్సిందిగా జిన్‌పింగ్‌ను ఆహ్వానించినట్లు సమాచారం. నవంబర్‌లోనే ఆహ్వానం పంపినట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా పేర్కొంటోంది. అయితే, ఈ వార్తలపై వాషింగ్టన్‌లోని చైనా రాయబార కార్యాలయం ఇప్పటి వరకూ స్పందించలేదు. ఇదిలా ఉండగా.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని ట్రంప్ ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో వెల్లడించిన విషయం తెలిసిందే.

# బైక్ టాక్సీల వేగానికి కళ్లెం..



**చెన్నై-నవభూమి:** రాష్ట్రంలో అడ్డూ అదుపూ లేకుండా విచ్చలవిడిగా తిరుగుతున్న బైక్ టాక్సీలను అదుపు చేయడానికి రాష్ట్ర రవాణా శాఖ సిద్ధమైంది. ఇందులో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించే బైక్ టాక్సీలను స్వాధీనం చేసుకోవడంతో పాటు వాటిని నడిపేవారికి కూడా జరిమానా విధిస్తామని రవాణాశాఖాధికారులు హెచ్చరించారు. రాజధాని నగరం చెన్నై సహా పలు నగరాల్లో ఆటోలు, టాక్సీల్లో ప్రయాణించినవారంతా ప్రస్తుతం తక్కువ ఛార్జితో బైక్‌ట్యాక్సీలపై వెళ్లటం ఆనవాయితీగా మారింది. దీంతో యేళ్లతరబడి ఆటోలను నడుపుతున్న కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో బైక్ టాక్సీలు ప్రయాణికులను తీసుకెళ్లటానికి బదులుగా వాణిజ్యపరమైన కార్యకలాపాలకు కూడా వినియోగిస్తున్నారు. ఓ వైపు నిరుద్యోగ యువకులు, విద్యార్థులు ఈ బైక్ టాక్సీలు నడపటం ద్వారా జీవితంలో నిలదొక్కుకుంటున్నారు. అయితే ఇటీవలి కాలంలో ఈ బైక్‌టాక్సీలు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదని, ఆటో స్టాండ్లలో సంచరిస్తూ ప్రయాణికులను తక్కువ ఛార్జీతో తమ బైకు ఎక్కమని ఒత్తిడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత రెండు రోజులు ఆటో కార్మిక సంఘాల నాయకులంతా ప్రాంతీయ రవాణా అధికారులకు బైక్ టాక్సీలపై ఫిర్యాదు చేశారు.
డ్రైవింగ్ లైసెన్స్ లేని కుర్రాళ్లంతా బైకులను రేస్ బైకుల్లా అత్యంత వేగంగా నడుపుతున్నారని, ఆటోలను ఆశ్రయించే ప్రయాణికులను మాయమాటలు చెప్పి బైకుల్లో తరలించుకపోయి తమ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపించారు. ఆటో కార్మిక సంఘాల విజ్ఞప్తిని పరిశీలించిన ప్రాంతీయ రవాణా అధికారులు బైక్ టాక్సీల వేగానికి కళ్లెం వేయాలని నిర్ణయించారు. ఇకపై రోజూ నగరంలో తిరిగే బైక్ టాక్సీలపై పోలీసులు నిఘా వేయాలని, మోటారు సైకిళ్లు, స్కూటీలు కండిషన్‌గా ఉన్నాయో లేదో తనిఖీ చేయాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను బైక్ టాక్సీలు తప్పక పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ నిబంధనలు బుధవారం నుండే అమలులోకి వస్తాయన్నారు. ఆహార వస్తువులను తీసుకెళ్లే బైకులను తనిఖీ చేయకూడదని, అదే సమయంలో ఆ బైకుల్లో పరిమితికి మించిన బరువుతో సరకులు తీసుకెళ్తే వాహనాన్ని సీజ్ చేయాలని పేర్కొన్నారు. ఈ విషయమై రవాణా శాఖ మంత్రి శివశంకర్ మాట్లాడుతూ... బైక్ టాక్సీలకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చిందని, అయితే రాష్ట్రంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాటిని నడుపుతుండటం వల్లే ప్రాంతీయ రవాణాధికారులు చర్యలు చేపట్టనున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో ఇన్సూరెన్స్, ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా బైక్ టాక్సీ నడుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.

## హైవేపై విమానం క్రాష్ ల్యాండ్.. తర్వాత ఏం జరిగిందంటే?

**వాషింగ్టన్:-నవభూమి:** చిన్న విమానం హైవేపై క్రాష్ ల్యాండ్ అయ్యింది. వాహనాలపై నుంచి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆ విమానం రెండు ముక్కలైంది. అయితే పైలట్‌తోపాటు ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అమెరికాలోని టెక్సాస్‌లో ఈ సంఘటన జరిగింది. బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ట్విన్ ఇంజన్ ప్రొపెల్లర్ విమానం విక్టోరియాలోని స్టేట్ హైవేపై చాలా తక్కువ ఎత్తులో ఎగిరింది. రహదారిపై వెళ్తున్న మూడు కార్లను ఢీకొట్టి క్రాష్ ల్యాండ్ అయ్యింది. ఈ ప్రమాదంలో ఆ విమానం రెండు ముక్కలైంది. దీంతో విమానం శిథిలాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి.

## ఓటీటీలోకి సత్యదేవ్ 'జీబ్రా'.. స్ట్రీమింగ్ ఎక్కడంటే..?



'జీబ్రా' అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చిన యువ నటుడు సత్యదేవ్ చాలా రోజులకు ఒక మంచి హిట్‌ను అందుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహించగా.. ఓల్డ్ టౌన్ పిక్చర్స్, పద్మ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఎస్ఎన్ రెడ్డి, బాలసుందరం, దినేష్ సుందరం సంయుక్తంగా నిర్మించారు. నవంబర్ 22న తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. అయితే థియేటర్ ప్రేక్షకులను అలరించిన ఈ చిత్రం తాజాగా ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను పంచుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక ఆహాలో ఈ సినిమా త్వరలోనే స్ట్రీమింగ్ కాబోతున్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా పోస్టర్‌ను పంచుకుంది.



## సుకుమార్.. బౌండ్ స్క్రిప్ట్‌తో పనిచేసే డైరెక్టర్ కాదు: రష్మిక


రష్మిక

అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన "పుష్ప 2: ది రూల్" సినిమా బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ గా నిలిచింది. అత్యంత వేగంగా 1000 కోట్ల క్లబ్ లో చేరిన ఇండియన్ మూవీగా సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. ప్రస్తుతం ఈ సక్సెస్ ను ఎంజాయ్ చేస్తున్న హీరోయిన్ రష్మిక మందన్న.. తాజాగా ఓ ఇంగ్లీష్ వెబ్ సైట్ ఇంటర్వ్యూలో పాల్గొంది. సినిమాకి సంబంధించిన పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. ఈ సందర్భంగా సుకుమార్ ను ప్రశంసిస్తూ.. ఆయన బౌండ్ స్క్రిప్ట్‌తో వర్క్ చేసే డైరెక్టర్ కాదని, సెట్స్‌కి వెళ్లినప్పుడు అప్పటికప్పుడు విషయాలను గుర్తిస్తారని తెలిపింది. "పుష్ప 2" సినిమాలో జాతర ఎపిసోడ్ లో పుష్పరాజ్ గా అల్లు అర్జున్ నటనతో పాటుగా, అతని భార్య శ్రీవల్లిగా రష్మిక మందన్న పెర్ఫార్మన్స్ కి కూడా ఆడియన్స్ నుంచి ప్రశంసలు దక్కుతున్నాయి. ఆ సీన్ లో శ్రీవల్లి తన బావపై కోపంగా ఎమోషనల్ గా మాట్లాడుతూ తనలోని అగ్రెసివ్ నెస్ ని చూపిస్తుంది. వెంటనే తన ఎక్స్ప్రెషన్ ని చేంజ్ చేసి 'రా సామీ' అంటూ పుష్పపై తనలోని కేరింగ్ సైడ్ ని చూపిస్తుంది. దాదాపు మూడు నాలుగు నిముషాలు ఉండే ఈ సన్నివేశంలో రష్మిక ఒక విధంగా ఏకపాత్రాభినయం చేసి అందరిని ఆకట్టుకుంది. ఇదే విషయాన్ని ఇంటర్వ్యూలో ప్రస్తావించగా.. అలాంటి కీలకమైన సీక్వెన్స్ షూట్ చేసేప్పుడు సెట్స్ లో ఆమె ఆలోచనలు ఎలా ఉన్నాయనేది రష్మిక వివరించింది. మనోళ్ళదే అసలు డామినేషన్ "నాకు గుర్తుంది నేను 'పుష్ప-2' షూటింగ్ స్టార్ట్ చేసినప్పుడే, డైరెక్టర్ సుకుమార్ వచ్చి నాకు శ్రీవల్లి పాత్ర ఆర్క్ గురించి చెప్పారు. ఆమెకు సినిమాలో ఒక హై మూమెంట్ ఉంటుందని చెప్పారు. సమయం వచ్చినప్పుడు దాని గురించి చెప్తాను.. కానీ నువ్వు మాత్రం మంచి పెర్ఫార్మన్స్ ఇవ్వాలి. నాకు దాని కోసం చాలా క్యూరియస్ గా ఎదురు చూసాను. మూవీలో 20 - 21 నిమిషాలు ఉండే జాతర సీక్వెన్స్ షూటింగ్ మొత్తం 3 - 4 నెలల పాటు జరిగింది. సుకుమార్ బౌండ్ స్క్రిప్ట్ తో వచ్చే వ్యక్తి కాదు.. అతను ప్రతీది సినిమా షూట్ జరిగే క్రమంలో రాసుకుంటూ వస్తారు. ఆ సీన్ షూట్ చేసే రోజు వచ్చినప్పుడు, అన్ని డిస్కషన్స్ అయిన తర్వాత సడన్ గా నాకు 3-4 పేజీల స్క్రిప్ట్ ఇచ్చారు. చూస్తే.. దాంట్లో నేను ఒక్కదాన్నే మాట్లాడే లైన్స్ ఉన్నాయి" "నేను మామూలుగా ఇంటరాక్టివ్ యాక్టర్ ని. ఏదైనా సీన్ చేస్తున్నప్పుడు కోస్టార్ చెప్పే డైలాగ్స్ ని బట్టి, వాళ్ళు ఎలా రియాక్ట్ అవుతారనే దాన్ని బట్టి.. నేను రియాక్ట్ అయి డైలాగ్స్ చెబుతుంటాను. కానీ 'పుష్ప 2'లో ఆ సీన్ చేస్తున్నప్పుడు అక్కడ ఎవరూ మాట్లాడటం లేదు. ఆమె ఒక్కతే చెబుతూ పోతోంది. 'పుష్ప' పార్ట్-1లో శ్రీవల్లి బావ ఇంటి పేరు.. ఇంటి పేరు అంటూ పుష్పరాజ్ ని ఇరిటేట్ చేస్తుంటాడు. కాబట్టి ఈ మూమెంట్ లో నేను అతని కోసం నిలబడాలి.. అది ప్రజలు పూర్తిగా నమ్మేలా ఉండాలి. ఆమె ఆ సమయంలో ప్రగ్నెంట్, అలసిపోయినట్లు కనిపించాలి. పక్కనే ఉన్న అమ్మ సైలెంట్ గా ఉండమని అంటే.. నీకేం తెలుసు నోరు మూసుకోమని చెప్పాలి. అలానే 'నీ కొడుకుని అంటే నువ్వు గమ్మగా ఉంటావేమో, ఎవరైనా నా మొగుడిని అంటే మాత్రం నేను సైలెంట్ గా ఉండను' అంటూ అత్తని వారించాలి" "ఏ మహిళ అయినా తన భర్తను ఎవరేమన్నా ఊరుకోదు. తన భర్త ఎప్పుడూ ఎత్తులోనే ఉండాలని కోరుకుంటుంది. ఎందుకంటే తన భాగస్వామిని దైవంగా భావిస్తుంది. ఆ విధంగానే జాతర సీన్ లో ఒక పక్క కోపం చూపిస్తూ ఏడుస్తూనే, మరో పక్క పుష్ప మీద ప్రేమను చూపించాలి. సో నేను ఆ సీన్ లో ఇంపాక్ట్ చూపించాలని అనుకున్నాను. జనాలు నన్ను ఎక్స్ప్రెషన్స్ క్వీన్ అంటుంటారు కాబట్టి, నేను దాన్ని ఉపయోగించాలి కదా(నవ్వుతూ). ఆ 3-4 నిమిషాల్లోనే కోపం, బాధ, నవ్వు, ప్రేమ.. ఇలా అన్ని భావోద్వేగాలు చూపించాలి. అందుకే ఇప్పుడు ఆ సన్నివేశాన్ని అందరూ మెచ్చుకుంటున్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి సీన్ చేసే అవకాశం నాకు దొరకలేదు. ఇప్పుడు అలాంటి సిచ్యుయేషన్ వచ్చింది కనుక నేను బాగా చేయాలని అనుకున్నాను.. బాగా నటించాను. నేను నిజంగా చాలా గ్రేట్ ఫుల్ గా ఫీల్ అవుతున్నాను" అని రష్మిక మందన్న చెప్పుకొచ్చింది. రష్మిక మందన్న చెప్పిన దాన్ని బట్టి డైరెక్టర్ సుకుమార్ బౌండ్ స్క్రిప్ట్‌తో పని చేయడని, సెట్స్ మీదకు వచ్చే వరకూ సీన్ పేపర్‌లో చేంజెస్ చేస్తుంటారనే విషయం తెలుస్తోంది.

నిజానికి సుక్కూ సైతం తాను స్పాట్ లో సన్నివేశాలను మారుస్తూ ఉంటానని గతంలో పలు సందర్భాల్లో చెప్పారు. బహుశా తాను రాసిన సీన్ పట్ల అసంతృప్తి ఉండటమో లేదా బెటర్ మెంట్ కోసమో తెలియదు కానీ, దర్శకుడు అప్పటికప్పుడు మార్పులు చేర్పులు చేస్తుంటారని అర్థమవుతోంది. అయితే ఈ వర్కింగ్ స్టైల్ కారణంగానే సుకుమార్ సినిమాలు లేట్ అవుతుంటాయని, అనుకున్న సమయానికి కంప్లీట్ కావనే విమర్శలు కూడా ఉన్నాయి. అందుకే ఇప్పుడు "పుష్ప 2" మూవీ పూర్తి చేయడానికి మూడేళ్ల సమయం పట్టిందనే అభిప్రాయాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఏదేమైనా సినిమా బ్లాక్ బస్టర్ గా నిలిచింది కాబట్టి, సుక్కూపై ఎలాంటి కంప్లెయింట్స్ లేవు. కానీ ఇప్పటి నుంచైనా దర్శకుడు కాస్త వర్కింగ్ స్టైల్ మార్చుకొని, ఫాస్ట్ గా సినిమాలు తీయాలని.. ఎక్కువ చిత్రాలను అందించాలని ఆయన అభిమానులు కోరుకుంటున్నారు.

## వేడుకగా నటి కీర్తి సురేష్ వివాహం





నటి కీర్తిసురేష్ వివాహం ఘనంగా జరిగింది. చివరి వరకూ పెళ్లి విషయంలో సస్పెన్స్ మెయింటెన్ చేసిన కీర్తి పది రోజులు ముందుగానే పెళ్లి విషయం చెప్పి అభిమానుల్ని సర్ ప్రైజ్ చేసింది. అప్పటి నుంచి కీర్తి సురేష్ ని పెళ్లి కూతురు దుస్తుల్లో ఎప్పుడు చూస్తామా? అన్న ఎగ్జైట్ మెంట్ అందరిలోనూ పెరిగిపోతుంది. తాజాగా ఆ పెళ్లి ఘట్టానికి సంబంధించిన ఫోటోలను స్వయంగా తానే సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. తన లాంగ్ టైమ్ బాయ్‌ఫ్రెండ్ ఆంటోని తట్టిల్‌ను వివాహం చేసుకుంది కీర్తి. నేడు గురువారం గోవా వేదికగా హిందూ సంప్రదాయంలో ఈ వివాహం జరిగింది. ఈ వివాహ వేడుకకు ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు. ప్రస్తుతం పెళ్లి ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి. పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు కొత్త జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. కీర్తి సురేష్ పసుపు, గ్రీన్ కలర్ కాంబినేషన్ చీర..రవిక ధరించింది. నుదిటిన బాసికం..పాపిడి బొట్టు..మెడలో పూల మాలలు....తలలో మల్లెపువ్వులు ధరించి ఎంతో అందంగా ముస్తాబైంది. కొత్త పెళ్లి కూతురు కళ్లద్దాలతో ఫోజులివ్వడం ఇప్పుడు ట్రెండ్ గామారింది. ఆ రకమైన బ్లాక్ గ్లాసెస్‌ని కీర్తి కళ్లకు ధరించింది. ఇక పెళ్లి కొడుకు కీర్తి మెడలో మూడు ముళ్లు వేస్తోన్న దృశ్యం చూడొచ్చు. ఆ సమయంలో కీర్తి భర్త వైపు చూస్తూ ఎంతో సంతోష పడుతుంది. మనోళ్ళదే అసలు డామినేషన్ మూడు ముళ్లు వేసిన అనంతరం భర్త ఆంటోనీ తట్టల్ కీర్తి నుదిటిన ప్రేమతో ముద్దాడారు. పెళ్లి కూతురు..పెళ్లి కొడు కులను పక్క పక్కనే కూర్చోబెట్టి పంతులు పెళ్లి క్రతవుకు సంబంధించిన పూజలు చేయించడం చూడొచ్చు. ఇక వివాహం అనంతరం కొత్త జంట మధ్యలోకి కీర్తి అమితంగా ఇష్టపడే మూగ జీవి కుక్క పిల్లను చూడొచ్చు. దంపతు లిద్దరు ఆ కుక్క పిల్లను ముద్దాడుతు ఫోటోలు దిగారు. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అలాగే కీర్తి- అంటోనీ క్రైస్తవమత ప్రకారం కూడా పెళ్లి చేసుకోవాల్సి ఉంది. ఆ పెళ్లి ఈరోజు సాయంత్రం ఓ చర్చిలో జరుగు తుందని తెలుస్తుంది.

## ఆహార అలవాట్లపై రూమర్స్.. మీడియాకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చిన సాయిపల్లవి



అగ్ర కథానాయిక సాయి పల్లవి గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ప్రేమమ్, ఫిదా, గార్గి సినిమాలతో తనకంటూ స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. రీసెంట్‌గా అమరన్ సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న ఈ భామ.. ప్రస్తుతం నాగ చైతన్యతో తండేల్ అనే సినిమా చేస్తుంది. అయితే సాయి పల్లవి వెజిటేరియన్ అన్న విషయం తెలిసిందే. ఇప్పటికే చాలా ఇంటర్వ్యూలో ఈ విషయం గురించి ప్రసావించింది. అయితే తాజాగా బాలీవుడ్ రామాయణం సినిమా కోసం సాయి పల్లవి నాన్ వెజ్ మానేస్తుందంటూ తమిళ మీడియా ఒక కథనం ప్రచురించింది. దీంతో ఈ విషయం వివాదం అవ్వగా.. దీనిపై సాయి పల్లవి స్పందిస్తూ.. మీడియాకు వార్నింగ్ ఇచ్చింది. తమిళ అగ్ర మీడియా రామాయణ్ సినిమా గురించి రాస్తూ.. "సాయి పల్లవి ఇప్పుడు బాలీవుడ్‌లో రామాయణం అనే ప్రాజెక్ట్‌లో నటించబోతుంది. దీనికోసం షూటింగ్ ముగిసే వరకు ఎలాంటి నాన్ వెజ్ ముట్టుకోకూడదని తాను నిర్ణయించుకున్నట్లు తెలిపింది. అలాగే మంసాహారం తినకుండ విదేశాలకు వెళ్లినప్పుడు తనతో పాటు చెఫ్‌ను కూడా వెంట తీసుకువెళుతుంది. ఈ చెఫ్ సాయిపల్లవి కోసం వెజ్ డిన్నర్ తయారు చేస్తారు" అంటూ రాసుకోచ్చింది. అయితే దీనిపై ఘాటుగా స్పందించింది సాయి పల్లవి

చాలా సార్లు, దాదాపు ప్రతిసారి.. నా మీద వచ్చే పుకార్లు లేదా తప్పుడు వార్తలను పట్టించుకోను. ఈ విషయం దేవునికి కూడా తెలుసు. ముఖ్యంగా నా సినిమా రిలీజ్‌లు, అనౌన్స్‌మెంట్‌లు వచ్చినప్పుడు ఇలాంటివి ఎక్కువగా వ్యాపిస్తాయి. అయితే ప్రతిసారి ఇలా అవుతుంటే మాత్రం స్పందించక తప్పదు. నెక్ట్ టైం ఇలాంటి తప్పుడు వార్తలను అగ్ర మీడియాలు కానీ వాటికి చెందిన సోషల్ మీడియా పేజీలు కానీ ప్రచురిస్తే నా తరపు నుంచి చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది అంటూ సాయి పల్లవి రాసుకోచ్చింది.

నవక్రీడ

## లిండే ఆల్‌రౌండ్ షో పాక్‌పై దక్షిణాఫ్రికా విజయం



**డర్బన్-నవభూమి:** పాకిస్థాన్‌తో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో దక్షిణాఫ్రికా అదిరిపోయే బోణీ కొట్టింది. బుధవారం జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 11 పరుగుల తేడాతో పాక్‌పై విజయం సాధించింది. తొలుత డేవిడ్ మిల్లర్(40 బంతుల్లో 82, 4ఫోర్లు, 8సిక్స్‌లు) అర్ధసెంచరీకి తోడు జార్జ్ లిండే(24 బంతుల్లో 48, 3ఫోర్లు, 4సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో నిర్ణీత 20 ఓవర్లలో 183/9 స్కోరు చేసింది.

షాహిన్ ఆఫ్రిదీ(3/22), అబ్రార్ అహ్మద్(3/37) మూడేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన పాక్..లిండే(4/21) ధాటికి 20 ఓవర్లలో 172/8 పరిమితమైంది.

## గాయత్రి, త్రిసా జోడీ ఓటమి



**హాంగ్జౌ-నవభూమి:** ప్రతిష్ఠాత్మక బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో భారత యువ జోడీ గాయత్రి గోపీచంద్, త్రిసాజాలీకి శుభారంభం దక్కలేదు. బుధవారం జరిగిన మహిళల డబుల్స్ తొలి రౌండ్ పోరులో గాయత్రి గోపీచంద్, త్రిసా జాలీ 22-20, 20-22,14-21తో చైనాకు చెందిన లు షెంగ్ షు, టాన్ నింగ్ ద్వయం చేతిలో ఓటమిపాలైంది. ఆద్యంతం హోరాహోరీగా సాగిన పోరులో గాయత్రి, త్రిసా తొలి గేమ్‌ను కైవసం చేసుకుని జోరు కనబరిచారు. కానీ పారిస్ ఒలింపిక్స్ రజత విజేత అయిన షెంగ్ షు, టాన్ నింగ్ అద్భుతంగా పుంజుకుని పోటీలోకి వచ్చారు. నెట్ గేమ్‌తో పాటు కండ్లు చెదిరే స్మాష్‌లతో చెలరేగిన చైనా ద్వయం 17-12తో ఆధిక్యం కనబరిచింది. అయినా వెనుకకు తగ్గని భారత జంట 18-18తో డ్రా చేసినా చివరకు గేమ్‌ను చేజార్చుకున్నారు. మూడో గేమ్‌లో మరింత దూకుడు పెంచిన చైనా షట్లర్లు మ్యాచ్‌ను కైవసం చేసుకున్నారు.

## ఒలింపిక్స్‌లో క్రికెట్.. బ్రిస్బేన్ కమిటీతో ఐసీసీ చైర్మెన్ జే షా భేటీ



**బ్రిస్బేన్-నవభూమి:** ఒలింపిక్స్ క్రీడల్లో మళ్లీ క్రికెట్‌కు చోటు ఇవ్వనున్నారు. 128 ఏళ్ల తర్వాత జెంటిల్మెన్ ఆట మళ్లీ ఒలింపిక్స్‌లో కనిపించనున్నది. 2028లో జరిగే లాస్ ఏంజిల్స్ క్రీడల్లో క్రికెట్ ఆడనున్నారు. అయితే 2032లో బ్రిస్బేన్‌లో జరిగే ఒలింపిక్స్‌లో.. క్రికెట్‌కు అవకాశం కల్పించే అంశంపై ఇవాళ చర్చ జరిగింది. కొత్తగా నియమితుడైన ఐసీసీ చైర్మెన్ జే షాఆ మీటింగ్‌లో పాల్గొన్నారు. బ్రిస్బేన్ ఒలింపిక్స్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులతో ఆయన మాట్లాడారు.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**